ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
ప్రకాశం
జిల్లా వార్తలు
మంగళవారం 11, ఫిబ్రవరి 2025


ఒంగోలు లాయర్‌పేట వద్ద రైతు బజార్‌లో మూతపడిన షాపులు

ఒంగోలులో మూడు రైతు బజార్లను ఏర్పాటు చేశారు. ఒక్కో దానిలో 50 నుంచి 70 వరకూ దుకాణాలు అందుబాటులోకి తెచ్చారు. మొదట్లో బాగానే నడిచినా ప్రస్తుతం ప్రతి దానిలో సగం వరకు ఖాళీగా ఉన్నాయి. నడుస్తున్న దుకాణాలలోనూ రైతులు కాకుండా ఎక్కువ శాతం వ్యాపారులే ఉంటున్నారు. ధరలు కూడా సాధారణ మార్కెట్ మాదిరిగానే ఉంటుండటంతో నగర వాసులు అటువైపు వెళ్లడం తగ్గించారు.

యర్రగొండపాలెంలో గత ఏడాది డిసెంబరు 17న రైతు బజార్‌ను ఏర్పాటు చేశారు. మొత్తం 38 దుకాణాలు ఉన్నాయి. మొదట్లో ఐదు షాపుల్లో విక్రయాలు చేశారు. ఊరికి దూరంగా ఉండటంతో కొనుగోలుదారులు రాక వాటిని మూసేశారు.

మార్కాపురం ప్రస్తుతం జిల్లాలో రెండో పెద్ద పట్టణం. జనాభా కూడా లక్షకుపైగానే ఉంది. నేటికీ పూర్తిస్థాయి రైతు బజార్ ఒక్కటి కూడా ప్రజలకు అందుబాటులో లేదు. స్థానిక కూరగాయల మార్కెట్‌లో రైతులు వారి ఉత్పత్తులను అమ్ముకునేందుకు ఓ ప్లాట్‌ఫాం ఏర్పాటు చేసినా అక్కడ కూడా దళారులే రాజ్యమేలుతున్నారు. కొద్దిమంది రైతులు మాత్రమే అక్కడ ఆకుకూరలు అమ్ముతున్నారు.


మార్కాపురంలో రైతులకు కేటాయించిన ప్లాట్‌ఫాంపై కూరగాయలు అమ్ముతున్న వ్యాపారులు

బహిరంగ మార్కెట్‌లో కూరగాయల ధరలను నియంత్రించేందుకు గతంలో టీడీపీ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా దాదాపు అన్ని పట్టణాల్లోనూ రైతు బజార్లను ఏర్పాటు చేసింది. అయితే అవి లక్ష్యానికి దూరంగా నడుస్తున్నాయి. అంతా ప్రైవేటు వ్యాపారుల కనుసన్నల్లో దళారులే రైతుల అవతారమెత్తి కూరగాయలు అమ్ముతున్నారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ఉత్పత్తులను తెచ్చే రైతులు హోల్‌సేల్ వ్యాపారులు ఎంత ధర నిర్ణయిస్తే అంతకే అమ్ముకుని వెనుదిరిగి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.

రైతుల్లేరు.. జనం రారు!

పేరుకే రైతు బజార్లు

- అంతా వ్యాపారులదే రాజ్యం
- ఉన్నత ఆశయంతో ఏర్పాటు
- ప్రస్తుతం లక్ష్యానికి దూరం
- రైతులు పండించిన కూరగాయలు దళారులకే విక్రయం
- సాధారణ మార్కెట్ మాదిరిగానే ధరలు
- ఫలితంగా అన్నిచోట్లా తగ్గిన కొనుగోళ్లు
- 50శాతానికి పైగా దుకాణాలు ఖాళీ

ఒంగోలు కలెక్టరేట్/మార్కాపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన కూరగాయలకు గిట్టుబాటు ధరలు కల్పించడంతోపాటు ప్రజలకు తక్కువ రేట్లకే అందించేందుకు ఉద్దేశించి ఏర్పాటు చేసిన రైతు బజార్లు రోజురోజుకూ ప్రాభవాన్ని కోల్పోతున్నాయి. కొనుగోలుదారులు రావడం తగ్గిపోతుండటంతో షాపులు ఖాళీ అవుతున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ముందుచూపుతో రాష్ట్రవ్యాప్తంగా రైతు బజార్లను ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రమైన ఒంగోలులోని లాయర్‌పేట, దిబ్బల రోడ్డు, కొత్తపట్నం బస్టాండ్‌లలో వీటిని తెరిచారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యర్రగొండపాలెంలోనూ ప్రారంభించారు. రైతులు పండించిన కూరగాయలు నేరుగా ఆయా బజార్లకు తీసుకొచ్చి విక్రయించుకోవడమే వీటి ప్రధాన లక్ష్యం. తదనుగుణంగా అప్పట్లో అధికారులు చర్యలు తీసుకున్నారు. మార్కెట్ కంటే అక్కడ కూరగాయల ధరలు తక్కువగా ఉండటంతో ఒకప్పుడు ఒక వెలుగు వెలిగాయి. రానురాను రైతులు ఆ కేంద్రాలకు దూరమయ్యారు. కొంత మంది చిరువ్యాపారులు నేరుగా రైతుల వద్దనే కొనుగోలు చేసి వాటిలో విక్రయిస్తూ వస్తున్నారు. ప్రస్తుతం ఆయా రైతు బజార్లలో సగం షాపులు ఖాళీగా ఉన్నాయి. మార్కెట్‌లో మాదిరిగానే రైతు బజార్లలో ధరలు ఉండటం, మళ్లీ

మిగతా 6వ పేజీలో


ఒంగోలులోని కొత్తపట్నం బస్టాండ్ వద్ద రైతు బజార్‌లో ఖాళీగా ఉన్న షాపులు

పెరిగిన తోపుడు బండ్ల వ్యాపారులు

జిల్లా కేంద్రమైన ఒంగోలులో తోపుడు బండ్ల వ్యాపారం పెరిగింది. ఈ కాలనీ, ఆ కాలనీ అన్న తేడా లేకుండా ఉదయం సమయంలో విస్తృతంగా కూరగాయల అమ్మకాలు చేస్తున్నారు. ఇంకోవైపు రోడ్లపై చిన్నచిన్న దుకాణాల్లో కూడా కూరగాయల వ్యాపారం విస్తరించింది. దాని వల్ల ఇప్పుడు నడిబొడ్డున ఉన్న రైతు బజార్లలో కొనుగోళ్లు తగ్గిపోయాయి. తోపుడు బండ్ల వ్యాపారుల వద్ద కూరగాయలు తాజాగా ఉండటం, ఇంటి వద్దకే వస్తుండటంతో జనం వాటి కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. రైతుబజార్లలో అమ్మకాలు తగ్గిపోవడానికి ఇది కూడా ఒక కారణమైంది.

గతం కంటే ఇప్పుడే కొంత మేలు

గతంలో కంటే ప్రస్తుతం రైతు బజార్లలో వ్యాపారం కొంతమేర పెరిగింది. వాటిని పూర్తి స్థాయిలో విస్తరించేందుకు చర్యలు తీసుకున్నాం. రాష్ట్రప్రభుత్వం కూడా అందు కోసం దిశానిర్దేశం చేసింది. కూరగాయలు పండించిన చిరు రైతులే నేరుగా రైతు బజార్లకు వచ్చి విక్రయాలు చేసేలా చర్యలు చేపడుతున్నాం.

- ఉపేంద్ర, మార్కెటింగ్ శాఖ ఏడీ

'గీత' కార్మికులకు దుకాణాలు

- లాటరీ పద్ధతిలో 17 మద్యం షాపులు కేటాయింపు
- 15 రోజుల వరకు ప్రొవిజన్ లైసెన్స్‌లు

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కల్లుగీత కార్మికులకు ప్రభుత్వం చెప్పిన మాట ప్రకారం మద్యం దుకాణాలను లైసెన్స్ ఫీజులో సగం ధరకే ఇచ్చింది. వారి జీవనోపాధికి భరోసా కల్పించింది. జిల్లాకే కేటాయించిన 17 షాపులకు 159 దరఖాస్తులు రాగా అధికారులు లాటరీ పద్ధతిలో దుకాణాలను కేటాయించారు. వాటిని దక్కించుకున్న వారికి ప్రొవిజన్ లైసెన్స్‌లు అందజేశారు. దరఖాస్తుల ద్వారా రూ.3.18 కోట్లు ఎక్సైజ్ శాఖకు ఆదాయం వచ్చింది. సోమవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న నేతృత్వంలో లాటరీ ప్రక్రియ జరిగింది. జిల్లాలో ఎంపిక చేసిన 17 దుకాణాలకు ఒక్కో దానికి వచ్చిన దరఖాస్తులను లాటరీ వేసి లైసెన్సీని ఎంపిక చేశారు. నాగరాజు అనే వ్యక్తికి మర్రిపూడి, అర్ధవీడు, సంతనూతలపాడు మద్యం దుకాణాలు లభించాయి. నిబంధనల ప్రకారం ఒక వ్యక్తికి ఒకటే దుకాణం కేటాయించాల్సి ఉండటంతో నాగరాజు మర్రిపూడి కోరుకున్నారు. మిగిలిన రెండు దుకాణాలను రిజర్వులో ఉన్న వారికి కేటాయించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ విజయ, ఈఎస్ ఖాజామొహిద్దీన్, ఏఈఎస్‌లు ఎర్రా వెంకట్, బాలయ్య పాల్గొన్నారు.


లాటరీ తీసి షాపు దక్కించుకున్న వారి నంబర్‌ను చూపుతున్న ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, పక్కన ఎక్సైజ్ ఏసీ విజయ, ఈఎస్ ఖాజామొహిద్దీన్

వద్దన్నా.. వినరే!

- అవినీతి, వేధింపుల అధికారికి మళ్లీ పాత పోస్టు
- ఐదుసార్లు మెమోలు, మూడుసార్లు హెచ్చరికలు
- మారకపోవడంతో డంపింగ్ యార్డుకు బదిలీ
- పది రోజుల్లోనే తిరిగి శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు

వివరాలు 7వ పేజీలో

ఆత్మార్పయామి!

ఇంట్లో ఆత్మలున్నాయని భయపెట్టి పురోహితుడి కుటుంబాన్ని ఊడ్చేసిన మధురై ముఠా

- 400 గ్రాముల బంగారాన్ని కాజేసిన వైనం
- మహిళ మెడలో మంగళసూత్రం కూడా స్వాహా
- విచారణ చేపట్టిన పోలీసులు
- అదుపులో కొందరు నిందితులు

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఆత్మల పేరుతో బురిడీ కొట్టించి సుమారు రూ.30 లక్షల విలువైన బంగారాన్ని మధురై ముఠా కాజేసింది. బాధితుల ఫిర్యాదు మేరకు సుమారు నెల క్రితం కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తును వేగవంతం చేసి ఈ ముఠాలో కొంతమందిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. ఒంగోలులో పౌరోహిత్యం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కుటుంబ పెద్ద అనారోగ్యం పాలయ్యాడు. ఎక్కడ వైద్యం చేయించినా తగ్గకపోవడంతో మధురైలో ఉన్న మరో పురోహితుడిని ఆ పెద్దాయన కుమారుడు ఆశ్రయించాడు. దీంతో గతేడాది నవంబరులో రాత్రి 11 గంటలకు మధురై నుంచి ఎనిమిది మంది సభ్యుల ముఠా ఒంగోలు చేరుకుంది. బాధితుడి ఇల్లంతా కలియ తిరిగి ఇంట్లో ఆత్మలు తిరుగుతున్నాయని యజమానితోపాటు కుటుంబసభ్యులను ఆ ముఠా సభ్యులు భయపెట్టారు. కొన్ని పూజలు చేస్తే అంతా మంచి జరుగుతుందని చెప్పారు. పూజ తర్వాత ఇంట్లో కాసు బంగారం కూడా ఉండటానికి వీల్లేదు, ఉంటే మరలా ఆత్మలు ప్రవేశిస్తాయని నమ్మించారు. ఈ మొత్తం బంగారాన్ని ఇంట్లో తిరుగుతున్న ఆత్మలతో కలిపి తగులబెడతామని చెప్పారు. మంగళసూత్రంతో సహా ఇవ్వాల్సిందేనని గట్టిగా చెప్పారు. అంతేకాకుండా ఆ పెద్దాయన సొంత గ్రామం ఒంగోలు సమీపంలో ఉండటంతో అక్కడకు వెళ్లి శ్మశానంలో తవ్వి ఎముకలు తీశారు. అక్కడ ఎముకలు, బంగారం, ఆత్మలను కలిపి తగులబెడుతున్నట్లు చెప్పి మంటలు వేశారు. అనంతరం ఆ యజమానికి సంబంధించిన ఇన్నోవా కారు వేసుకొని దర్జాగా వెళ్లారు. కారును ఎంతకీ వెనక్కి పంపకపోవడంతో బాధితులకు అనుమానం వచ్చింది. కొద్దిరోజుల అనంతరం జనవరి 25న ఆ ఇంటి పెద్ద కుమారుడు ఒంగోలు ఒన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన వారు మధురై వెళ్లి ముఠాలోని కొంతమందిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.




కంభంలోని పరీక్ష కేంద్రం వద్ద వేచి ఉన్న వలస విద్యార్థులు

బీఈడీ గారడీ..!

- జిల్లాలో 150కి పైగా బోగస్ కాలేజీలు
- సగానికిపైన బోర్డులు కూడా కనిపించవు
- పరీక్షల సమయంలోనే విద్యార్థుల రాక
- దొడ్డిదారిన ఉపాధ్యాయ పట్టాలు ఇచ్చి రూ.కోట్లు సంపాదిస్తున్న యాజమాన్యాలు
- మామూళ్ల మత్తులో వర్సిటీ అధికారులు

కంభం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో డ్రగ్స్ మాఫియా కంటే అత్యంత ప్రమాదకరంగా విద్యా వ్యాపారం కొనసాగుతోంది. బోగస్ బీఈడీ కళాశాలల యాజమాన్యాలు ఏటా కోట్ల రూపాయలు అక్రమంగా సంపాదిస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. వలస పక్షుల్లా వస్తున్న ఇతర రాష్ట్రాల విద్యార్థులతో ఈ విద్యావ్యాపారం 'మూడు పువ్వులు.. ఆరు కాయలు' అన్న చందంగా వర్ధిల్లుతోంది.

'గిద్దలూరు'లోనే సుమారు 35 కాలేజీలు

ఒక్క గిద్దలూరు నియోజకవర్గంలోనే విద్యావ్యాపారం చేస్తున్న కాలేజీలు 35 వరకు ఉన్నట్లు సమాచారం. కంభం మండలంలో 15 ఉన్నాయి. ఇలా జిల్లావ్యాప్తంగా 150కిపైనే ఉంటాయని అంచనా. వీటిల్లో చాలా కాలేజీల బోర్డులే కనిపించవు. పరీక్షల సమయంలో మాత్రమే విద్యార్థులు వస్తుంటారు. మిగిలిన రోజుల్లో అక్కడ ఎవరూ కనిపించరు. విద్యార్థులకు దొడ్డిదారిన

మిగతా 6వ పేజీలో

బీఈడీ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. తరగతులకు రాకుండానే పరీక్షలు రాసే విద్యార్థుల రాకతో కంభం మండలం కిటకిటలాడింది. ఒక్క కంభం మండలానికే సుమారు 2 వేల మంది విద్యార్థులు వచ్చి ఉంటారని అంచనా. ఇక గిద్దలూరు, బేస్తవారపేట, రాచర్ల, తదితర ప్రాంతాల్లోనే కాక జిల్లాలోని ఇతర చోట్ల కూడా లాడ్జిలు, అద్దె రూములు కళకళలాడుతున్నాయి. కొంతమంది ఏజెంట్లు రెండు రోజుల ముందుగానే అడ్వాన్సులు ఇచ్చి గదులు బుక్ చేసుకున్నారు. రోజుకు రూ.500 ఉండే లాడ్జి గదికి ఒక్కొక్కరి దగ్గర రూ.1,000 వసూలు చేసి ఒక్కోదానిలో 10 మంది వరకు విద్యార్థులను ఉంచి సొమ్ము చేసుకుంటున్నారు. కొన్ని కళాశాలల యాజమాన్యాలు కళాశాల ఆవరణలో ఉన్న గదులను అద్దెలకు ఇస్తున్నాయి. అన్ని సదుపాయాలు, టిఫిన్, భోజనాలు ఏర్పాటు చేసి అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పుట్టగొడుగుల్లా పుట్టుకు వచ్చిన బోగస్ బీఈడీ కళాశాలలపై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వలస విద్యార్థులతో ఆయా ప్రాంతాలు రద్దీ

శివాచారి మృతదేహం వద్ద మూడేళ్ల కుమారుడితో ఆయన భార్య



అధికారుల చొరవతో ముగిసిన అంత్యక్రియలు

- మూడు రోజులుగా ఇంటి ముందు మృతదేహం
- అత్తా, కోడళ్ల మధ్య ఆస్తి వివాదాలే కారణం

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల నుంచి నలుగుతున్న వ్యవహారంలో యువకుడి మృతదేహానికి అంత్యక్రియలను అధికారుల చొరవతో సోమవారం నిర్వహించారు. పట్టణానికి చెందిన శివాచారి హైదరాబాద్‌లో కుటుంబంతో ఉంటూ మృతి చెందగా శవాన్ని భార్య సొంతింటికి తీసుకొచ్చింది. ఆమెతో మృతుడి తల్లి, సోదరి గొడవపడడంతో అంత్యక్రియలు నిలిచిన విషయం విదితమే. సోమవారం పత్రికల్లో వార్త ప్రచురితం కావడంతో జిల్లా యంత్రాంగం ఈ అంశంపై సీరియస్‌గా స్పందించింది. గిద్దలూరు అర్బన్ సీఐ కె.సురేష్, మునిసిపల్ కమిషనర్ వెంకటదాస్, తహసీల్దార్ ఆంజనేయరెడ్డిలు తమ సిబ్బందిని పురమాయించారు. వారు శివాచారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. సోమవారం అంత్యక్రియలు జరిగేలా చూశారు. ఆస్తి తగాదాలే ప్రధాన కారణంగా ఈ రాద్ధాంతం జరగడం చర్చనీయాంశమైంది.

తాగేందుకు నీరు ఇవ్వండి సారూ!

- 10 రోజులుగా సరఫరా లేక ఇబ్బందులు
- వైపాలెంలో ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద రెండు కాలనీల మహిళల ధర్నా
- ట్యాంకర్ ద్వారా సరఫరా చేసిన అధికారులు

ఎర్రగొండపాలెం రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తాగేందుకు, వాడుకునేందుకు నీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటూ ఎర్రగొండపాలెంలోని ఎన్టీఆర్ నగర్, ఇందిరమ్మ కాలనీకి చెందిన మహిళలు సోమవారం స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రెండు కాలనీలలో సుమారు 200 కుటుంబాలు ఉన్నాయన్నారు. 10 రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయిందని చెప్పారు. ఈ సమస్యను గ్రామ సర్పంచ్‌కు, పంచాయతీ కార్యదర్శికి తెలిపినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో నీరు సరఫరా చేసే కార్యాలయ సిబ్బందిని అడిగేందుకు వచ్చామన్నారు. ముందుగా జాతీయ రహదారిపై మహిళలు, చిన్నారులు, పెద్దలు బైఠాయించారు. దీంతో ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులు స్పందించారు. వారి ఆదేశాల మేరకు కాలనీలలో ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేసినట్లు జేఈ జడ్సన్‌పాల్ తెలిపారు.


ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మహిళలు

రైతుల్లేరు.. జనం రారు!

(5వ పేజీ తరువాయి)

చిరు వ్యాపారులు వీధి వ్యాపారులకు అధిక ప్రాధాన్యం ఇస్తుండటంతో రైతు బజార్లలో ఉన్న షాపులు ఖాళీగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒక్కో రైతు బజారులో 50 నుంచి 70 షాపుల వరకు ఉండగా 30మంది మాత్రమే విక్రయాలు చేస్తున్నారు. అవిపోను ఖాళీగా ఉన్న మిగిలిన వాటిలో కూరగాయలకు వచ్చే బాక్సులు, సైకిళ్లు, వివిధ రకాల వస్తువులను నిల్వ చేసుకుంటున్నారు.

ఆటోల్లోనూ అమ్మకాలు

ఆటోల్లో కూడా కూరగాయలు తెచ్చి అమ్ముకునేవారు కూడా పెరిగిపోయారు. కొంతమంది రైతుల వద్దనే నేరుగా కొనుగోలు చేసి కాలనీల్లో అమ్మకాలు చేస్తున్నారు. కొందరు చిన్నచిన్న సెంటర్లలో రోడ్డుపై కూరగాయలు పోసుకుని అమ్ముతున్నారు. మార్కెట్, రైతుబజార్లకంటే తక్కువ ధరలకే కిలోల చొప్పున విక్రయిస్తున్నారు. సాధారణంగా రైతు బజార్లలో మహిళల కంటే పురుషులే ఎక్కువగా కొనుగోలు చేసేవారు. అయితే ప్రస్తుతం ఇళ్ల వద్దకే వస్తుండటంతో మహిళలు ఏ రోజుకారోజు ఆటోల వద్ద, తోపుడు బండ్ల వద్ద కూరగాయలు కొనుగోలు చేస్తున్నారు.

బీఈడీ గారడీ

(5వ పేజీ తరువాయి)

బీఈడీ పట్టాలు ఇస్తూ సంబంధిత కళాశాల యాజమాన్యాలు కోట్ల రూపాయలు సంపాదిస్తున్నా ఎలాంటి చర్యలు లేకపోవడం గమనార్హం.

ఒక్కో విద్యార్థి నుంచి రూ.లక్ష నుంచి లక్షన్నర వరకు వసూలు

ఒంగోలు, దర్శి, చీమకుర్తి, గిద్దలూరు, మార్కాపురం, కంభం, బేస్తవారపేట, రాచర్లలో ఉన్న బోగస్ బీఈడీ కళాశాలలకు పరీక్షలు రాసేందుకు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, పశ్చిమబెంగాల్, జార్ఖండ్ తదితర రాష్ట్రాల నుంచి దళారుల ద్వారా విద్యార్థులు వస్తుంటారు. వీరికి ఎటువంటి తరగతులు కానీ, ప్రాక్టికల్స్ కానీ నిర్వహించరు. పాస్ గ్యారెంటీ పేరుతో వీరిని బుట్టలో పడేస్తారు. ఒకవేళ పరీక్షకు రాలేకపోయినా వారి స్థానంలో వేరే వారి చేత రాయించేలా ఒప్పందం చేసుకుని ఒక్కో విద్యార్థి నుంచి లక్ష రూపాయల నుంచి రూ.1.50 లక్షల వరకు దండుకుంటున్నారు. ఈ వసూలులో కొంత యూనివర్సిటీ అధికారులకు ఇచ్చి పాస్ చేయిస్తున్నారన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. తనిఖీల పేరుతో వస్తున్న అధికారులు భారీ మొత్తంలో మామూళ్లు తీసుకుని బోగస్ బీఈడీ కళాశాలలపై చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

అంబడిపూడిలో లేగ దూడల ప్రదర్శన పోటీలు

బల్లికురవ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంబడిపూడి గ్రామం లో సోమవారం పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో సోమవారం మేలు జాతి లేగ దూడల ప్రదర్శన పోటీలు జరిగాయి. ఈసందర్భంగా పశు వైద్యశాలకు పలు గ్రామాల నుంచి 38 మంది రైతులు 56 లేగ దూడలను ప్రదర్శనకు తీసుకొచ్చారు. ఈసందర్భంగా ఆంధ్రప్రదేశ్ పశు గణాభివృద్ధి శాఖ సీఈవో డాక్టర్ శ్రీనివాసరావు లేగ దూడల ప్రదర్శను ప్రారంభించారు. అనంతరం ముగ్గురు రైతులను లేగ దూడలు బాగా పెంచుతున్నట్లు గుర్తించి పోషకులకు బహుమతులను అందజేశా రు. దూడల కోసం పౌష్టికాహార ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో లేగ దూడల మరణాలు ఏ టా ఒక సీజన్‌లో ఉంటున్నాయని దానిని నిరోధించేందుకు గ్రామాలలో రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టి వారికి సలహాలు సూచనలు చేసేందుకు దూడల ప్రదర్శన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. రైతులు పాడి పరిశ్రమ వృద్ధిలోకి వచ్చేలా పశు సంవర్థక శాఖకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఈవో డీఎల్‌డీఏ చంద్రశేఖర్, డీడీ రమేష్‌బాబు, బాపట్ల డీఏహెచ్‌వో వేణుగోపాల్, డీఎల్‌డీఏ ఉష, వైద్యాధికారులు మహేశ్వరరావు, పావనీకుమారి, పశు పోషకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేదలకు నివేశన స్థలాలు మంజూరు చేయాలి

చీరాలటౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ పరిధిలోని నిరుపేదలకు నివేశన స్థలాలను ప్రభుత్వం మంజూరు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మూడు నెలల కిందటే అర్జీలు అందజేసిన వాటిపై దృష్టిసారించడంలో నిర్లక్ష్యం జరిగినట్లు ఆరోపించారు. ఇప్పటికే సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బత్తుల శామ్యేల్, చిరుమల ప్రకాష్, ఏఐటీయూసీ నాయకులు అచ్యుతుని బాబురావు, బాసి పైడయ్య, రాజశేఖర్, వీరాంజనేయులు, దేవతోటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రశాంతంగా బీఈడీ పరీక్షలు

ఒంగోలు(రూరల్),ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): బీఈడీ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని ఏకేయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ అధికారి డాక్టర్ కేవీఎస్ రాజు అన్నారు. ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం పరిధిలో సోమవారం నుంచి ప్రారంభమైన బీఈడీ పరీక్షా కేంద్రాలను రాజు పరిశీలించారు .ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకేయూ పరిధిలో 11,279 మంది విద్యార్థులు 40పరీక్షా కేంద్రాలలో బీఈడీ పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. పరీక్షలలో మాస్‌కాపీయింగ్ లాంటివాటిని పూర్తిగా నివారించామన్నారు. ఎక్కడైనా కాపీయింగ్ జరిగితే కఠిన చర్యలు తీసుకొంటామన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో ఒకపరిశీలకుడు, స్క్వాడ్‌ను నియమించినట్లు తెలిపారు. మొదటిరోజు మార్కాపురం ప్రాంతంలోని వాసవి కన్యకాపరమేశ్వరి, వేమన డిగ్రీకళాశాల, ఐడియల్ అండ్ కృష్ణ చైతన్యడిగ్రీకళాశాలలలో జరుగుతున్న పరీక్షలను ఆకస్మికంగా పరిశీలించామన్నారు. ఈకార్యక్రమంలో ఆయన వెంట విశ్వవిద్యాలయ పీజీ కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్ .శ్రీనివాస్ ఉన్నారు.



పట్టుబడిన తవుడు బస్తాలను పరిశీలిస్తున్న విజిలెన్స్ సీఐ రాఘవరావు, పశు సంవర్థక శాఖ ఏడీఏ హెచ్ పురుషోత్తమరాజు

రైస్ మిల్లుపై విజిలెన్స్ దాడి

● 900 బస్తాల తవుడు సీజ్

ముండ్లమూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేంపాడులోని రైస్ మిల్లులో కల్తీ తవుడు తయారుచేస్తున్నట్లు విజిలెన్స్ ఎస్పీ కె.శ్రీనివాసరావుకు అందిన సమాచారం మేరకు సోమవారం ఒంగోలు విజిలెన్స్ సీఐ ఎన్.రాఘవరావు తనిఖీ చేశారు. విజిలెన్స్ సిబ్బంది, పశుసంవర్థక శాఖ, తూనికలు కొలతలు, కార్మికశాఖ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఈసందర్భంగా 50 కేజీల చొప్పున ఉన్న 900 బస్తాలను సీజ్ చేసినట్లు సీఐ రాఘవరావు తెలిపారు. గతంలో బియ్యం రైస్ మిల్లుగా ఉండే మిల్లును వాడుకలో లేకపోవటంతో గోడౌన్‌గా మార్చి తవుడు తయారు చేస్తున్నారు. తవుడులో కల్తీ పదార్థాలు కలిపి విక్రయిస్తున్నట్లు అందిన సమాచారంతో దాడులు చేశారు. పట్టుబడిన తవుడును పరీక్ష నిమిత్తం విజయవాడలోని వీబీఆర్‌ఐ ల్యాబ్‌కు పంపించినట్లు సీఐ రాఘవరావు తెలిపారు. ల్యాబ్ నుంచి నివేదిక రాగానే తయారీకి పాల్పడుతున్న రావూరి దుర్గాప్రసాద్‌పై చర్యలు తీసుకుంటామని చెప్పారు. గోడౌన్‌ను సీజ్ చేసి అందులో ఉన్న కల్తీ తవుడును వీఆర్వో బ్రహ్మతేజకు అప్పగించినట్లు తెలిపారు. దాడుల్లో దర్శి ఏడీఏహెచ్ ఏ. పురుషోత్తంరాజు, ముండ్లమూరు పశువైద్యాధికారి ఎం.విజయలక్ష్మి, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి బి.రామారావు, విజిలెన్స్ ఎస్ఐ ఎం.నాగేశ్వరరావు, పొదిలి లేబర్ ఇన్‌స్పెక్టర్ పి.మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుల కోసం పాట్లు

» ఏళ్ల తరబడి నిరీక్షణ
» కూటమి ప్రభుత్వమైనా మంజూరు చేయాలని లబ్ధిదారుల వేడుకోలు

చీరాలటౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : రేషన్ కార్డుల కోసం చీరాల నియోజకవర్గ పరిధిలోని సామాన్య ప్రజలు ఏళ్లుగా ఎదురు చూపులు చూస్తున్నారు. వైసీపీ అధికారంలో ఉండగా తూతూ మంత్రంగా కొంతమందికే కార్డులు మంజూరు చేసింది. 2023 జూన్‌లో వివిధ సాంకేతిక సమస్యలు, ఇతర కారణముల చేత పెద్ద సంఖ్యలోనే అర్హులకు కార్డులు మంజూరు కాక నిరాశ్రయులుగా మిగిలిపోయారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు ప్రామాణికంగా ఉండే రేషన్ కార్డు లేకపోవడంతో అప్పటి నుంచి ఎన్నో నిరుపేద కుటుంబాలు రేషన్ కార్డులకోసం పడిగాపులు పడుతున్నారు. ఈక్రమంలో ప్రస్తుతం అధికారం చేపట్టిన ప్రస్తుత ప్రభుత్వం ఈ ఏడాది జనవరిలో జన్మభూమి లేక ఇతర ప్రభుత్వ కార్యక్రమాల



ద్వారా రేషన్ కార్డులు అందిస్తారని ఆశావహులు భావించారు. ఫిబ్రవరి సగం రోజులు గడిచాయి. అధికారుల నుంచి రేషన్‌కార్డులపై ఎటువంటి చర్యలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 2023 నుంచి నూతనంగా వివాహాలు జరుపుకున్నవారు, తప్పొప్పులు, మార్పులు, చేర్పు లు నూతనంగా కార్డులు పొందాల్సిన వారు ఇలా ఎంతోమంది రేషన్ కార్డు లేక తంటాలు పడుతున్నారు. అలాగే రేషన్ కార్డు లేక సీఎం రిలీఫ్ ఫండ్ కోసం అవస్థలు పడుతున్న వారు కూడా కోకొల్లలు అధికారులు, నాయకుల కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నారు. ఈక్రమంలో ప్రభుత్వం సమస్యను గుర్తించి రేషన్ కార్డులు మంజూరు చేయాలని వేడుకుంటున్నారు.

సైట్ రాగానే కార్డులు మంజూరు చేస్తాం



చాలా కాలంగా రేషన్ కార్డుల సమస్య ఉన్నది వాస్తవమే. ప్రస్తుతం నివేశన స్థలాలకు సంబంధించిన లాగిన్ అందుబాటులోకి వచ్చింది. అయితే ప్రభుత్వం రేషన్ కార్డులకు సంబంధించిన సైట్‌ను నవీకరణ చేస్తోంది. కార్డులకు సంబంధించిన అర్జీలు స్వీకరిస్తున్నాం. ఈక్రమంలో అప్‌డేట్ జరగగానే అర్హులను గుర్తించి రేషన్ కార్డులు మంజూరు చేస్తాం

- చంద్రశేఖర్‌నాయుడు, ఆర్డీవో, చీరాల రెవెన్యూ డివిజన్

ఏళ్ల తరబడి కార్డు కోసం పడిగాపులు



నాకు సుమారు ఎనిమిదేళ్ల కిందట వివాహం జరిగింది. ప్రస్తుతం ఇద్దరు పిల్లలు. నిరుపేదలం కావడంతో రోజువారీ కూలితో జీవిస్తున్నాం. అయితే రేషన్ కార్డు లేకపోవడంతో ప్రభుత్వ సంక్షేమాలు అందని ద్రాక్షగా మిగిలాయి. అత్యవసర వైద్య సేవలు పొందాలన్నా కూడా ఆరోగ్యశ్రీ లేదు. అధికారులు మా గోడు పట్టించుకుని రేషన్ కార్డు మంజూరు చేయాలి.

- శ్రావణి , తోటవారిపాలెం

కార్డు కోసం కాళ్లరిగేలా..



సుమారు ఏడేళ్ల క్రితం వివాహమైంది. నాకు ఇద్దరు ఆడ పిల్లలు సంతానం. చాలా కష్టపడి రోజువారీ కూలీతో నా భర్త కుటుంబాన్ని పోషిస్తున్నారు. రేషన్ కార్డు కోసం అన్నిచోట్లకూ తిరిగాం. కార్డు మంజూరు కాలేదు. సంక్షేమ పథకాలు అందడం లేదు. అధికారులు స్పందించి రేషన్ కార్డు మంజూరు చేయాలి.

- శీలం అనూష, శృంగారపేట

బొబ్బేపల్లి కొండ ఎవరిది?

● కొండపై సంయుక్తంగా పరిశీలించిన రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు

మార్టూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ వెంకటమురళి ఆదేశాలు మేరకు మార్టూరు మండలంలోని బొబ్బేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రావెల్ కొండపై సోమవారం రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేశారు. గ్రావెల్ కొండ భూమి తమకు చెందినదని రెవెన్యూ అధికారులు, ఈ కొండ ఫారెస్ట్ భూమి అని అటవీ శాఖ అధికారులు ఉమ్మడిగా కొండ ప్రాంతానికి చెందిన రికార్డులతో క్షుణ్ణంగా పరిశీలించారు. రెవెన్యూ తరపున వచ్చిన జిల్లా అధికారి ఆర్‌డీవో గ్లోరియా, తతతత సర్వే కనకప్రసాద్, సర్వే ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, తహసీల్దార్ టీ ప్రశాంతి కొండ భూమి వద్దకురాగా,ఫారెస్ట్ శాఖ తరపున డీఎఫ్‌వో భీమయ్య, చీరాల ఫారెస్ట్ రేంజి ఆఫీసర్ వీవీ రమణారావు, వేటపాలెం సెక్షన్ ఆఫీసర్ ఎం.వెంకటేశ్వరరావు, కూకట్లపల్లి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రమేష్ బాబు వచ్చారు. వారందరూ కొండ వద్ద భూమిని పరిశీలించడంతో



బొబ్బేపల్లి గ్రావెల్ కొండ (ఫైల్)



బొబ్బేపల్లి గ్రావెల్ కొండపై జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేస్తున్న ఆర్డీవో గ్లోరియా, డీఎఫ్‌వో భీమయ్య

పాటు, వారి శాఖల ద[illegible] టపెట్టారు. అదేవిధంగా కొండ చుట్టూ ఉన్న కొండకు చెందిన భూమిని కూడా వారు పరిశీలించారు.

బొబ్బేపల్లి గ్రావెల్ కొండ కథ ఇదీ

మార్టూరు మండలంలో బొబ్బేపల్లి గ్రామ పంచాయతీ 387-సీ 11 సర్వేనంబరులో 358 ఎకరాలు గ్రావెల్ కొండ ఉంది. ఈ కొండ భూమిలో 122 ఎకరాలను గతంలో కొంతమందికి ప్రభుత్వం పట్టాలు ఇవ్వడం జరిగింది. అంతేగాకుండా కొండపైన ఉన్న గ్రావెల్‌ను తవ్వుకొని అమ్ముకోవడానికి రెవెన్యూ వారు 10 మందికి ఎన్‌వోసీలు కూడా ఇచ్చారు. ఇంక కొండ భూమి సుమారు 100 ఎకరాలకు పైగానే ఉంది. దానికితోడు గ్రావెల్‌కు విపరీతమైన డిమాండ్ పెరగడంతో గత వైసీపీ ప్రభుత్వంలో కొంతమంది వైసీపీ నేతలు ఈ కొండ గ్రావెల్‌పై కన్నేశారు.

అప్పటి వైసీపీ నేతలు అండ తో రెవెన్యూ అధికారుల సహకారంతో కొంతమంది వైసీపీ మద్దతుదారులు భారీగా కొండమట్టిని తవ్వుకొని అమ్ముకొని లక్షలాది రూపాయలు సంపాదించారు.గత కొన్నేళ్లుగా గ్రావెల్ కొండ అక్రమార్కులకు ఆదాయం సంపాదించే వనరు గా ఏర్పడింది.అయితే 2024లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలల్లో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత 6 నెలలు కిందట గ్రావెల్ కొండ భూమి ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌కు చెందినదని ఫారెస్ట్ అధికారులు రంగ ప్రవేశం చేశారు. దాదాపుగా గత కొన్నేళ్లుగా రెవెన్యూ వారి ఆధీనంలో ఉన్న గ్రావెల్ కొండ అటవీ భూములు పరిధిలోకి వస్తాయని, ఈ కొండలో తవ్వకాలు జరగడానికి అవకాశం లేదని ఫారెస్ట్ అధికారులు అక్రమార్కులకు అడ్డుకట్ట వేశారు. వాస్తవంగా 1894లో మద్రాసు ఫారెస్ట్ యాక్టులో బొబ్బేపల్లి గ్రావెల్ కొండ రిజర్వ్ ఫారెస్ట్ భూమిగా ఉందని, ఈ నేపథ్యంలోనే 2024లో కొండ భూమిని ఫారెస్ట్ అధికారులు అటవీ భూములుగా గుర్తించారు.

1906లో కొండ పోరంబోకుగా ఆర్ఎస్ఆర్‌లో నమోదు

బొబ్బేపల్లి గ్రావెల్ కొండ భూమి 1906లోనే కొండ పోరంబోకుగా (కొండ) రెవెన్యూ భూమిగా రీసర్వే రిజిస్టర్‌లో నమోదు అయి ఉంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన అధికారులు కొండ భూమిపై జిల్లా రెవెన్యూ అధికారులకు ఎలాంటి దరఖాస్తు చేయలేదు. ఈ జాయింట్ ఇన్‌స్పెక్షను నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపిస్తాం

- గ్లోరియా, ఆర్డీవో, బాపట్ల

ఉన్నత అధికారులకు పంపిస్తాం

మద్రాసు ఫారెస్ట్ యాక్టు ప్రకారం 1894లోనే బొబ్బేపల్లి కొండ రిజర్వ్ ఫారెస్ట్‌గా ఉంది. తర్వాత 1906లో రెవెన్యూ వారి ఆర్ఎస్ఆర్‌లో నమోదు చేశారని రెవెన్యూ అధికారులు అంటున్నారు. ఈ విషయంపై నివేదికను కలెక్టర్ నుంచి తీసుకొని ఉన్నత అధికారులకు పంపిస్తాం.

- భీమయ్య
అటవీ శాఖ అధికారి

అదుపు తప్పిన స్కూల్ బస్సు

కారంచేడు (పర్చూరు), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : రోడ్డుపై ఉన్న ఇనుపగొట్టాన్ని తప్పించబోయే క్రమంలో ప్రైవేటు స్కూల్ బస్సు అదుపు తప్పి పక్కనే ఉన్న రోడ్డు మార్జిన్‌లోకి వరిగిపోయిన ఘటన సోమవారం కారంచేడు మండలం కేశవప్పాడు వద్ద చోటుచేసుకుంది. కేశవరప్పాడులో విద్యార్థులను ఎక్కించుకొని పూసపాడులోని పాఠశాలకు తిరుగు ప్ర యాణం చేస్తున్న క్రమంలో ఈప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.



రోడ్డు మార్జిన్‌లో వరిగిన ప్రైవేటు స్కూల్ బస్సు



వెంకటకృష్ణారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రోటరీ ప్రతినిధులు

అగ్నిగుండాలకు నివాళి

పర్చూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) రోటరీక్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ వ్యవస్థాపక సభ్యులు అగ్నిగుండాల వెంకట కృష్ణారావుకు సోమవారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఘన నివాళి అర్పించారు. స్థానిక రోటరీ భవనంలో క్లబ్ ప్రతినిధులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. రోటరీ క్లబ్ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈకార్యకమంలో క్లబ్ అధ్యక్షులు తోకల కృష్ణమోహన్, పాబోలు ఉదయ భాస్కర్, తేళ్ళ రమేష్‌చంద్ర, కెఎస్ఆర్‌కె ప్రసాద్, భవనం రాజగోపాలరెడ్డి, దండా శ్రీనివాసరావు, కాల్వ సత్యన్నారాయణ, నాగభైరు శ్రీనివాసరావు, కోటా శ్రీనివాసరావు, పాబోలు వెంకన్న, కోమట్ల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



పట్టు చీరపై లలిత సహస్ర నామాలు రాస్తున్న సరస్వతి

108 లలిత సహస్ర నామాలతో..

శ్రీశైలం భ్రమరాంబికకు చీరాల భక్తురాలి ప్రత్యేక చీర కానుక

ఆమె పేరు చుండూరు సరస్వతి. పేరుకు తగినట్లే ఆమె నోటి నుంచి నిత్యం పలికేది ఆధ్యాత్మిక అక్షర మాలికలే. ఆధ్యాత్మిక ఆనందం పొందుతూ అమ్మ సేవలో ఉండాలనే దృఢ సంకల్పం. దీంతోనే కొత్త ఆలోచనకు పదును పెట్టారామె. వివరాల్లోకి వెళితే.. చీరాల పట్టణంలోని పాపరాజుతోటకు చెందిన చుండూరు సరస్వతికి భర్త మోహన రాంబాబు, ఇద్దరు పిల్లలు సంతానం. ఈమె భ్రమ రాంబిక సేవా సమితి సభ్యురాలు. ఈ క్రమంలోనే గతంలో సమితి ఆధ్వర్యంలో శ్రీశైలం భ్రమరాంబిక దేవి సేవలో భాగంగా లక్ష విస్తరాకులను పంపిణీ చేసేవారు. హుండీ లెక్కల్లో పాలు పంచుకునేవారు. అయితే ఈసారి స్వయంగా అమ్మకు వినూత్నంగా సమర్పించాలన్న ఆలోచనతో ఎంబ్రాయిడరీపై రంగు పెన్సిళ్లతో పట్టు చీరపై ఏడాది శ్రమిస్తూ 108 లలిత సహస్రనామాలను రాశారు. ఈ చీరను ఈనెల 12వ తేదీన మాఘ పూర్ణిమ రోజు అమ్మవారికి సమర్పించనున్నట్లు చెప్పారు. అయితే పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు ఈ చీరను చూసేందుకు వస్తున్నారు.

- చీరాలటౌన్, ఆంధ్రజ్యోతి

108 లలిత సహస్రనామాలతో సిద్ధమైన చీర

ఎత్తిపోతలు.. దొంగల పాలు!

● రాగి సామగ్రి చోరీ ● పట్టించుకోని ఐడీసీ, ఇరిగేషన్ అధికారులు



కాపర్ వైర్లు ఎత్తుకెళ్లడానికి పగులగొట్టిన మిగిలిన ఇనుప ముక్కలు



కాపర్ వైర్లు చోరీకి గురవడంతో ఖాళీగా కనిపిస్తున్న ప్యానల్స్

మేదరమెట్ల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : కొరిశపాడు ఎత్తిపోతల పథకం, తమ్మవరం-2 ఎత్తిపోతల పథకాల పంప్ హౌస్‌లలో దొంగలు పడ్డారు. విలువైన రాగి వస్తువులను ఎత్తుకెళ్లారు. 180 కోట్ల అంచనాలతో నిర్మాణమవుతున్న కొరిశపాడు ఎత్తిపోతల పథకం పంప్‌హౌస్, రూ.80కోట్లతో నిర్మించిన తమ్మవరం-2 ఎత్తిపోతల పథకం పంప్ హౌస్‌ల షటర్‌లు పగుల గొట్టారు. అందులో విద్యుత్ పరికరాలకు సంబంధిన రాగి వస్తువులను ఎత్తుకెళ్లారు. 20వేల ఎకరాలకు సాగు నీరు అందించే కొరిశపాడు ఎత్తిపోతల పథకం పంప్ హౌస్‌లో ఒక్కొక్కటీ 1000 హెచ్‌పీ (హార్స్‌పవర్) గల మూడు మోటార్‌లు ఉన్నాయి. ఈ మోటార్లు నడవడానికి అవసరమైన పేనల్ బోర్డులు, కేబుల్ వైర్లు, ఇతర విద్యుత్ సామగ్రి ఉన్నాయి. తమ్మవరం-2 ఎత్తిపోతల పథకంలో ఒక్కొక్కటీ 300 హార్స్‌పవర్ గల 5 ఉన్నాయి. వాటిలో నాలుగు నడిచేవి, ఒకటి స్టాండ్ బై, పేనల్ బోర్డు, స్విచ్ బోర్డులు ఉన్నాయి. ఈ రెండు ఎత్తిపోతల పథకాలు పక్కపక్కనే ఉన్నాయి. ఈ ఎత్తిపోతల పథకాల చుట్టూ తుమ్మ చెట్లు మొలిచి ఆ ప్రాంతం చిట్టడివిని తలపిస్తోంది. ప్రధానంగా వాచ్‌మన్ లేకపోవడం, వీటికి సంబంధించి కొన్ని సంవత్సరాలుగా ఎవరూ పట్టించుకోకపోవడంతో దొంగలు షట్టర్‌ను ఎత్తి లోపలున్న విలువైన వస్తువులను దొంగిలించారు. ఇరిగేషన్, ఐడీసీ అధికారులు నిర్లక్ష్యం వల్ల ఇక్కడ ఉన్న పరికరాలన్నీ చోరీకి గురవుతున్నాయి. తమ్మవరం-2 ఎత్తిపోతల పథకానికి సంబంధించి 18 గంటలు విద్యుత్‌ను అందించే సబ్ స్టేషన్ కూడా ముళ్ల చెట్లు మొలిచి అడవిలా మారింది. ఇక్కడ ట్రాన్స్ ఫార్మర్లు, విలువైన కేబుల్ వైర్లు చోరీకి గురైనట్లు తెలుస్తోంది. ఈ పథకాలను తిరిగి పునఃప్రారంభించాల్సి వచ్చినప్పుడు భారీగా ఖర్చుచేసి తిరిగి కొనాల్సి వస్తోంది. కొరిశపాడు, నాగులుప్పలపాడు మండలాల్లో పలు గ్రామాలకు సాగునీరు అందించే ఈ ఎత్తిపోతల పథకాల పంప్‌హౌస్‌లలో చోరీ జగరడం పట్ల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు ఆ వైపు తొంగి చూసిన దాఖలాలు లేవు. భవిష్యత్‌లో మరిన్ని విలువైన వస్తువులు చోరీకి గురి కాకుండా ఇప్పటికైన అధికారులు స్పందించి అక్కడ వాచ్‌మన్‌ను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

కంటైనర్‌ను ఢీకొని బైకిస్టు మృతి



సంఘటనా స్థలంలో విలపిస్తున్న వంశీకృష్ణ తల్లి నాగమణి



వంశీకృష్ణ (ఫైల్)

సింగరాయకొండ, ఫిబ్రవరి 10 : జాతీయ రహదారిపై ఆగి ఉన్న కంటైనర్‌ను ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతిచెందాడు. ఈ ఘటన కలికివాయి ఫ్లైఓవర్‌పై ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని బాలయోగినగర్‌కు చెందిన కూరపాటి వంశీకృష్ణ (23) జరుగుమల్లి మండలం బిట్రగుంట వద్ద ఉన్న పాల కేంద్రంలో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. విధుల నిమిత్తం ఆదివారం రాత్రి ఇంటి నుంచి పాలకేంద్రానికి బయల్దేరాడు. కలికివాయి ఫ్లైవోవర్‌పై టైర్లు పగిలి ఆగి ఉన్న కంటైనర్‌ను వంశీకృష్ణ ఢీకొట్టాడు. దీంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. చేతికి అందివచ్చిన కొడుకు అర్ధంతరంగా తనువుచాలించడంతో వంశీకృష్ణ తల్లి నాగమణి కన్నీరుమున్నీరయ్యారు. ఎస్సై బి.మహేంద్ర, టంగుటూరు హైవే మొబైల్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం కందుకూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

కురిచేడు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతిచెందాడు. ఈఘటన సోమవారం ఉదయం మండలంలో చోటుచేసుకంది. బోదనంపాడుకు చెందిన వేమా వెంకటనాగార్జున (26) కురిచేడు - దర్శి రోడ్డులో గ్రామానికి దగ్గరగా రోడ్డు పక్కన మృతిచెంది ఉన్నాడు. ద్విచక్రవాహనం సైతం అతని పక్కనే కిందపడిపోయి ఉంది. మృతుడు ఆదివారం రాత్రి దర్శి నుంచి తన ద్విచక్రవాహనంపై స్వగ్రామం బోదనంపాడుకు వస్తున్నాడు. వాహనం ముందు ఆయిల్ ట్యాంక్‌పై చింతకాయల గోతం, కూరగాయలు పెట్టుకుని వస్తున్నాడు. స్వగ్రామం బోదనంపాడుకు దగ్గరలో రోడ్డు పక్కన గుంతలో సోమవారం మృతదేహం గ్రామస్థుల కంట పడింది. ఎవరో హత్య చేసి అక్కడ పడవేశారని నాగార్జున తల్లి నాగమ్మ ఆరోపిస్తున్నారు. ఎస్‌ఐ శివ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం దర్శి సీహెచ్‌సీ వైద్యశాలకు తరలించారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

కురిచేడు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆవులమంద పంచాయతీ ప్రతిజ్ఞాపురి కాలనీకి చెందిన బొజ్జా హరీంద్రనాధ్ (22) కుటుంబకలహాలతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈనెల ఒకటో తేదీన హరీంద్రనాధ్ కుటుంబసభ్యులతో ఘర్షణ పడ్డాడు. ఈక్రమంలో పురుగుమందు తాగడంతో వెంటనే గమనించిన కుటుంబసభ్యులు కురిచేడులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకువచ్చి ప్రాథమిక వైద్యం అందించారు. అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కురిచేడు పోలీసులు శవ పంచనామా నిర్వహించి పోస్టు మార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు. హరీంద్రనాధ్ మృతితో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి.

వద్దన్నా.. వినరే!

● అవినీతి, వేధింపుల అధికారికి మళ్లీ పాత పోస్టు
● ఐదుసార్లు మెమోలు, మూడుసార్లు హెచ్చరికలు
● అయినా మారకపోవడంతో డంపింగ్ యార్డుకు బదిలీ
● పది రోజుల్లోనే తిరిగి శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు
● ఆయన మాకొద్దంటున్న ఉద్యోగులు, సిబ్బంది

ప్రజారోగ్యం కోసం పనిచేయాల్సిన ఆ శానిటరీ ఇన్‌స్పెక్టర్ తన బాధ్యతను విస్మరిస్తున్నారు. కార్మికులకు హాజరు పేరుతో మస్టర్‌లో మాయాజాలం చేస్తున్నారు. పైసలే పరమావధిగా అక్రమాలకు తెగబడుతున్నారు. ఆది నుంచీ ఇదే తంతుతో సాగుతున్న ఆయన తీరుపై అనేక ఆరోపణలు ఉన్నాయి. ఉద్యోగులతోనూ సఖ్యత లేదు. 'ఈయన మాకొద్దు' అంటూ ఆధారాలతో సహా ఫిర్యాదులున్నాయి. 'మూడు బెదిరింపులు... ఆరు వేధింపులు' అన్నట్టు పని చేస్తున్న ఆయన్ను ఫిర్యాదుల ఆధారంతో డిమోట్ చేశారు. పెద్దల ఆశీసులతో పది రోజుల్లోనే మళ్లీ పాత పోస్టుకే రావడం ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్‌లో చర్చనీయాంశమైంది.



శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా విధుల్లో ఉన్న కంకణాల ఆంజనేయులు

ఒంగోలు కార్పొరేషన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఆయన పేరు కంకణాల ఆంజనేయులు. వైసీపీ ప్రభుత్వంలో నేతల ఆశీస్సులతో శానిటరీ వర్కర్ నుంచి శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగోన్నతి పొందారు. అప్పటి నుంచీ వివాదాలున్నాయి. కార్పొరేషన్‌లోని శానిటరీ విభాగం మొత్తాన్ని తన చెప్పుచేతల్లో నడిపించేవారు. దిగువ సిబ్బందిపై వేధింపులకు పాల్పడేవారు. ప్రశ్నిస్తే పనికి రాలేదంటూ ఆబ్సెంట్ వేస్తానని కక్షసాధింపులకు పాల్పడేవారు. ఉద్యోగులు, వ్యాపారులతో నిత్యం గొడవలే.

అన్నిచోట్లా ఆరోపణలే..

● 4వ డివిజన్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌గా ఉంటూ పనికి రాకుండా ఉన్నవారికి సైతం ఏడాది పాటు హాజరువేసి, ఆ వేతనాన్ని తన జేబులో వేసుకునేవారని ఆరోపణలున్నాయి.

● డివిజన్ పరిధిలోని హోటల్స్, లాడ్జీలు, టీ దుకాణాలు, హాస్పిటల్స్ వద్ద యూజర్ చార్జీల పేరుతో భారీగా వసూలు చేసేవారని, వాటిని కార్పొరేషన్‌కు చెల్లించకుండా అవినీతికి పాల్పడేవారని అధికారుల వద్ద ఆధారాలు ఉన్నాయి.

● కొందరు శానిటరీ సెక్రటరీలు సైతం 'ఆయన మాకొద్దు' అంటూ కమిషనర్ వద్ద మొరపెట్టుకున్నారు. మహిళా పారిశుధ్య కార్మికుల పట్ల అసభ్య ప్రవర్తనపైనా కమిషనర్‌కు అనేక ఫిర్యాదులు అందాయి.

● శానిటేషన్ విభాగంలోని కొందరు అధికారులు, పాలకవర్గంలోని కొందరు ఆశీస్సులు పుష్కలంగా ఉండటంతో ఆయనకు స్థానచలనం కల్పించడానికి అధికారులు సైతం వెనుకడుగు వేస్తున్నారు.

డంపింగ్‌యార్డుకు బదిలీ

కంకణాల ఆంజనేయులుపై ఆధారాలతో సహా అనేక అవినీతి, అక్రమాలకు సంబంధించి ఆరోపణలు రావడంతో కార్పొరేషన్ కమిషనర్ చర్యలకు ఉపక్రమించారు. గడిచిన మూడు నెలల్లో ఐదుసార్లు చార్జ్ మెమోలిచ్చారు. మూడుసార్లు ఘాటుగా హెచ్చరికలు జారీ చేశారు. అయినా ఆయన తీరు మారలేదు. నిన్న మొన్నటి వరకు 4వ డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఆంజనేయులును ఆ బాధ్యతల నుంచి తొలగించి గుత్తికొండవారిపాలెంలోని డంపింగ్ యార్డు వద్ద పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. దీంతో పారిశుధ్య కార్మికులు, ఉద్యోగులు ఊపిరిపీల్చుకున్నారు.

తిరిగి పాత విధుల్లోకి..

ఆంజనేయులను డంపింగ్ యార్డుకు బదిలీతోపాటు 5వ డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, 3వ డివిజన్ ఇన్‌స్పెక్టర్ శ్రీరామ్‌ను డిమోట్ చేస్తూ మేస్త్రీలుగా నియమించారు. మిగిలిన ఇద్దరు ఇన్‌స్పెక్టర్లను మేస్త్రీలుగానే ఉంచి, విధుల్లో విమర్శలు, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆంజనేయులును పది రోజుల్లోనే 3వ డివిజన్ ఇన్‌స్పెక్టర్‌గా మార్చారు. అధికారులను సైతం లెక్కచేయకుండా కొందరు పాలకవర్గం పెద్దల ఆశీసులతో తిరిగి ఇన్‌స్పెక్టర్‌గా కొనసాగడంపై ఇప్పుడు కార్మికులు ఆందోళన చెందుతున్నారు.



శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా కొనసాగిస్తూ ఉత్తర్వులు

సెక్రటరీలు ముందుకొస్తే ఆంజనేయులను తొలగిస్తాం

ఆంజనేయులుపై ఆరోపణలు వచ్చిన మాట వాస్తవమే. అందులో భాగంగానే డంపింగ్ యార్డుకు బదిలీ చేశాం. పరిపాలన సౌలభ్యం కోసం అక్కడ ఇన్‌స్పెక్టర్‌గా ఉండేందుకు ఎవరూ ఆసక్తి చూపలేదు. ఎవరైనా శానిటరీ సెక్రటరీలు ముందుకొస్తే తప్పకుండా ఆంజనేయులును తొలగించి, సెక్రటరీకి బాధ్యతలు అప్పగిస్తాం. మిగిలిన ఇద్దరు ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్లను మేస్త్రీలుగా నియమించాం. అయితే అది వారి ఇష్టపూర్వకంగానే మేస్త్రీలుగా నియమించాం. వారి అనారోగ్య కారణాల వల్ల ఇన్‌స్పెక్టర్లుగా ఉండలేమని కోరారు. అందుకే వారికి మేస్త్రీ బాధ్యతలు అప్పగించాం.

- డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, ఓఎంసీ కమిషనర్



శివరాత్రి ఉత్సవాలకు ఆహ్వానం

శ్రీకాళహస్తిలో జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆహ్వానించారు. సోమవారం అమరావతిలోని సచివాలయం బ్లాక్-1లో మంత్రులు గొట్టిపాటి రవికుమార్, నిమ్మల రామానాయుడును సుధీర్‌రెడ్డి కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు. - అద్దంకి, ఆంధ్రజ్యోతి

అవీ..ఇవీ



ఒంగోలు మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మహిళలు

ప్రతి పేద కుటుంబానికి ఇంటి స్థలం ఇవ్వాలి

● ధర్నాలో సీపీఐ నేతల డిమాండ్

ఒంగోలు(రూరల్),ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): అర్హత గలిగిన ప్రతి పేదకుటుంబానికి నివేశన స్థలంతో పాటు పట్టా ఇవ్వాలని సీపీఐ ఒంగోలు నగర సహాయకార్యదర్శి శ్రీరామ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఒంగోలు మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద పేదలకు నివేశస్థలాలు ఇవ్వాలని సోమవారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒంగోలు నగరంలో పేదలకు ఇళ్ల స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారని , వెంటనే మంజూరు చేయాలని కోరారు. అనంతరం మండల తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈకార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు సర్దార్, కొత్తకోట వెంకటేశ్వర్లు, సలార్,పూలె రమ్య, ప్రమీల, పోలమ్మ, వివిధ కాలనీల మహిళలు పాల్గొన్నారు.



బహుమతులు అందుకున్న చెస్ విజేతలు

ముగిసిన రతన్ టాటా మెమోరియల్ చెస్ పోటీలు

ఒంగోలు, కార్పొరేషన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : రతన్ టాటా మెమోరియల్ ఆధ్వర్యంలో నిర్వహించిన చెస్ పోటీలు సోమవారం ఘనంగా ముగిశాయి. స్థానిక హైదరీ క్లబ్‌లో నిర్వహించిన పోటీలలో జిల్లా వ్యాప్తంగా 128 మంది క్రీడాకారులు పాల్గొనగా, విజేతలకు సోమవారం బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి వ్యాపారవేత్త పాటిబండ్ల సుధాకర్ బాబు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు, కన్సొలేషన్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు కందుల కోటి, నారా రమేష్, హైదరీ క్లబ్ ఉపాధ్యక్షులు ఎస్. చంద్రమోహన్ రెడ్డి, క్లబ్ ట్రెజర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏవో కిషోర్‌బాబు

భూమి ఉన్న ప్రతిరైతుకు 11అంకెల విశిష్ట గుర్తింపు కార్డు

ఒంగోలు(రూరల్),ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): భూములున్న ప్రతిరైతు 11అంకెల గల గుర్తింపు కార్డును పొందాలని, ఆగుర్తింపు కార్డు ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని మండలవ్యవసాయ అధికారి జి.కిషోర్ బాబు అన్నారు. ఒంగోలు మండల వ్యవసాయ కార్యాలయంలో సోమవారం వీవోఏలు, రైతులతో సమావేశం నిర్వహించారు. కేంద్ర,రాష్ట్రప్రభుత్వ పథకాలు పొందటానికి ఈ11అంకెల గల కార్డు తప్పక ప్రతిరైతు దగ్గర ఉండాలన్నారు. ఈ కార్డు పొందటానికి భూములు గల రైతులు ఆధార్‌కార్డు, ఆధార్‌కు అనుసంధానమైన ఫోన్ నంబరు, పట్టాదారుపాసుపుస్తకం తప్పక ఉండాలన్నారు. ఈపత్రాలతోనే 11అంకెల కార్డు ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్ నుంచి పొందవచ్చునని తెలిపారు.



నోటు పుస్తకాలు అందిస్తున్న నెప్పల కృష్ణమూర్తి

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మద్దిరాలపాడు గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ, నెప్పల ట్రస్ట్ అధినేత నెప్పల సుబ్బారాయుడు జన్మదినం సందర్భంగా సోమవారం చీర్వానుప్పలపాడు పాఠశాలలోని విద్యార్థులకు నోట్‌బుక్స్‌పలకలు,పెన్నులు అందజేశారు. తొలుత విద్యార్థులు, ఉపాధ్యాయుల సమక్షంలో సుబ్బారాయుడు జన్మదిన కేక్‌ను ఆయన సోదరులు నెప్పల కృష్ణమూర్తి, గుమ్మడి సురేష్ కట్ చేశారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు తాళ్లూరి కృష్ణారావు, చుండూరి వెంకటేశ్వర్లు, కట్టా శ్రీరాములు, సీహెచ్‌వో రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీలలో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

ఒంగోలు, కార్పొరేషన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : 22వ రాష్ట్ర స్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీలలో జిల్లా క్రీడాకారుల ప్రతిభ చాటారు. ఈనెల 9వ తేదీన విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో ఏపీ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలలో ఒంగోలు హైదరీ క్లబ్ కరాటే అకాడమీ క్రీడాకారులు ప్రథమ స్థానంలో నిలిచి పలు పతకాలు సాధించినట్లు అకాడమీ కోచ్ నల్లూరి మోహన్‌రావు తెలిపారు.

ప్రజా సమస్యలకు సత్వరమే పరిష్కారం

కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారమే ధ్యేయంగా అధికారులు పనిచేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌హాలులో సోమవారం జరిగిన మీ కోసం కార్యక్రమంలో వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన ప్రజలు పలు సమస్యలపై వినతులు ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మీ కోసం అర్జీలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి వెంటనే పరిష్కరించాలన్నారు. అర్జీలు రీ ఓపెన్ కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. అర్జీల పరిష్కారంలో సహేతుకత ముఖ్యమన్నారు. మొక్కుబడి సమాధానాలతో అర్జీదారులకు ఎండార్స్‌మెంట్ ఇచ్చేసి సమస్యను పరిష్కరించినట్లుగా రికార్డులలో చూపితే సహించబోనన్నారు. క్షేత్ర స్థాయిలో సమస్య పరిష్కారం కావాల్సిందేనని స్పష్టంచేశారు. ఆ అర్జీలు పరిష్కరించలేని పక్షంలో అందుకు కారణాలను కూడా అర్జీదారులకు వివరించాలన్నారు. ఏదైనా సాంకేతిక సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొని రావాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో బి. చిన ఓబులేషు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పార్థసారథి, వరకుమార్, జాన్సన్, విజయజ్యోతితో పాటు పలుశాఖల అధికారులు ఉన్నారు.



గ్రీవెన్స్‌లో అర్జీదారుల సమస్యలను తెలుసుకుంటున్న కలెక్టర్ అన్సారియా

● మద్దిపాడు మండలం బూరేపల్లి గ్రామ సమీపంలోని ప్రభుత్వ కొండ వద్ద జరుగుతున్న అక్రమ మైనింగ్‌ను అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కొరిశపాడు మండలం యర్రబాలెంకు చెందిన మొరవినేని పవన్ కుమార్ కోరారు. ఇది మూడు గ్రామాల సమస్యగా మారిందని, అందువల్ల ఈ అక్రమ మైనింగ్ జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

గ్రీవెన్స్‌లో రెండు అర్జీలు

మద్దిపాడు : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌లో గుండ్లాపల్లికి చెందిన భూమి వివాదంపై రెండు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ సృజన్ కుమార్ తెలిపారు. తక్షణం సమస్యలను పరిష్కరించే దిశగా గ్రామ స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఆదేశించారు.

ఉపాధి పనుల్లో పురోగతి సాధించాలి

జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనులలో ప్రతివారం పురోగతి కనిపించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. పని దినాల కల్పనలో లక్ష్యాలను చేరుకోవాలన్నారు. స్థానిక కలెక్టరేట్ నుంచి సోమవారం సాయంత్రం మండల స్థాయి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. ఉపాధి కూలీల మొబిలైజేషన్, సగటు వేతనం పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సచివాలయ ఉద్యోగులు ఉదయం, సాయంత్రం కచ్చితంగా బయోమెట్రిక్ హాజరు వేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో చిన ఓబులేషు, వివిధ శాఖల అధికారులు చిరంజీవి, జోసఫ్‌కుమార్, శ్రీనివాస ప్రసాద్, వెంకటేశ్వర్లు, వెంకట నాయుడు, వెంకటేశ్వరరావు, గౌస్‌బాషా తదితర శాఖల అధికారులు ఉన్నారు.



ఫిర్యాదుదారుడి సమస్యను వింటున్న ఎస్పీ దామోదర్

అధిక ఆదాయం ఆశచూపి మోసం

● రూ. 11.80 లక్షల అపహరణ
● ఎస్పీకి గ్రీవెన్స్‌లో ఫిర్యాదు

ఒంగోలు క్రైం,ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): అధిక ఆదాయం ఆశ చూపి ఉచ్చులోకి లాగి బ్యాంక్‌లో ఉన్న రూ. 11.80 లక్షలు లాగేశారని ఎస్పీ వద్ద బాధితులు వాపోయారు. సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో ఎస్పీని స్థానిక బాలాజీనగర్‌కు చెందిన బాధితుడు కలిసి తనకు జరిగిన మోసాన్ని విన్నవించారు. సైబర్ యాప్‌లలో అధిక ఆదాయం వస్తుందని తన బ్యాంక్ ఖాతా నుంచి రూ. 11.80 లక్షలు జమ చేయించుకొని మోసం చేశారని వాపోయారు. అదే విధంగా జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి 69 మంది తమ వినతులను ఎస్పీకి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆ ఎక్కువ ఆదాయం పొందవచ్చు అనే ఆశతో యాప్‌లలో ఎవరూ పెట్టుబడులు పెట్టవద్దని అన్నారు. అదనపు ఎస్పీ కె.నాగేశ్వరరావు ,స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సురేష్ బాబు,సీఐలు అజయ్‌కుమార్, పాండురంగారావు, సుబ్బారావు, ఎస్సైలు రజియాసుల్తాన్, ప్రభాకర్ పాల్గొన్నారు.

పిల్లలందరికి అల్బెండజోల్ మాత్రలను మింగించాలి



బాలికకు అల్బెండజోల్ మాత్రను మింగిస్తున్న కలెక్టర్ అన్సారియా, పక్కన మేయర్ సుజాత

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఒకటి నుంచి 19 ఏళ్లలోపు పిల్లలందరికి అల్బెండజోల్ మాత్రలను మింగించాలని కలెక్టర్‌తమీమ్ అన్సారియా అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో విద్యార్థినీ, విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను మింగించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 5,96,751 మంది పిల్లలు ఉన్నారని, అందుకోసం 6.80 లక్షల ట్యాబెట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ మాత్రలు వేసుకోవడం ద్వారా పిల్లలు మానసికంగా, శారీరకంగా ఎదుగుతారని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నులిపురుగుల మాత్రలను మింగడం ద్వారా పిల్లల్లో చదువు పట్ల ఏకాగ్రత, చదువుకొనే సామర్థ్యం వృద్ధి చెందుతుందన్నారు. ఈకార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, ఆర్‌ఐవో సైమన్ విక్టర్, డీఈవో కిరణ్‌కుమార్, స్కూలు ప్రిన్సిపాల్ వీకే గీతాలక్ష్మి, డాక్టర్ పద్మజ, డాక్టర్ వాణిశ్రీ, డాక్టర్ ఖాసీం, డాక్టర్ ప్రీతమ్, మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

98 శాతం పంపిణీ

ఒంగోలు(రూరల్): మండలంలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో సోమవారం నులిపురుగు నివారణ టాబ్లెట్లను పంపిణీ చేశారు. ఈ



ఉలిచి జడ్పీ ఉన్నత పాఠశాలలో బాలబాలికలకు అల్బెండజోల్ మాత్రలు బింగిస్తున్న వైద్యశాఖ సిబ్బంది

కార్యక్రమంలో పాల్గొన్న కరవది ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ సుందరప్రసాదు మాట్లాడుతూ 6 నెలల నుంచి రెండు సంవత్సరాలలోపు వారికి సగం టాబ్లెట్, 2నుంచి 19సంవత్సరాల వయసులోపు వారికి ఒక్కో టాబ్లెట్ వంతున పంపిణీ చేశామన్నారు. మండలంలో మొత్తంగా 98శాతం పంపిణీ పూర్తిచేసినట్లు అధికారులు తెలిపారు.

మద్దిపాడులో

మద్దిపాడు: అల్బెండజోల్ మాత్రలు నులిపురుగు నివారణకు మంచి ఔషధమని మద్దిపాడు ఆరోగ్యకేంద్రం డాక్టర్ ఆనంద్‌మోహన్ అన్నారు. సోమవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహించారు. డాక్టర్ ఆనంద్‌మోహన్, హెల్త్ సూపర్‌వైజర్ బాలకోటయ్య, రజిత, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ వలయం ఏర్పాటు

● ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన
● సంతోషం వ్యక్తం చేసిన చీమకుర్తి వాసులు



ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ వలయం ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న అధికారులు

చీమకుర్తి,ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): 'పొంచి ఉన్న ప్రమాదం' అనే శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి విద్యుత్‌శాఖాధికారులు స్పందించారు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద డిస్ట్రిబ్యూషన్‌బాక్స్‌ని ఏర్పాటుచేసి వేలాడుతున్న తీగలను సరిచేశారు. ప్రమాదాలు జరగకుండా ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ కంచెను ఏర్పాటుచేశారు. డీఈ మోహనరావు, ఏఈ చంద్రశేఖర్‌లు పనులను పర్యవేక్షించారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు దూరంగా ఉండి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఈ సందర్భంగా ప్రజలను అధికారులు కోరారు.విద్యుత్‌శాఖ సత్వర స్పందనపై పట్టణవాసులు సంతోషం వ్యక్తం చేశారు.

వాహనదారులకు కౌన్సెలింగ్

మద్దిపాడు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి):వ్యతిరేక దిశలో ప్రయాణం చేయడం, వాహనాలను నడపటం వలన ప్రమాదాలను కొనితెచ్చుకునే పరిస్థితి వస్తుందని ఎస్సై బి.శివరామయ్య అన్నారు. సోమవారం సీతారాంపురం కొష్టాలు, వెల్లంపల్లి చిన్న బ్రిడ్జి, రాచవారిపాలెం జంక్షన్, గ్రోత్ సెంటర్ వద్ద ఆయన వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. పొగాకు తీసుకుని వెళ్లే ట్రాక్టర్ డ్రైవర్లు సైడ్ డోర్లు ఓపెన్ చేసి పక్కవైపున, వెనుకవైపున కూలీలను కూర్చో పెట్టడం వంటివి చేయవద్దని, ఏదైనా ప్రమాదం జరిగితే డ్రైవర్లపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వెలుగు ఇన్‌చార్జి పీడీగా డీఆర్వో బాధ్యతలు

ఒంగోలు నగరం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్ ఇన్‌చార్జి బాధ్యతలను జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ ఓబులేసు సోమవారం చేపట్టారు. రెగ్యులర్ పీడీగా పనిచేసిన వసుంధర ఇటీవల బదిలీకాగా ఆమె స్థానంలో ఇన్‌చార్జి బాధ్యతలను మెప్మా పీడీగా పనిచేసిన తేళ్ల రవికుమార్‌కు అప్పగించారు. ఆయన కూడా నాలుగు రోజుల క్రితం బదిలీ అయ్యారు. దీంతో డీఆర్‌డీఏ, వెలుగు పీడీ ఇన్‌చార్జి బాధ్యతలను డీఆర్వో ఓబులేసుకు అప్పగించారు.

పోలేరమ్మ ఆలయానికి ఎన్‌ఆర్‌ఐ డాక్టర్ రూ.50వేల సాయం



రూ. 50వేల విరాళాన్ని అందజేస్తున్న రాఘవేంద్రప్రసాద్

సంతనూతలపాడు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : స్థానిక అంబేడ్కర్‌నగర్‌లోని పోలేరమ్మ ఆలయ అభివృద్ధికి సోమవారం ఎన్‌ఆర్‌ఐ డాక్టర్ సూదనగుంట రాఘవేంద్రప్రసాద్ రూ.50వేల సాయం అందజేశారు. సాయాన్ని ఆలయఅభివృద్ధి ప్రతినిధి మార్పుడి శ్రీనివాసరావుకు అందించారు. ఈసందర్భంగా ఆలయఅర్చకులు ఫలతోటి శివరామకృష్ణ నిర్వహించిన పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో సూదనగుంటబాబూరావు, మందాడి వెంకటేశ్వర్లు, పీఎస్‌ఎస్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత అందరి బాధ్యత

మద్దిపాడు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి):పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని సీతారాంపురం సర్పంచ్ మండవ శివానంద రావు అన్నారు. సోమవారం సీతారాంపురంలో గ్రామ కార్యదర్శి సురేష్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా శివానందరావు మాట్లాడుతూ గ్రామాల్లో కాలువల్లో మురుగు నీరు నిల్వ ఉండి దోమలకు ఆవాసలుగా తయారవుతున్నాయని, వాటి నివారణకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.రమేష్ బాబు, గ్రామ కార్యదర్శి సురేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

కొత్తపట్నం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లూరు గ్రామంలో 2023వ సంవత్సరం నవంబర్ నెలలో జరిగిన సంఘటనపై కొత్తపట్నం పోలీసులు సోమవారం ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసును నమోదు చేశారు. భూమి వి వాదంలో తనను గ్రామానికి చెందిన ఇతర సామాజిక వర్గానికి చెందిన వారు 2023వ సంవత్సరం నవంబరు 19వ తేదీన చొక్కా పట్టుకుని కులం పేరుతో దూషించారని ప్రసాదరావు ఫిర్యాదు చేశారు. అయితే ఈ ఘటనపై ప్రసాదరావు కోర్టును ఆశ్రయించారు. వారిపై ఎస్సీఎస్టీ అ ట్రాసిటీ నమోదు చేయాలని పోలీసులను ఆదేశించాలని ఆయన కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో కోర్టు ఆదేశాలతో అల్లూరు గ్రామానికి చెందిన బంకా శ్రీనివాసరావు, బంకా లక్ష్మీనారాయణ, బంకా మస్తాన్, బంకా శ్రీనివాసరావు, మిట్నసల జయరావు, సదానందరావు పై కొత్తపట్నం పోలీసులు కేసునమోదుచేశారు.



చెక్కుల పంపిణీ అనంతరం లబ్ధిదారులతో ఎమ్మెల్యే దామచర్ల

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదల ఆరోగ్యానికి భరోసా

● చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు, కార్పొరేషన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం ప్రభుత్వంలో పేదల ఆరోగ్యానికి భరోసా లభిస్తుందని, ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఆర్థిక సహాయం అందజేసి అందరికీ ఆరోగ్యం అందిస్తున్నదని ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్ తెలిపారు. సోమవారం తన నివాసంలో నగరంలోని పలువురికి వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమం, ఆరోగ్యం, విద్య, వైద్యం లభిస్తాయన్నారు. వివిధ అనారోగ్య కారణాలతో వైద్యం చేయించుకున్నవారికి ముఖ్యమంత్రి సహాయ నిధి అందజేస్తున్నామని తెలిపారు. అలాగే తాజాగా టీడీపీ ప్రభుత్వం బృహత్తరమైన పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిందని తెలిపారు. గుండెపోటుకు గురైనపుడు అత్యవసరంగా అందించే రూ. 40వేల ఇంజక్షన్‌ను ప్రభుత్వ వైద్యశాలలో ఉచితంగా అందిస్తామని దామచర్ల తెలిపారు. ఈ సందర్భంగా ఒంగోలు నియోజకవర్గం పరిధిలోని 13 మందికి రూ. 71లక్షల 56 వేల రూపాయల చెక్కులను అందజేశారు.

రజక వృత్తిదారులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

● ఎమ్మెల్యే జనార్దన్‌కు వినతి

ఒంగోలు, కార్పొరేషన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వివిధ ప్రాంతాలలో రజక వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నవారికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని రజక వృత్తిదారులు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కు వినతి పత్రం అందజేశారు. సోమవారం ఎమ్మెల్యేను కలిసిన వారు నగరంలో అనేక సంత్సరాలుగా నివాసముంటూ అపార్ట్‌మెంట్‌లలో వాచ్‌మెన్‌లుగా ఇరుకు గదుల్లో జీవిస్తున్నామని తెలిపారు. తమ ఇబ్బందులను గుర్తించి స్థలాలు మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే దామచర్ల నగరంలోని వృత్తిదారుల పూర్తి వివరాలను తెలియజేయాలని, తన వంతు సహకారంగా నివేశన స్థలాల మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రజక వృత్తిదారుల సంఘం నాయకులు రాయల కొండయ్య, టంగుటూరి రాము, డాక్టర్ కృష్ణయ్య, రమణమ్మ, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, యానాదిరావు తదితరులు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న హుస్సేన్

శ్మశాన స్థలాన్ని ముస్లింలకే కేటాయించాలి

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరంలోని పోతురాజుకాలువ వంతెన వద్ద ముస్లింల శ్మశానం కోసం కేటాయించిన స్థలాన్ని వారికే ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేశారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో సోమవారం అవాజ్ నగర కమిటీ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి సయ్యద్ హుస్సేన్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో పలు సంఘాల నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ముస్లిం శ్మశానానికి కేటాయించిన స్థలాన్ని రద్దు చేయాలని చూడటం తగదన్నారు. అలాగే షాదీఖానా అద్దె రద్దు చేయడంతో పాటు ఉర్దూ పాఠశాలను ఏర్పాటు చేసి ప్రభుత్వమే నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాలు, ముస్లిం నాయకులు పఠాన్ కరీముల్లా, చీకటి శ్రీనివాసరావు, ఖాదర్‌వలి, ఎస్‌కే కాలేషా, కరీముల్లా, కేఎఫ్ బాబు, బి. రఘురాం, గౌస్‌బాషా, సుభాన్, పఠాన్ మసూద్ ఖాన్ తదితరులు ఉన్నారు.

కుక్కపిల్లలపై అమానుషం

● పెట్రోలు పోసి నిప్పంటించిన గుర్తుతెలియని వ్యక్తులు
● సేవ్ ద యానిమల్ ఫౌండేషన్ ఆవేదన



అపస్మారకస్థితిలో ఉన్న కుక్కపిల్లలు

ఒంగోలు, కార్పొరేషన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కొత్తపేట రెండవ లైనులోని ఓ వీధి కుక్క రెండు రోజుల క్రితం మూడు కుక్క పిల్లలకు జన్మనివ్వగా, స్థానికంగా ఉండే మహిళ వాటిపై ప్రేమను చూపారు. ఆ పసికూనలకు రోజూ పాలు పోయడంతోపాటు, చలి తగలకుండా సమీపంలోనే ఓ బోను ఏర్పాటు చేసి, దుప్పటి కప్పి ప్రేమగా చూస్తున్నారు. అయితే ఆదివారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు తల్లి కుక్కతోపాటు, చిన్న పిల్లలపై పెట్రోలు పోసి నిప్పు అంటించారు. దీంతో ఆ కూనలు పెద్దగా అరవడంతో ఆ ఇంటిలోని మహిళ వచ్చి చూసి కన్నీరు మున్నీరు అయ్యారు. పుట్టి రెండు రోజులు కూడా కాని చిన్న కుక్కపిల్లలపై పెట్రోలు పోసి తగులపెట్టడం దుర్మార్గమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్‌లో ఇలాంటివి జరకుండా చూడాలని సేవ్ ద యానిమల్ ఫౌండేషన్ తరుపున కోరుతున్నామని ఆమె తెలిపారు.

ఏఈవోల సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడిగా 'తోటపల్లి'

ఒంగోలు, కార్పొరేషన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం (ఏఈవో) రాష్ట్ర సహాధ్యక్షుడిగా ఒంగోలు సహాయ వ్యవసాయ సంచాలకుల కార్యాలయంలో విస్తరణ అధికారిగా పనిచేస్తున్న తోటపల్లి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం అమరావతిలోని ఉమ్మడి రాష్ట్ర వ్యవసాధికారుల సంఘ కార్యాలయంలో జరిగిన ఎన్నికలలో శ్రీనివాసరావును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనియన్ తరుపున ఉద్యోగులకు రావలసిన హక్కుల సాధనకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

రేపు వెలిగొండ ప్రాజెక్టుపై రౌండ్ టేబుల్ సమావేశం

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : వెలిగొండ ప్రాజెక్టును వెంటనే పూర్తి చేసేందుకు ఈ సంవత్సరం బడ్జెట్‌లో రూ. 2వేల కోట్లు కేటాయించాలని కోరుతూ బుధవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జే. జయంతిబాబు, పమిడి వెంకట్రావులు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో మేధావులు, రైతు సంఘాల నాయకులు, అభ్యుదయవాదులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

బండలాగుడు పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే ముత్తుముల

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గడికోట పంచాయతీ పరిధిలో జరుగుతున్న శ్రీపోలేరమ్మ, అంకాలమ్మతిరునాళ్ల మహోత్సవంలో సోమవారం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవస్థాన కమిటీ ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. కమిటీ సభ్యులు ఎమ్మెల్యే మేళతాళాలతో ఘనస్వాగతం పలికి పూలమాలలు, శాలువలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్‌యాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు మార్తాల సుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు బోదనబోయిన గోపాలక్రిష్ణయాదవ్, కడియం శేషగిరి పాల్గొన్నారు.

వెలిగొండకు రూ.2వేల కోట్లు కేటాయించాలి

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వెలిగొండ ప్రాజెక్టుకు బడ్జెట్‌లో రూ.2వేల కోట్లు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు డిమాండ్ చేశారు. స్థానిక ఎన్‌జీవో హోమ్‌లో వెలిగొండ ప్రాజెక్టు పరిధిలోని 23 మండలాల సీపీఎం నాయకులు, కార్యకర్తల సమావేశం డి.సోమయ్య అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాబు మాట్లాడుతూ పశ్చిమ ప్రకాశం అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారానికి ఈ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయటమే ఏకైక మార్గం అన్నారు. సీపీఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరుతూ ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యేలకు వినతిపత్రం ఇస్తామని, ఈనెల 20న అన్ని మండల తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ఆందోళనలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కొండా రెడ్డి, హనీఫ్, వెంకటేశ్వర్లు, కేశవరావు, మాల్యాద్రి, రంగారావు, డీకేఎం రఫి, బాల నాగయ్య, షేక్ అన్వర్, రూబెన్, తార, రాజ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు, పక్కన కొండారెడ్డి, హనీఫ్



రికార్డులు పరిశీలిస్తున్న అధికారి రాజు

చిన్నగుడిపాడు పంచాయతీ నిధుల అవకతవకలపై విచారణ

2011నుంచి నేటి వరకు పరిశీలించాలని టీడీపీ నేత ఫిర్యాదు

పెద్దదోర్నాల, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన్నగుడిపాడు గ్రామ పంచాయతీలో నిధులు దుర్వినియోగం జరిగినట్లు వచ్చిన ఫిర్యాదుపై కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక అధికారి కేజీఎస్ రాజు పంచాయతీ కార్యాలయంలో సోమవారం విచారణ చేపట్టారు. 2011 నుంచి 2024 వరకు గ్రామ పంచాయతీలో పనులు చేయకుండానే అధికారులు, సర్పంచి కలిసి సొమ్ము లాగేసుకున్నారని, నిగ్గు తేల్చాలని కోరుతూ గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు దొడ్డా శేషాద్రి మరి కొందరు జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన కలెక్టర్ విచారణ అధికారిగా కేజీఎస్ రాజును నియమించారు. ఈ క్రమంలో సోమవారం ఆయన వచ్చి పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పదేళ్లకు పైగా పనుల వివరాలను పరిశీలించాల్సి ఉందని, నాలుగైదు రోజులు పడుతుందని చెప్పారు. తదనంతరం పూర్తి వివరాలతో ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తానన్నారు.

కోతుల భయంతో జారిపడిన మహిళ.. తీవ్రగాయాలు



గాయపడిన మారమ్మ

పెద్దదోర్నాల, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : కోతులు దాడిచేయడంతో మహిళకు తీవ్రగాయాలయిన ఘటన మండలంలోని తిమ్మాపురం గ్రామంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఈ సంఘటనలో కర్నూలు జిల్లా కోసిగి గ్రామానికి చెందిన మారమ్మకు తీవ్రగాయాలయ్యాయి. బాధితులు తెలిపిన కథనం ప్రకారం... కోసిగి గ్రామం నుంచి మిరప కోతలకు కొందరు కూలీలు తిమ్మాపురం వచ్చారు. వారు బస చేసిన ఇంటి బయట అరుగుపై పడుకుని ఉండగా కోతుల గుంపు దాడి చేశాయి. దీంతో మారమ్మ అరుగుపై నుంచి కింద పడడంతో తీవ్రగాయాలయ్యాయి. గమనించిన బంధువులు ఆమెను వెంటనే దోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు తరలించారు.

రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

పెద్ద దోర్నాల,ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని వ్యవసాయాధికారి జవహర్ లాల్ నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తద్వారా ప్రభుత్వం ఒక నెంబరును కేటాయిస్తుందని ఆ నెంబరు ఐడీతోనే ప్రభుత్వ పథకాలు మంజూరవుతాయని చెప్పారు. అందుకు గాను రైతులు తమ పొలం జిరాక్స్, ఆధార్ కార్డు, దానికి అనుసంధానించిన ఫోన్ నెంబరుతో సమీప సచివాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని సూచించారు.

డివిజన్ స్థాయి ప్రతిభ పరీక్ష

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 10 ఆంధ్రజ్యోతి : మార్కాపురంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మార్చి 3న శ్రీక డివిజన్ స్థాయి ప్రతిభ పరీక్ష నిర్వహించనున్నట్లు శ్రీక ఐఐటీ, జేఈఈ ప్రిన్సిపాల్ వేదవల్లి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు గణితం, భౌతిక, జంతు శాస్త్రం, కరెంట్ ఎఫైర్స్ సబ్జెక్టులలో ప్రతిభ పరీక్ష నిర్వహిస్తారని, ఎటువంటి ప్రవేశ రుసుం లేదని, హాజరయ్యే విద్యార్థులకు భోజన వసతి కల్పిస్తామని పేర్కొన్నారు. మార్చి 2న ఉదయం 9 నుంచి 11 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామని, మొదటి బహుమతి రూ.5వేలు, రెండో బహుమతి రూ.3 వేలు, మూడో బహుమతి రూ.2వేలు, ఆరు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని తెలిపారు. వివరాలకు 8247610926, 9441215705నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

కంభంలో పీజీ పరీక్షలపై విమర్శలు

ముగ్గురిని స్క్వాడ్ అధికారులు పట్టుకుని వదిలివేశారని ప్రచారం

కంభం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కంభంలోని ఓ ప్రైవేటు కాలేజీలో సోమవారం ఉదయం ప్రారంభమైన పీజీ పరీక్షలో విద్యార్థులు కాపీలు రాస్తుండగా యూనివర్సిటీ నుంచి వచ్చిన స్క్వాడ్ అధికారులు ముగ్గురిని పట్టుకుని తిరిగి వదిలివేసినట్లు సమాచారం. ఈ విషయం గురించి ఎవరిని ప్రశ్నించినా వారి నుంచి స్పందన రాలేదు. ఓ వైపు పీజీ పరీక్షలు, మరో వైపు బీఈడీ వలస విద్యార్థులు చూచి రాతల పరీక్షలతో తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.

శివరాత్రి వేడుకలను పకడ్బందీగా నిర్వహిస్తాం

పొదిలి నిర్మమహేశ్వర దేవస్థానంలో విస్తృత ఏర్పాట్లు : ఈవో

పొదిలి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : శివరాత్రి వేడుకలను ఈనెల 18 నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు నిర్వహించనున్న దృష్ట్యా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వహిస్తామని స్థానిక నిర్మమహేశ్వరస్వామి ఆలయ నూతన ఈవో నర్రా నారాయణరెడ్డి చెప్పారు. స్థానిక నిర్మమహేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్వతీసమేత నిర్మమహేశ్వర బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి చొరవతో నూతన కమిటీ త్వరలోనే ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈనెల 27న పట్టణంలో రథోత్సవం ఉంటుందన్నారు. అనంతరం రథోత్సవ పనులకు కొబ్బరికాయకొట్టి ప్రారంభించారు.



మాట్లాడుతున్న ఈవో నర్రా నారాయణరెడ్డి

వైభవంగా వేంకటేశ్వరునికి ఊంజల్ సేవ



ఊంజల్ సేవలో వేంకటేశ్వరుడు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 10 ఆంధ్రజ్యోతి: మార్కాపురంలోని గుండ్లకమ్మ నదీతీరంలో ఉన్న లక్ష్మీపద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం స్వామికి విశేష పూజలు చేశారు. ప్రధాన అర్చకులు ఏవీకే నరసింహాచార్యుల ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, విశేష అర్చన, అలంకరణ, బ్రహ్మఘోష నిర్వహించారు. అనంతరం లక్ష్మీపద్మావతి సమేత వేంకటేశ్వరునికి వైభవంగా ఊంజల్ సేవ జరిగింది. ఆలయ కమిటీ అధ్యక్షులు చెక్కా మాలకొండ నరసింహారావు ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా వీరాంజనేయ స్వామి తిరునాళ్ల

త్రిపురాంతకం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెల్లంపల్లి గ్రామంలోని వీరాంజనేయస్వామి తిరునాళ్లను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్థులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు, పౌరాణిక నాటకాలు ప్రదర్శించారు.



ప్రత్యేక అలంకరణలో వీరాంజనేయుడు

ఎమ్మెల్యే కందులకు బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక అందజేత

మార్కాపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తర్లుపాడులోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆహ్వాన పత్రికను సోమవారం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి దేవాదాయశాఖ, కమిటీ సభ్యులు అందజేశారు. స్థానిక జవహర్‌నగర్ కాలనీలోని ఎమ్మెల్యే నివాసంలో ఈవో చెన్నకేశవరెడ్డి, వంశపారంపర్య ధర్మకర్త జవ్వాజి భాస్కర్, కోలగట్ల భాస్కర్‌రెడ్డి, పోలేపల్లి జనార్దన్, వెంకటయ్య, శ్రీను తదితరులు ఆహ్వాన పత్రికను అందించారు.



సీఎం సహాయనిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

స్థానిక 10వ వార్డుకు చెందిన సయ్యద్ సత్తార్‌కు మంజూరైన రూ.4,50,609 సీఎం సహాయ నిధి చెక్కును ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అందజేశారు. స్థానిక జవహర్‌నగర్ కాలనీలోని టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ షెక్షావలి, మాజీ కౌన్సిలర్ మయూరి ఖాశిం, మాబు, పెద్దబాబు తదితరులు పాల్గొన్నారు.

పొలాలను సందర్శించిన అధికారులు

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొంగలవీడు, నరవ, గిద్దలూరు రెవెన్యూ గ్రామాలలో 2024-25 సంవత్సరం కింద ఈ క్రాప్ నమోదు చేసిన పంట పొలాలను సోమవారం తహసీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి, మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్‌రెడ్డి సందర్శించారు.

వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి

కంభం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): అర్ధవీడు మండలం యాచవరం గ్రామంలో సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహంలో చదువుతున్న ఎస్సీ పిల్లలకు వార్డెన్ సరిగా తిండి పెట్టకపోవడంతో పిల్లలు వసతి గృహం నుంచి గతవారం ఇళ్లకు వెళ్ళిపోయారని రాష్ట్ర షెడ్యూలు కులాల పరిరక్షణ సంఘం అధ్యక్షులు కాటమాల చెన్నకేశవరావు చెప్పారు. ఆయన సోమవారం ఒంగోలు స్పందనలో కలెక్టర్‌ను కలిసి యాచవరం ఎస్సీ హాస్టల్ వార్డెన్ పిల్లలకు తిండిపెట్టకుండా కడుపు మాడుస్తుండడం వల్లనే పిల్లలు ఇళ్లకు వెళ్ళినట్లు తెలిపారు. హాస్టల్ సరుకులు అమ్ముకుంటున్నారన్న సంఘటనపై విచారణ జరిపి వార్డెన్ యలమందపై, వర్కర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మంచి ఉత్తీర్ణత సాధించాలి

కొమరోలు, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పట్టుదలతో బాగా చదివి మంచి ఉత్తీర్ణత సాధించాలని మండల విద్యాశాఖాధికారి బోర్రా వెంకటరత్నం చెప్పారు. స్థానిక కొమరోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు జరుగుతున్న ప్రీఫైనల్ పరీక్షలను సోమవారం ఎంఈవో వెంకట రత్నం పరిశీలించారు. సీఆర్పీలు పుల్లయ్య పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు పంపిణీ

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 10 ఆంధ్రజ్యోతి: స్థానిక పూలసుబ్బయ్య కాలనీలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. హెచ్‌ఎం రవికుమార్ మాట్లాడుతూ ప్రముఖ రచయిత, కవి పిడుగు పాపిరెడ్డి జ్ఞాపకార్థం కుమారులు రవీంద్రారెడ్డి, నరేంద్రరెడ్డిలు విద్యార్థులకు రూ.10వేలు విలువ చేసే నోట్ పుస్తకాలు, పెన్నులు అందజేశారని తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన వైసీపీ నాయకురాలు సోమవారం మృతిచెందారు. అందిన సమాచారం మేరకు... పట్టణంలోని 11 వార్డుకు చెందిన వైసీపీ అంగన్‌వాడీ వింగ్ అధ్యక్షురాలు బెల్లం రమాదేవి(50) గత నెల 31న భర్త నరసింహారావుతో కలిసి గిద్దలూరు వస్తుండగా రోడ్డు ప్రమాదం జరిగింది. వారి కారు ఓవర్‌టేక్ చేస్తుండగా ట్రాక్టర్‌ను ఢీకొంది. అదే ప్రమాదంలో ఓ వ్యక్తి బైక్‌పై గిద్దలూరు వస్తూ చిక్కుకుని తీవ్రంగా గాయపడ్డాడు. మోటార్ సైక్లిస్టు మృతి చెందగా కారులో ఉన్న రమాదేవి, నరసింహారావు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన ఇరువురిని కర్నూలుకు తరలించగా ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ రమాదేవి మృతిచెందగా నరసింహారావు కోలుకుంటున్నాడు.

ఇంటింటి ప్రచారం

మార్కాపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఇంటింటికీ వెళ్లి చట్టాలపై అవగాహన కల్పిస్తున్నట్లు న్యాయవాది కడియం రామయ్య అన్నారు. మార్కాపురం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక 7వ వార్డులో ఇంటింటికి తిరిగి చట్టాలపై అవగాహన కల్పించారు.

నులిపురుగుల మాత్రలు పంపిణీ

ఎర్రగొండపాలెం రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నులిపురుగుల మాత్రలను పంపిణీ చేశారు. విద్యాశాఖ, వైద్యశాఖ అధికారుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక నలంద హైస్కూల్, ఏపీ గిరిజన గురుకుల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

పొదిలిలో...

పొదిలి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా స్థానిక కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు మింగించారు. ఈకార్యక్రమంలో కేజీబీవీ హెడ్‌మాస్టార్ అనురాధ, ఏఎన్‌ఎం విజయ, కేజీబీవీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి

పెద్దదోర్నాల, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు పరిశుభ్రతను పాటించాలని ఎంఈవో మస్తాన్ నాయక్ చెప్పారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, అంగన్‌వాడీ కేంద్రాలలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్వీ నారాయణ రెడ్డి, ఉపాధ్యాయులు నాగమూర్తి, రామానాయక్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ చిరంజీవి చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ చిరంజీవి అధికారులతో కలిసి ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎక్కువగా భూసమస్యలపైన వినతులు వస్తున్నాయని, ప్రభుత్వం నిర్దేశించిన గడువు లోగా వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. భూ సమస్యల పరిష్కారం కోసం 4, ఇంటి స్థలాల కోసం 5, ఇంటికి దారి సమస్యను పరిష్కరించాలని కోరుతూ 1 వినతి అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం పిచ్చయ్య, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో జీవరత్నం పాల్గొన్నారు.

నేడు శ్రీలక్ష్మీ తిరుపతమ్మ కల్యాణం

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాయుడుపల్లిలో గోపయ్య సమేత శ్రీలక్ష్మీ సమేత తిరుపతమ్మస్వామి కల్యాణ మహోత్సవం ఈ నెల 11వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. మంగళవారం రాత్రి 9-32 నిమిషాలకు స్వామి కల్యాణ మహోత్సవం, రాత్రి 7 గంటలకు భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. రాత్రి గ్రామంలో శ్రీ రాజ రాజేశ్వరి నాట్యమండలి అద్దంకి వారిచే భక్త చింతామణి నాటకం ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

అవీఇవీ

కరాటేతో ఆత్మరక్షణ

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కరాటేతో ఆత్మరక్షణ చేకూరుతుందని మార్కాపురం ఎమ్ఎస్ స్పోర్ట్స్ కరాటే స్కూల్ చీఫ్ ఎగ్జామినర్ మారంరెడ్డి శ్రీనివాసరెడ్డి చెప్పారు. స్థానిక కరాటే స్కూల్‌లో సోమవారం విద్యార్థులను అభినందించి మాట్లాడుతూ విజయవాడలో రాష్ట్ర కరాటే సెలక్షన్స్ 2024-25కు నిర్వహించిన కీయో కరాటే చాంపియన్‌షిప్ పోటీలలో విద్యార్థులు వివిధ కేటగిరీలలో ఉత్తీర్ణత సాధించారన్నారు. జేకేఎస్‌సీ భార్గవ్, ఉస్సేన్‌బాషా, సాయిత్రిష, ఆసీఫ్, ఖుషల్, తేజేష్, రిజ్వాన, సహస్ర, షాకీర్ బాషాలు ప్రతిభ కనబర్చి 11 గోల్డ్ మెడల్స్, 10 సిల్వర్, 8 కాంస్య పతకాలు సాధించారని తెలిపారు. ఏపీ కరాటే అసోసియేషన్ అధ్యక్షులు మిల్టన్ శాస్త్రి, కార్యదర్శి కీర్తన, విజయవాడ పడమటి ఎమ్మెల్యే గద్దె రామ్‌మోహన్‌రావులు విద్యార్థులకు బహుమతులు అందించి అభినందించారని సీనియర్ ఇన్‌స్ట్రక్టర్ తోట ప్రసాద్ తెలిపారు.

అబాకస్‌లో రాష్ట్ర స్థాయి ప్రతిభ

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 10 ఆంధ్రజ్యోతి: స్థానిక వాసవి విద్యానికేతన్ విద్యార్థులు అబాకస్‌లో రాష్ట్ర స్థాయి ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా పాఠశాలలో సోమవారం కరస్పాండెంట్ రంగయ్య మాట్లాడుతూ తమ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న సీహెచ్ దీక్షిత జూనియర్ లెవెల్ విజువలైజేషన్ విభాగంలో రెండో బహుమతి, స్టార్ జూనియర్స్ లెవెల్‌లో 1వ తరగతి విద్యార్థిని పీవీ నాగచైతన్య మూడో బహుమతి సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో రంజిత్ కుమార్, ఉపాధ్యాయులు శిరీష, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌నకు ఎంపిక

మార్కాపురంవన్‌టౌన్, ఫిబ్రవరి 10 ఆంధ్రజ్యోతి : మార్కాపురం పట్టణంలోని కమలా హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు రజనీష్ జాతీయ స్థాయిలో అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యాడు. కమలా విద్యాసంస్థల కరస్పాండెంట్ పెనుగొండ పవన్‌కుమార్ సోమవారం రజనీష్‌ను అభినందించి మాట్లాడుతూ అనంతపురంలో జరిగిన 43వ రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో రజనీష్ పతకాలు సాధించి నేషనల్స్‌కు ఎంపికయ్యారన్నారు. 35ఏళ్ల కేటగిరిలో 100 మీటర్ల పరుగు పందెం, హైజంప్‌లో గోల్డ్ మెడల్ సాధించారని, మార్చి 4 నుంచి 9వ తేదీ వరకు బెంగళూరులో జరగబోయే నేషనల్ లెవెల్ అథ్లెటిక్స్‌కు ఎంపికయ్యారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ సింధూజ, ప్రిన్సిపాల్ డా. స్వరూప్ రంజన్ ఉన్నారు.

కరాటేలో గిద్దలూరు విద్యార్థినుల ప్రతిభ

గిద్దలూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు పట్టణంలోని సిద్ధార్థ కరాటే అకాడమీకి చెందిన 11 మంది విద్యార్థినులు రాష్ట్రస్థాయి కరాటే చాంపియన్ షిప్‌లో మెడల్స్ సాధించారు. విజయవాడలో జరిగిన పోటీలలో గిద్దలూరుకు చెందిన పి.వి.మోహనప్రియ, పి.వి.ప్రత్యూష, పి.మనోహర్ కటా విభాగంలో వివిధ బెల్టులలో గోల్డ్‌మెడల్స్ సాధించారు. టి.మనోజ్ఞ, జి.చరణ్, జి.ధనుష్‌గౌడ్, కె.నిఖిల్‌రెడ్డి, డి.వెంకటనారాయణ, పి.మనోజ్ సిల్వర్ మెడల్స్ సాధించగా ఎం.నాగశౌర్య, జె.శ్రీరామ్ బ్రాంజి మెడల్స్ సాధించినట్లు అకాడమీ నిర్వాహకులు మాస్టర్ సుబ్రమణ్యం చెప్పారు.

పేదలకు నివేశన స్థలాలు కేటాయించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

బేస్తవారపేట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పేదలందరికీ నివేశన స్థలాలు, సాగు భూమి కేటాయించాలని సీపీఐ నాయకులు సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఒకటిన్నర సెంటు స్థలం కేటాయించారని, ఆ స్థలం ఎందుకు సరిపడదని చెప్పారు. కూటమి ప్రభుత్వంలో నివేశ స్థలం, సాగు భూములకు అసైన్డ్ కమిటీ ఏర్పాటు చేసి భూమి అందజేయాలని కోరారు. కార్యక్రమంలో గిద్దలూరు నియోజకవర్గ రైతు సంఘం నాయకులు డాకాల పుల్లయ్య, ఊరుమార్పు జోసఫ్ పాల్గొన్నారు.

బ్రాహ్మణుల నిరసన

గిద్దలూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): చిలుకూరు బాలాజీ దేవాలయం ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై జరిగిన దాడిని అఖిల భారతీయ బ్రాహ్మణ మహాసంఘం ఖండించింది. ఈసంఘం జిల్లా శాఖ అధ్యక్షులు బి.ఎస్.అగ్రహారం ఇంద్రనీల్‌శర్మ ఆధ్వర్యంలో స్థానిక బ్రాహ్మణులు పట్టాభిరామస్వామి దేవాలయం దగ్గర నిరసన చేపట్టారు.



మాట్లాడుతున్న బ్రాహ్మణ సంఘం నాయకులు

పరీక్ష సామగ్రి అందజేత

గిద్దలూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గిరిజన గురుకుల బాలికల వసతి గృహంలో 10వ తరగతి చదువుతున్న బాలికలకు యువ ప్రగతిపథం స్వచ్ఛంద్రా సేవాసంస్థ పరీక్ష సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు వేణుగోపాల్, సంస్థ ప్రతినిధులు రత్నం, శ్రీనివాసులు, సిద్ధయ్య, కాశయ్య, ప్రిన్సిపాల్ రామయ్య పాల్గొన్నారు.

దొనకొండ ఎస్ఐగా త్యాగరాజు బాధ్యతల స్వీకరణ



దొనకొండ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): దొనకొండ ఎస్ఐగా త్యాగరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్సై విజయ్‌కుమార్ వీఆర్‌కు, ఒంగోలు వన్‌టౌన్ ఎస్సైగా పనిచేస్తున్న త్యాగరాజు దొనకొండకు బదిలీపై వచ్చారు. ఈసందర్భంగా త్యాగరాజు మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు. అసాంఘిక కార్యక్రమాలు, అక్రమ మద్యం, తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఈసందర్భంగా పోలీస్ సిబ్బంది, పలువురు ప్రజాప్రతినిధులు ఎస్సైని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కనిగిరి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కనిగిరి పట్టణంలో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 3గంటల వరకు టౌన్ ఫీడర్ 1, టౌన్ ఫీడర్ 3 పరిధిలో సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని ఎమ్మెస్సార్ రోడ్డు, కాశినాయన గుడి, కొత్తపేటతోపాటు పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

బంగారం దుకాణంలో చోరీ

కురిచేడు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): కురిచేడు ప్రధాన వీధిలోని సుబ్రహ్మణ్యేశ్వర జ్యూయలరీ దుకాణంలో చోరీ జరిగింది. రూ.5 లక్షల విలువైన బంగారం చోరీకి గురయినట్లు దుకాణం యజమాని దేవతి సుబ్రహ్మణ్యం తెలిపారు. ఇందుకుసంబంధించి కరిచేడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నెల 7న యజమాని షాపులో లేనిసమయంలో ఓ వ్యక్తి వచ్చి ఉంగరాలు చూపమని అడిగారు. షాపులో ఉద్యోగి ఉంగరాలు చూపించే సమయంలో దొంగ చేతివాటం ప్రదర్శించాడు. అక్కడే ఓ డబ్బాలో ఉన్న మాటీలు, ఝుంకీలు దొంగిలించాడు. వాటి బరువు 65 గ్రాములు ఉంటుందని యజమాని తెలిపారు. ఆదివారం యజమాని వచ్చి చూడగా బంగారం చోరీ అయిన విషయం తెలిసింది. దుకాణంలోని సీసీ ఫుటేజీని పరిశీలించగా దొంగతనం జరిగినట్లు గుర్తించారు. కురిచేడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సుబ్రహ్మణ్యం తెలిపారు. గతంలో కూడా ఇదే దుకాణంలో బంగారం చోరీ జరిగింది.

పలు దేవాలయాల్లో ..

కురిచేడు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమర గంగవరం గ్రామంలో పలు దేవాలయాల్లో ఆదివారం రాత్రి దొంగతనం జరిగింది. హుండీలలో సొమ్ము దొంగిలించారు. రామాలయం దేవాలయం తాళాలు పగులకొట్టి అందులోని హుండీ సొమ్ము దొంగిలించారు. పక్కనే అంజనేయ స్వామి విగ్రహం ముందు ఉన్న హుండీని పగులకొట్టి అందులోని పెద్ద నోట్లు తీసుకుని చిల్లర నోట్లు అక్కడే పడవేశారు. అలాగే, అంకాళ పరమేశ్వరి అమ్మవారి అలయంలో హుండీని పగులకొట్టి సొమ్ము తస్కరించారు. చెన్నకేశవ స్వామి ఆలయంలో హుండీ లేకపోవడంతో అక్కడి వస్తువులను చిందరవందర చేశారు. చెన్నకేశవ స్వామి ఆలయంలో నిద్రిస్తున్న శివ స్వాములలో ఒకరి వద్ద ఉన్న రూ.4 వేల నగదును కూడా దొంగలించారు. సంఘటనా స్థలాలను ఎస్ఐ శివ పరిశీలించారు.

నేడు నెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

దొనకొండ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ప్రకాశం జిల్లా నెట్‌బాల్ బాలురు, బాలికల జూనియర్ జట్ల ఎంపిక మంగళవారం దొనకొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ఫిజికల్ డైరెక్టర్ నర్సింహారావు తెలిపారు. ఈమేరకు జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.కృష్ణారెడ్డి, కార్యదర్శి ఐపీ రాజు నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ఎంపికలో పాల్గొనే బాలబాలికలు 19 సంవత్సరాల లోపు వయస్సు ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఆధార్‌కార్డు జిరాక్స్, స్టడీ సర్టిఫికెట్‌తో హాజరుకావాలన్నారు. ఎంపికైన జట్లు ఈనెల 16 నుంచి తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు.

బాస్కెట్‌బాల్ కోర్టు ప్రారంభం

పామూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ మార్క్స్ స్కూల్ ఆట స్థలంలో సోమవారం బాస్కెట్‌బాల్ కోర్టును జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి టి.సుబ్బారావుతో కలిసి కరస్పాండెంట్ ఎం.జయకుమార్ ప్రారంభించారు. ముందుగా ఒంగోలు, కందుకూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కందుకూరు విజయం సాధించింది. ఈసందర్భంగా జయకుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎక్కడాలేనివిధంగా పామూరులో కోర్టును ఏర్పాటుచేసుకోవడం ఆనందంగా ఉంద న్నారు. కార్యక్రమంలో ఇండియన్ రైల్వేకోచ్ వెంకటప్రసాద్, రిటైర్డ్ హెచ్ఎం షేక్ జిలాని, పీఈటీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలి

సీఎస్‌పురం(పామూరు), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకొని జీవిస్తున్న వారికి ఇళ్ల పట్టాలు, ప్రభుత్వ భూములను సాగు చేసుకొంటున్న రైతులకు పాస్‌పుస్తకాలు మంజూరు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి ఎస్‌కే పెదమస్తాన్ డిమాండ్ చేసారు. ఈమేరకు సోమవారం డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. ఇంటి పొజిషన్ పట్టాలు లేకపోవడంతో కాలనీలు మంజూరు కావడం లేదన్నారు. కార్యక్రమంలో నరసమ్మ, బి.వెంక టేశ్వర్లు, ఎస్.రమేష్, ఎన్.నారాయణ, రాజ య్య, కె.రావెలమ్మ, ఇ.మాధవ పాల్గొన్నారు.

నిఘా నీడలో పల్లెలు

- ప్రజల సహకారంతో సీసీ కెమెరాల ఏర్పాటు

పీసీపల్లి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణకు పోలీసుశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. జిల్లా ఎస్పీగా ఏఆర్ దామోదర్ బాధ్యతలు చేపట్టాక సాంకేతికతను అందిపుచ్చుకుని నేరాల నియంత్రణకు నడుం బిగించారు. జిల్లావ్యాప్తంగా పోలీసుస్టేషన్‌ల పరిధిలో సమస్యాత్మక గ్రామాలు, ప్రధాన కూడళ్లు, రహదారులు, గతంలో ఎక్కువగా నేరాలు జరిగిన ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలని అధికారులతో పాటు ఆయా పోలీసు స్టేషన్‌ల ఎస్‌హెచ్‌వోలను ఆయన ఆదేశించారు. సీసీ కెమెరాల ఏర్పాటులో అవసరమైనచోట ఆయా గ్రామాల ప్రజల సహకారాన్ని తీసుకోవాలని సూచించారు.

ఎస్పీ ఆదేశాల మేరకు పీసీపల్లి పోలీసులు ఇప్పటికే మండలంలోని 18గ్రామ పంచాయతీల్లో 58 సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు. వీటిని ఉపయోగించుకుని నేరాల నియంత్రణకు కట్టుదిట్ట చర్యలు చేపడుతున్నారు. కనిగిరి డీఎస్పీ, సీఐల పర్యవేక్షణలో ఎస్సై జి.కోటయ్య మండలంలో కెమెరాల ఏర్పాటుకు ఆయా గ్రామాల ప్రజల సహకారాన్ని తీసుకున్నారు. మండల కేంద్రమైన పీసీపల్లిలో బ్యాంకు సెంటర్, ఎన్టీఆర్ విగ్రహం సెంటర్, ప్రభుత్వ వైద్యశాల సెంటర్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అలాగే, మండలంలోని పెదయిర్లపాడు, నేరేడుపల్లి, పెదఅలవలపాడు, పాలేటిగంగ దేవాలయం, భట్టుపల్లి, మర్రికుంటపల్లి, తలకొండపాడు, వెంగళాయపల్లి, గుంటుపల్లి, లక్ష్మక్కపల్లి, చింతగుంపల్లి, లింగన్నపాలెం గ్రామాలతో పాటు మండలవ్యాప్తంగా అన్ని గ్రామాలు కవర్ అయ్యేలా మొత్తం 58 సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు. గతంలో ఉన్న సీసీ కెమెరాలలో కేవలం వీడియోఫుటేజీ మాత్రమే వచ్చేది. ఇప్పుడు కొత్తగా ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల్లో వాయిస్ కూడా రికార్డు అవుతుంది. నేరాలకు పాల్పడ్డ వ్యక్తుల నేరచర్యలను వీడియో రికార్డు చేయడంతో పాటు నేరానికి ముందు తర్వాత వారు ఏమేమి మాట్లాడుకున్నారు అన్న మాటలను కూడా ఈ సీసీ కెమెరాలు రికార్డు చేస్తాయి. దీంతో నేరాలు జరగకుండా అడ్డుకట్ట వేయడంతో పాటు ఒకవేళ నేరం జరిగినా త్వరగా నిందితులను గుర్తించవచ్చునని ఎస్సై జి.కోటయ్య తెలిపారు. వాహనాల నెంబర్లను సైతం క్షుణ్ణంగా ఈ సీసీ కెమెరాలు క్యాప్చర్ చేస్తాయని ఆయన చెప్పారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సేఫ్టీ 2013చట్టం ప్రకారం వంద మంది కంటే ఎక్కువ జనసంచారం ఉండే వ్యాపార సముదాయాలైన రెస్టారెంట్లు, పెట్రోల్ బంకులు, హోటల్స్, మద్యం షాపులు, సూపర్‌మార్కెట్‌లు, తదితర ప్రదేశాల్లో ఆయా సంస్థల యజమానులు స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై కోటయ్య పేర్కొన్నారు.



మర్రికుంటపల్లి వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు



పీసీపల్లి బస్టాండు సెంటరులో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న ఎస్ఐ కోటయ్య

పేదలకు ఆసరా సీఎం సహాయనిధి

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ అనారోగ్యంతో బాధపడు తున్న పేద కుటుంబాలకు సీఎం సహాయనిధి ఎంతో ఆసరాగా నిలుస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో సోమవారం రూ.13.81లక్షల చెక్కులను 8 మంది లబ్ధిదారులకు అందజేశారు. ఈసందర్భం గా ఆయన మాట్లాడుతూ చాలామంది పేద కుటుం బాలవారు అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం చేయిం చుకునే స్థోమత లేక ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. నియోజకవర్గంలో ఎంతోమంది పేద కుటుంబాలకు టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం సహాయనిధి కింద ఆర్థిక సహాయం అందించినట్లు చెప్పారు. ఖర్చు తో కూడుకున్న వైద్యం చేయించుకోలేక అనారోగ్యంతో బాధపడేవారికి అండగా ఉంటామన్నారు.



సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కాగా, కనిగిరి మండలానికి చెం దిన తమ్మినేని చిరంజీవిరెడ్డికి రూ. 1.09లక్షలు, మన్నెం వెంకటసుబ్బ య్యకు రూ.80వేలు, పామూరు మం డలానికి చెందిన కొప్పల్లి నాగేశ్వరరా వుకు రూ.8 లక్షలు, చావా కమలమ్మ కు రూ.1.5లక్షలు, పందెం కేశవులుకు రూ.32 వేలు, హెచ్ఎంపాడు మండ లానికి చెందిన మొండెద్దు కొండారెడ్డి కి రూ.32 వేలు, కాసు నిర్మలకు రూ.1.13లక్షలు, వెలి గండ్ల మండలానికి చెందిన అనమలగుర్తి ఓబయ్యకు రూ1.9లక్షలు సీఎం సహాయనిధి కింద ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి చెక్కులను పంపిణీ చేశారు.

నులిపురుగులతో చిన్నారుల్లో రక్తహీనత

- వ్యక్తిగత పరిశుభ్రతతో నివారణ
- డిప్యూటీ డీఎంహెచ్‌వో సుజన
- అల్బెండజోల్ మాత్రల పంపిణీ

పీసీపల్లి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): నులి పురుగులు చిన్నారుల శారీరక, మానసిక ఎదుగు దలకు హాని కలిగిస్తాయని డిప్యూటీ డీఎంహెచ్ వో డాక్టర్ సుజన అన్నారు. జాతీయ నులిపురు గుల దినోత్సవం సందర్భంగా సోమవారం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను మింగించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా నులిపురుగులను నివారించవచ్చునని చెప్పారు. ఈ నులిపురుగులతో చి న్నారులు రక్తహీనతకు గురవుతారన్నారు. సంవత్సరం నుంచి రెండు సంవత్సరాల పిల్లలకు సగం మాత్ర నీటిలో కరిగించి మింగించాలన్నారు. రెండు నుంచి 19 సంవత్సరాల వయస్సు కలిగినవారు ఒక అల్బెండజోల్ మాత్రను మింగవచ్చునని చెప్పారు. సోమవారం మండ లంలో ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో మొత్తం 4818మంది పిల్లలకు అల్బెండజోల్ మాత్రను మింగించారు.

కార్యక్రమంలో పీసీపల్లి వైద్యాధికారిణి డాక్టర్ మంజు ల, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి ఆల్బెండజోల్ మాత్రను మింగిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో సుజన

నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ

కురిచేడు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా కురిచేడు మండలంలో 98.5 శాతం మందికి అల్బెండజోల్ మా త్రలు పంపిణీ చేసినట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వై ద్యాధికారులు ప్రవీణ్, రవితేజ తెలిపారు. 9189 మందికి మాత్రలు పంపిణీ చేయాల్సిఉండగా, 9052 మందికి ఇచ్చినట్లు తెలిపారు. మిగిలిన వారికి ఈనెల 17న పం పిణీ చేస్తామని ప్రవీణ్ తెలిపారు. కార్యక్రమంలో అం గన్‌వాడీలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

నులిపురుగులతో అజీర్తి

తాళ్లూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): నులిపురుగులతో అజీర్తిగా ఉండి చిన్నా రులు అనారోగ్యం పాలవుతారని పీహె చ్‌సీ వైద్యురాలు షేక్ ఖాదర్‌మస్తాన్‌బీ అన్నారు. ప్రతి విద్యార్థి నులిపురుగుల నివారణ ద్రావణం తీసుకోవాలని చె ప్పారు. నులిపురుగుల నివారణ మందు ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా సోమవారం తాళ్లూరు, తూర్పుగంగవ రం పీహెచ్‌సీల పరిధిల్లోని పలుప్రాథ మిక పాఠశాలల్లో డీవార్మింగ్ మందు లు వేశారు. తాళ్లూరు పీహెచ్‌సీ పరి ధిలో 4594 మంది చిన్నారులకుగాను 4511 మందికి నులిపురుగుల నివారణ మందులు వేసినట్లు వైద్యాధికా రిణి తెలిపారు. తూర్పుగంగంగవరం పీహెచ్‌సీ పరి ధిలో 5593 మంది చిన్నారులకు వేయాలని లక్ష్యంగా పెట్టుకుని 5393 మందికి నివారణ మందు వేసినట్లు వైద్యాధికారిణి మౌనిక తెలిపారు. మిగిలిన వారికి 17వ తేదీలోపు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమాల్లో వైద్యులు శ్రీకాంత్‌రెడ్డి, హెచ్ఈవోలు రవి, చంద్రశేఖర్‌బాబు, పీ హెచ్ఎన్ రమణమ్మ, హెచ్‌వీ సుశీల, ఏబీసీ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, ఏఎన్ఎంలు, ఆశకార్యకర్తలు తదిత రులు పాల్గొన్నారు.

వేర్వేరుచోట్ల అగ్నిప్రమాదాలు

- కంది పంట, పొగాకు బ్యారెన్ దగ్ధం

కనిగిరి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం లో ఆదివారం రాత్రి వేర్వేరుచోట్ల జరిగిన అగ్నిప్రమా దాల్లో పొగాకు బ్యారెన్, కంది పంట దగ్ధమైంది. వెలి గండ్ల మండలం పాపిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మా రం సుబ్బారెడ్డికి చెందిన పొగాకు బ్యారెన్‌లో అగ్నిప్ర మాదం చోటుచేసుకుంది. కాల్పు కర్రలు కింద పడటం తో మంటలు ఎగిసిపడి పొగాకు పూర్తిగా కాలిపోయిం ది. దీంతో రూ.4 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోతున్నారు. అలాగే, సీఎస్‌పురం మండలం అం బవరం కొత్తపల్లిలో బసిరె డ్డి వెంకటసుబ్బారెడ్డికి చెందిన కంది పంట దగ్ధ మైంది. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పటించిడంతో పది ఎకరాల కందిచేనులో మూడొంతులు దగ్ధమైంది. దాదాపు రూ.3 లక్షలు న ష్టం వాటిల్లినట్లు బాధితు డు తెలిపారు.

అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

అగ్నిప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండా లని అగ్నిమాపకశాఖ అధికారి బంగారుబాబు అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వచ్చే వేసవి దృష్ట్యా రైతులు, ప్రజలు అగ్ని ప్రమాదాల విష యంలో జాగ్రత్తంగా ఉండాలన్నారు. పొగాకు రైతులు కాల్పు సమయంలో కట్టుదిట్టమైన జాగ్రత్తలు తీసుకో వాలని చెప్పారు. అంబవరం కొత్తపల్లి గ్రామంలో కంది చేను, పాపిరెడ్డిపల్లి గ్రామంలోని పొగాకు బ్యారెన్ ఆది వారం రాత్రి దగ్ధమైనట్లు ఆయన తెలిపారు. గ్రామ స్థులు అందించిన సమాచారంతో సంఘటనాస్థలికి చేరు కుని మంటలను అదుపుచేసినట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని నష్టం అంచనాలు వేస్తున్నట్లు ఆయన తెలిపారు.



అంబవరంలో కంది పంటలో మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది



పొగాకు బ్యారెన్‌లో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మౌలిక వసతుల కల్పనకు కృషి

ముండ్లమూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములబం డ గ్రామ పంచాయతీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. గ్రామంలో కొండ గురునాథ స్వామి జాతర సందర్భంగా సోమవాంం టీడీపీ వర్గీయులు ముందస్తుగా ఏర్పాటుచేసిన విద్యుత్ ప్రభపై ఆమె మాట్లాడారు. వేముల బండ నుంచి ఈదర వరకు తారు రోడ్డు నిర్మాణానికి త్వరలో నిధులు మంజూరు చేయిస్తామన్నారు. సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. అనంతరం గ్రామ టీడీపీ నాయ కుల ఆధ్వర్యంలో డాక్టర్ లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మందలపు వెంకటరావు, టీ డీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, డీసీ చైర్మన్ కంచుమాటి శ్రీనివాసరావు, సర్పంచ్ చిమ్మిలి కోటేశ్వరమ్మ, కొండయ్య, దిరిశాల శ్రీనివా సరావు, మామిళ్ళపల్లి కోటేశ్వరరావు, కనమర్లపూడి సుబ్బారావు, కొక్కెర నా గరాజు, సోమేపల్లి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సర్వే నెంబర్లను సరిచేయాలి

పామూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొట్లగూడూరు రెవెన్యూ గ్రామ సర్వే నెంబర్ 677/8 లో చోటు చేసుకొన్న అక్రమాలపై స్పందించి సర్వే నెంబర్లను సరి చేయాలని బాధిత రైతులు కోరారు. ఈమేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో బీవీ రమణారావుకు వినతి పత్రం అందచేశారు. రెవిన్యూ రికార్డుల ప్రకారం 22.10 సెంట్ల భూమికి బదులు అదనంగా మరో 12 ఎకరాలు కలిపి మొత్తం 35 ఎకరా లుగా చూపిస్తూ 2021లో వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసి ఖాతా నెంబర్ ఇచ్చారు. ఈవిషయంపై జూన్ 12, 2021లో భూచిచ్చు శీర్షికన ఆంధ్రజ్యోతి లో కథనం ప్రచురితమైంది. ఇందుకుసంబంధించి తహసీల్దార్ రమణా రావుకు ఇచ్చిన వినతిపత్రంలో రైతులు పేర్కొన్నారు. ఈ కథనంపై సం యుక్త కలెక్టర్ ఆదేశాల ప్రకారం అక్రమంగా వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసిన భూమిలో నకిలి పట్టాదారులను తొలగించాల్సి ఉండగా అధికారులు పట్టించుకోవడం లేదు. వాస్తవంగా హక్కు కలిగిన రైతులకు ఆన్‌లైన్ కాక, మరికొందరికి ఆన్‌లైన్‌లో సర్వేనెంబర్లు తప్పుగా ఉండటంతో వాటిని సరిచేయాలని కోరుతు గత ఐదు సంవత్సరాలుగా తిరుగుతున్న రెవెన్యూ అధికారులు పట్టించుకోవడంలేదు. ఇప్పటికైన అధికారులు స్పందించి సర్వే నెంబర్‌లోని రెవెన్యూ అక్రమాలను సరిచేయాలని యర్రసింగ్ సత్యం, మేదరమెట్ల బాలకోటయ్యలు వినతి పత్రం అందజేశారు. కాగా, ఆన్‌లైన్, మ్యుటేషన్ తదితర సమస్యలపై పది దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ బీవీ రమణారావు తెలిపారు.

భక్తి శ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్ఠ వేడుకలు



ధ్వజ స్తంభం ఏర్పాటుకు హారతి ఇస్తున్న డాక్టర్ ఉగ్ర

సీఎస్‌పురం(పామూరు), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండ లం అయ్యవారిపల్లి గ్రామంలో సోమవారం శ్రీదేవి భూదేవి సమేత తిరుమ లనాథ స్వామి దేవస్థాన ముఖద్వారం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మె ల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అనంతరం భక్తులతో కలిసి ముఖద్వా రం, శ్రీలక్ష్మీ గణపతి విగ్రహా, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలను ప్రారంభిం చి వేద మంత్రాల నడుమ ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఎమ్మె ల్యే ఉగ్రను శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ము త్యాల వెంకటసుబ్బారెడ్డి, ముత్యాల రమణారెడ్డి, బోయిళ్ల నారాయణరెడ్డి, స ర్పంచ్ ముత్యాల బారతి, గంగిరెడ్డి రామచంద్రారెడ్డి, గంటా శ్రీరాములు, పి. మోహన్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు బి.వెంగయ్య, సీహెచ్ వెంకట్‌రెడ్డి, ఎం.శ్రీనివాసులు, ఎన్‌సీ మాలకొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ అధికారులకు సన్మానం

దర్శి ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఉత్తమ అవార్డులు అందుకున్న అధికా రులకు స్థానిక కాకతీయ కమ్మ సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘ నంగా సన్మానించారు. ఒకేసారి రెండు అవార్డులు అందుకున్న తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్‌ను దర్శి పట్టణ కమ్మసేవా సంఘం అధ్యక్షుడు గుర్రం ప్రసాద్, ప్రధాన కార్యదర్శి మానికొండ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో పూ లమాలలు వేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. గత అసెంబ్లీ ఎన్ని కల్లో బాపట్ల ఏఈఆర్‌వోగా ఉత్తమ సేవలందించినందుకు శ్రావణ్‌కుమార్‌కు అవార్డు లభించింది. అలాగే, దర్శిలో వేగవంతంగా పనులు నిర్వహించ టంతో పాటు ఎలక్ట్రోల్ విధులు పూర్తి చేసినందుకు మరో అవార్డు అందుకు న్నారు. ఒకేసారి రెండు అవార్డులు లభించిన తహసీల్దార్ శ్రావణ్‌కుమార్‌ను సన్మానించారు. శాంతి భద్రతల పరిరక్షణ, అధునాతన టెక్నాలజీతో కేసులు పరిష్కారం చేస్తున్న సీఐ వై.రామారావుకు కూడా ఉత్తమ అవార్డు లభించ గా కాకతీయ కమ్మ సేవా సంఘం ఆధ్వర్యంలో సర్కిల్ కార్యాలయంలో సన్మానించారు. సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్న ఎస్సై ఎం.మురళీని సన్మానించారు. కార్యక్రమాల్లో కాకతీయ కమ్మ సేవా సంఘం ఉపాధ్యక్షుడు గోనుగుంట్ల శ్రీధర్, నాయకులు తిరుపతిస్వాములు, కొత్రపాటి హనుమంత రావు తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించకుంటే చర్యలు

తాళ్లూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న సిబ్బంది సమయపాలన పాటించకుంటే శాఖాపరచర్యలు తప్పవని డిప్యూ టీ ఈవో చంద్రమౌళీశ్వర హెచ్చరించారు. సోమవారం మండలంలోని క స్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, నాగంబొట్లపాలెం జడ్పీ ఉన్నత పాఠ శాలలను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా కేజీబీవీలో కొందరు సీఆ ర్‌టీల హాజరు సక్రమంగా నమోదు కాకపోవడాన్ని ప్రశ్నించారు. భోజనం సరిగా ఉండటంలేదని బాలికలు ఆయన దృష్టికి తెచ్చారు. రుచికరంగా భోజనం తయారుచేయకుంటే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. కేజీబీవీలోని ఏఎన్ఎం వంటసిబ్బందిపై జిల్లా అధికారులకు ఇచ్చిన ఫిర్యా దు మేరకు వారిని విడివిడిగా విచారించి లిఖిత పూర్వక సమాధానం తీసు కున్నారు. నాగంబొట్లపాలెంలో వంట మనిషి మార్పు విషయంపై కూడా విచారణ జరిపారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఈవోలు జి.సుబ్బయ్య, సుధా కర్‌రావు, ప్రిన్సిపాల్ సుజిత, హెచ్ఎం అంజలి, సిబ్బంది పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు

పీసీపల్లి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పనులు చేయకుండానే నిధులు డ్రా చేశారని పీసీపల్లి పంచాయతీకి చెందిన పలువురు వార్డు మెంబర్లు సోమ వారం ఒంగోలులో జరిగిన మీకోసం కార్యక్రమంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అందిన సమాచారం మేరకు డీప్‌బోర్లకు మరమ్మతు చేయకుండానే చేసినట్లు సుమారు రూ.11 లక్షలు, పాల కేంద్రం నిర్మించకుండానే రూ. 2.06 లక్షలు, మురుగు కాల్వల పూడిక, బ్లీచింగ్, సచివాలయం ప్రైవేటు బిల్డింగ్‌కు మరమ్మతుల పేరుతో మరో రూ.15లక్షల అవినీతి జరిగిందని పే ర్కొన్నారు. ఇలా జరిగిన పలు అవకతవకలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఇండ్లచెరువు రోడ్డుకు మోక్షం ఎప్పుడో..!

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని గత వైసీపీ పాలకులు
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

దొనకొండ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): దొనకొండ నుండి ఇండ్లచెరువు గ్రామం మీదుగా మార్కాపురం వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయమైంది. ఈ ప్రధా న రహదారి మరమ్మతులకు మోక్షం ఎప్పుడు కలుగు తుందోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎటువంటి కనీస మరమ్మతులకు నోచుకోకపోవటంతో ప్రస్తుతం అడుగుకో గుంత పడటంతో వాహన చోదకులు అవస్థలు వర్ణణాతీతంగా ఉన్నాయి. ఈరహదారిపై రాకపోకలు సాగించే ద్విచక్ర వాహ నదారులు గుంతల రోడ్డులో నడుములు నొప్పులు వస్తు న్నాయని వాపోతున్నారు.

మండలంలోని ఇండ్లచెరువు, రాగమక్కపల్లి, పోచ మక్కపల్లి, భూమనపల్లి, చిలకలపల్లి, మంగినపూడి తది తర గ్రామాలకు చెందిన ప్రజలేకాక ఇతర ప్రాంతాల నుంచి మార్కాపురం వెళ్లే వాహన చోదకులు ప్రతిరోజు వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. అటువం టి ప్రధాన రహదారి నేడు గుంతలమయమై అధ్వానం గా మారటంతో వాహనదారులకు ప్రాణసంకటంలా మారింది. వర్షాలు కురిసిన సమయంలో రహదారిపై ఎక్కడ గుంత ఉందో, ఎక్కడ లేదో తెలియక ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. గత వైసీపీ పాలనలో ఎటువంటి మరమ్మ తులు చేపట్టకపోవటంతో ఈ రోడ్డు మరింత దారుణంగా ఉంది. టీడీపీ కూటమి ప్రభుత్వం నేతృత్వంలో ఈ రహదారికి మరమ్మతులు జరుగుతాయని ప్రజలు భావిస్తున్నారు.

సంబంధిత అధికారులు, పాలకులు అధ్వానంగా తయారైన ఇండ్లచెరువు రహదారికి మరమ్మతులు చేపట్టి తమ ఇబ్బం దుల ను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



అధ్వానంగా మారిన ఇండ్లచెరువు ప్రధాన రహదారి





ఘంటా హనుమయ్య ఛారిటీస్ ధర్మ సత్రం ఉన్న భవనంపై కళ్యాణ మండపాన్ని ఏర్పాటుచేసిన చిత్రం

ధర్మసత్రం.. లేదే లెక్కాపత్రం!

ఒకప్పుడు పేదల ఆకలి తీర్చిన అన్నదాన సత్రాలవి. బాటసారులకు నీడనిచ్చిన వసతి గృహాలు కూడా. దశాబ్దాల కాలంగా ఆకలితో వచ్చిన వారికి పట్టెడన్నం పెట్టడమే ఇక్కడ పరబ్రహ్మ స్వరూపంగా భావించే వారు. ఇదంతా ఒకప్పటి మాట... ఇప్పుడక్కడ అన్నం పెట్టేవారు లేరు. దాతృత్వం చూపేవారూ లేరు. దాన గుణం ఉండాల్సిన ఆ పవిత్ర స్థలాల్లో ఇప్పుడు స్వార్థం రాజ్యమేలుతోంది. దాతల ఆనాటి లక్ష్యం తారుమారై ఈనాడు వ్యాపారమైపోయింది. ఎందరికో నీడనిచ్చి, పట్టెడన్నం పెట్టాల్సిన చోట కాసులు పోగేసుకుని మింగేస్తున్నారు. వీటిని కాపాడాల్సిన దేవదాయ శాఖ అధికారులూ కొంతమంది వారితో చేతులు కలిపి వాటాలేసుకుని మరీ దోచేస్తున్నారు.



సత్రం బయట ఖాళీ స్థలాన్ని బీరువాలు తయారీ వారికి అద్దెకిచ్చిన చిత్రం

దాతలిచ్చిన సత్రాల ఆస్తుల విలువ నేడు రూ. వందల కోట్లు

- పేరుకే దేవదాయ శాఖ అధీనంలో...
- అంతా ట్రస్టీల సొంత ఆస్తులన్నట్టు వాటిలో వ్యాపారం
- పేదలకు అన్న'దానం' లేదు... ఆస్తులకు లెక్కాలేదు!
- పరిరక్షించాల్సిన అధికారులకూ వాటాల ఆశలు!
- సదావర్తి భూముల వ్యవహారం ఒక అనుభవం అయినా... కళ్లు తెరవని దేవదాయ శాఖ

తెనాలి, ఫిబ్రవరి 10, (ఆంధ్రజ్యోతి): వందల సంవత్సరాల క్రితం స్థలాలు, భవనాలు దానమిచ్చిన దాతల ఆశయానికి నిలువునా తూట్లు పొడుస్తున్నారు. ఎన్నో సంవత్సరాల క్రితం ఇచ్చిన స్థలాలు ఇప్పుడు మంచి వ్యాపార కూడళ్లవడం, ఉచితంగా ఇచ్చిన స్థలాల విలువ అమాంతం పెరిగిపోయి రూ. వందల కోట్లు పలుకుతుండటంతో కొంతమంది వాటిని సొంత ఆస్తుల తరహాలో అమ్మేసుకుంటున్న దారుణ పరిస్థితులు ఉన్నాయంటే అతిశయోక్తికాదు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో వందల సంఖ్యలో ఇటువంటి అన్నదాన సత్రాలున్నాయి. వీటిలో చాలావరకు పట్టణాల్లోని ప్రధాన కూడళ్లు, వ్యాపార అనుకూల ప్రాంతాల్లో ఉండటం, అత్యంత ఖరీదైన స్థలాలున్న ప్రదేశాల జాబితాలోకి చేరటంతో నిన్నటి వరకు సత్రాల కార్యకలాపాలు సాగించిన ట్రస్టీలకు ఆశపెరిగిపోయి, సేవ చెయ్యాల్సినచోట వ్యాపారం చేసేస్తున్నారు. ఉన్న దుకాణాలను భారీ మొత్తంలో అద్దెలకిచ్చి, లెక్కల్లో మాత్రం తక్కువ చూపటం, సత్రాల ఖాళీ స్థలాలను సొంతగా అద్దెలకివ్వటం, వచ్చిన డబ్బును దేవదాయ శాఖ ఖాతాలో కాకుండా సొంత ఆస్తిలాగా జేబులో వేసుకోటం పరిపాటిగా మారింది. మరి కొన్నిచోట్లయితే సొంత (మిగతా 8వ పేజీలో)



బర్రిపాలెం రోడ్డులోని బర్రిపూడి రామయ్య అన్నపూర్ణమ్మ ధర్మ సత్రం భవనం దుస్థితి

> తెనాలిలో యడ్లపల్లి కోటిలింగం ధర్మ సత్రం బోస్‌రోడ్డులో ఉంది. దీని కింద 2 ఎకరాల భూమి, షాపులు ఆస్తిగా ఉన్నాయి. వీటిపై వచ్చే ఆదాయంతో ప్రతి సంక్రాంతికి 100 మంది జంగమ మహేశ్వరులకు బియ్యం దానం చేయాలి. ఇక్కడ అపర కర్మలకు అవకాశం ఇవ్వాలి. అయితే ఇది కొంత వరకు జనానికి ఉపయోగపడుతోంది. పట్టణంలో అద్దె ఇళ్లలో ఉండేవారికి అపరకర్మలకు ఇదే ఆధారం. అయితే ఆదాయ వ్యయాల లెక్కలు మాత్రం గుట్టుగా ఉంచుతారనే విమర్శ ఉంది.

ఊపందుకున్న.. గ్రీన్ ఫీల్డ్ హైవే పనులు

అద్దంకి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : రెండు రాష్ట్రాలను కలుపుతూ నిర్మిస్తున్న విజయవాడ - బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. విజయవాడ - బెంగళూరు మధ్య దూరం తగ్గే విధంగా హైవే నిర్మాణం జరుగుతుంది. విజయవాడ నుంచి ముప్పవరం వరకు ప్రస్తుతం ఉన్న జాతీయ రహదారిని వినియోగిస్తారు. బాపట్ల జిల్లా ముప్పవరం నుంచి ఉమ్మడి అనంతపురం జిల్లాలోని కొడికొండ వరకు సుమారు 343 కి.మీ దూరం



అద్దంకి సమీపంలో జరుగుతున్న విజయవాడ-బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు



కొత్తగా గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం చేయనున్నారు. కొడికొండ నుంచి బెంగళూరు వరకు ప్రస్తుతం ఉన్న హైవేనే వినియోగించనున్నారు. ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప, అనంతపురం జిల్లాల గుండా గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు వెళ్తుంది. ముప్పవరం, కొడికొండ వద్ద ట్రంప్‌లెట్‌లు ఉంటాయి. మిగిలిన 12 చోట్ల ఇంటర్‌చేంజ్ పాయింట్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఆయా ఇంటర్‌చేంజ్ పాయింట్‌లు, ట్రంప్‌లెట్‌ల వద్ద మాత్రమే గ్రీన్‌ఫీల్డ్ హైవేలోకి ప్రవేశించడం, బయటకు రావడానికి అవకాశం ఉంటుంది. తొలుత అద్దంకి వద్ద ఇంటర్‌చేంజ్ పాయింట్ ఇవ్వక పోయినప్పటికీ, అనంతరం అందిన వినతిపత్రాలను పరిగణలోకి తీసుకొని ఇంటర్ చేంజ్ పాయింట్‌ను నిర్మాణం చేస్తున్నారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి 70మీటర్ల వెడల్పుతో భూసేకరణ చేశారు. అందులో 40 మీటర్ల వెడల్పుతో 6 లైన్ల రోడ్డు నిర్మాణం చేస్తున్నారు. మధ్యలో డివైడర్‌ను ఏర్పాటు చేసి గ్రీనరీ పెంచనున్నారు. మిగిలిన ప్రాంతాల్లో గత ఏడాదే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కాగా, ముప్పవరం నుంచి తాళ్లూరు వరకు రోడ్డు నిర్మాణ పనులు ఒకింత ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. రోడ్డు నిర్మాణ పనులు ఆలస్యంగా ప్రారంభమైనప్పటికి ప్రస్తుతం వేగవంతంగా జరుగుతున్నాయి. రోడ్డుకు గ్రావెల్ తోలకం ప్రస్తుతం జరుగుతుంది. అదే సమయంలో రోడ్లు, వాగులు క్రాసింగ్‌ల వద్ద బ్రిడ్జిల నిర్మాణం కూడా జరుగుతున్నాయి. గుండ్లకమ్మ నది దాటే వద్ద బ్రిడ్జి నిర్మాణ పనులు కూడా ప్రస్తుతం ప్రారంభమయ్యాయి. గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణ పనులు 2 సంవత్సరాల కాలంలో పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ ఆలస్యంగా ప్రారంభం కావడంతో 2026 చివర లేదా 2027 ప్రారంభానికి పూర్తి స్థాయిలో పనులు పూర్తయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే బెంగళూరుకు ప్రయాణ దూరం తగ్గడంతో పాటు తక్కువ సమయంలో చేరుకునే వీలు కలుగుతుంది. గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం ప్రైవేటు భాగస్వామ్యంతో జరుగుతున్న నేపథ్యంలో ట్రంప్‌లెట్‌లు, ఇంటర్‌చేంజ్ పాయింట్‌ల వద్ద టోల్ ఫీజులు వసూలు చేయనున్నారు. ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్‌లు, ఆటోలకు గ్రీన్‌ఫీల్డ్ హైవేలో ప్రయాణించే అవకాశం ఉండదు. బస్‌లు, లారీలు, కార్లకు మాత్రమే అనుమతి ఇస్తారు. దీంతో ఎక్కువ వేగంగా ప్రయాణించే అవకాశం ఉంటుంది. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి రాజధాని ప్రాంతానికి త్వరగా చేరుకునేందుకు కూడా గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు ఉపయోగపడనుంది.

ఆర్టీసీలో.. డొక్కు బస్సులు



జీటీ రోడ్డులో ఇటీవల రోడ్డుపై ఆగిపోయిన చిలకలూరిపేట డిపో పల్లె వెలుగు బస్సు

- ప్రయాణం మధ్యలో ఆగిపోతున్న వైనం
- వైసీపీ పాలనలో ఒక్క బస్సూ కొనని వైనం
- ఉమ్మడి జిల్లాలో 60 శాతంపైనే పనికి రానివి

గుంటూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క కొత్త బస్సు కొనకపోవడంతో, దాని పర్యవసాన పరిస్థితులు నేడు ఆర్టీసీని వెంటాడుతున్నాయి. ప్రయాణీకులతో రాకపోకలు సాగించే బస్సులు మార్గమధ్యంలో అర్థాంతరంగా నిలిచిపోతు న్నాయి. ఇటీవల వరుసగా బస్సులు మొరాయిస్తుం డటంతో ప్రయాణీకుల్లో తీవ్ర అసహనం వ్యక్తమవుతోంది. తాజాగా గుంటూరు జీటీ రోడ్డులో గుండారావుపేట వద్ద ఇటీవల గుంటూరు - చిలకలూరిపేటకు రాకపోకలు సాగించే చిలకలూరిపేట డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సు అర్థాంతరంగా నిలిచిపోయింది. డ్రైవర్ ఎంత ప్రయత్నించినా బస్సు ముందుకు కదలక పోవటంతో అందులోని ప్రయాణీకులను వేరొక బస్సులో చేర్పించి గమ్యస్థానాలకు చేర్చాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఇదే విధంగా ఇటీవల కొన్ని రోజుల కిందటే జీటీ రోడ్డులోనే గుంటూరు నుంచి పిడుగురాళ్ళ వెళుతోన్న బస్సు కూడా మార్గం మధ్యలో మొరాయించింది. అర్థాంతరంగా నిలిచి పోవటంతో డ్రైవర్ సదరు బస్సులోని ప్రయాణీకులను మరో బస్సులోకి ఎక్కించారు. ఇదిలా ఉంటే ఉమ్మడి గుంటూరు జిల్లాలో మొత్తం 980కు పైగా బస్సులు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. వీటిలో గుం టూరు-1, 2 డిపోలతో పాటు తెనాలి, మంగళగిరి, పొన్నూరు, బాపట్ల, రేపల్లె, నరసరావుపేట, చిలకలూ రిపేట, మాచర్ల, వినుకొండ డిపోలలో బస్సులు 60 శాతం పైన డొక్కు బస్సులే ఉన్నట్లు ఆర్టీసీ వర్గాలే చెబు తున్నాయి. వాస్తవానికి 12 లక్షల కిలోమీటర్లు ప్రయా ణించిన బస్సులను తుక్కు కింద పరిగ ణించాల్సి ఉంటుంది. అటువంటి ఆర్టీసీ యంత్రాంగం ఆయా నిబంధనలు పాటించటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

నిబంధనల మేరకు తిరగాల్సిన కిలో మీటర్ల కంటే అదనంగా తిరిగిన పల్లె వెలుగు బస్సులు కూడా నేటికీ ప్రయాణీకులతో రాకపోకలు సాగిస్తు న్నాయన్న విమర్శలున్నాయి. దాంతో మార్గమధ్యంలో ఎక్కడ మొరాయిస్తాయో తెలియని పరిస్థితులు నెలకొ న్నాయి. నిబంధనల ప్రకారం బస్సుల్లో రిపేర్లు వస్తే మరమ్మతుల నిర్వహణ కోసం ఉంచాల్సిన పరికరాలు (టూల్స్ కిట్‌లు) కూడా ఉండటం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో బస్సులు ఆగిపోతే సదరు డిపోల నుంచి గ్యారేజ్ సిబ్బంది వెళ్ళి మరమ్మతులు చేయాల్సి పరిస్థితులు ఉంటున్నాయని ఆర్టీసీ సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

డొక్కు బస్సుల స్థానంలో..

తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్త బస్సుల కొనుగోలు ప్రక్రియ చేపడుతోంది. ఆర్టీసీ సొంతంగా కొనుగోలు చేయటంతో పాటు అద్దె బస్సులను కూడా వినియోగించు కునేందుకు ప్రణాళికలు చేపడుతున్నారు. అంతేగాక పర్యావరణ పరిరక్షణంలో భాగంగా ఎలక్ట్రిక్ వాహనాలు కూడా అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో డొక్కు బస్సుల స్థానంలో కొత్త బస్సులు, కనీసం అద్దె బస్సులునైనా ఏర్పాటు చేయాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

ఏసీబీ వలలో.. చిలకలూరిపేట ఎంఈవో



ఎంఈఓ లక్ష్మి
జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు

- ఉపాధ్యాయుడి నుంచి రూ. 30 వేలు డిమాండ్
- రెడ్ హ్యాండెడ్ దొరికిన వైనం

చిలకలూరిపేట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలం విద్యాశాఖ అధికారి (ఎంఈఓ-1) కె లక్ష్మీ లంచం తీసుకుంటుండగా సోమవారం ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. లంచం ఇచ్చిన జూనియర్ అసిస్టెంట్ మాజేటి శ్రీనివాసరావును కూడా ఆమెతోపాటు పట్టుకున్నారు. ఇందుకు సంబంధించి గుంటూరు ఏసీబీ అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ఆర్‌వీఎస్ సీవీఎస్ హైస్కూల్లో చల్లా వెంకట శ్రీనివాసరావు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా (స్కూల్ అసిస్టెంట్) గా పనిచేసి గత జూలైలో పదవీ విరమణ చేశాడు. గత కొంత కాలంగా పెన్షన్‌తో సహా అతడికి రావాల్సిన పదవీ విరమణ ప్రయోజనాలు ఇవ్వడానికి ఎంఈఓ లక్ష్మి లంచం డిమాండ్ చేస్తూ వచ్చింది. సంబంధిత ఫైలును చిలకలూరిపేట సబ్ ట్రెజరీ కార్యాలయానికి పంపకుండా కాలయాపన చేస్తున్నది. దీంతో బాధితుడు చల్లా వెంకట శ్రీనివాసరావు ఈ విషయాన్ని ఏసీబీ అధికారులకు తెలిపాడు. తాను పనిచేసిన విద్యాసంస్థలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉన్న మాజేటి శ్రీనివాసరావు ద్వారా రు. 30 వేలు ఎంఈఓ లక్ష్మికి పంపారు.

ఎంఈఓ ఇంటి వద్దనే మాజేటి శ్రీనివాసరావు లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు మెరుపు దాడి చేసి పట్టుకున్నారు. వీరిద్దరిని ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. అధికారులు వీరిని విజయవాడ ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరు పరచనున్నారు. కాగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులను లంచం కోసం ఎవరైనా వేధించినట్లయితే జిల్లా ఏసీబీ అధికారులకు గాని, ఏసీబీ టోల్ ఫ్రీ నెంబర్ 1064కు గాని, 9440440057కు గాని తెలియపరచాలని ఏసీబీ అధికారులు కోరారు.

ఇసుక ధరకు రెక్కలు
టన్ను రూ. 1100

- వారం రోజుల్లో టన్నుకు రూ 500 పెరుగుదల
- అధికారిక ఇసుక రీచ్‌ల నిలిపివేత
- అడ్డగోలుగా కృష్ణానదిలో ఇసుక తవ్వకాలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఇసుక రీచ్‌ల్లో తవ్వకాలకు ఈ నెల ఆరో తేదీతో అనుమతులు ముగిసాయి. దీంతో అధికారిక రీచ్‌లను మైనింగ్ శాఖ మూసివేసింది. ఇదే అదనుగా అక్రమార్కులు ఇసుక దందాకు తెర లేపారు. అర్ధరాత్రులు కృష్ణా నదిలో ఇసుక తవ్వి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. దీంతో ఇసుక ధరకు రెక్కలు వచ్చాయి. టన్ను ఇసుక రూ. 1100కు విక్రయిస్తున్నారు. వారం రోజుల్లో టన్ను ఇసుకకు రూ. 500 వరకు ధర పెరిగింది. ప్రభుత్వం అమలు చేస్తున్న ఇసుక విధానానికి అక్రమార్కులు తూట్లు పొడుస్తున్నారు. పెద్ద ఎత్తున అక్రమ మైనింగ్ జరుగుతున్నా సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారు.

ఇసుక కోసం వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. మైనింగ్ శాఖ ఇసుక సరఫరా చేసే పరిస్థితి లేకపోవడంతో



వారు బ్లాక్ మార్కెట్‌పై ఆధారపడుతున్నారు. నరసరావుపేటలో సోమవారం టన్ను ఇసుక రూ. 1100కు విక్రయించారు. అధికారిక తవ్వకాలు లేకపోవడంతో, ఇసుక ధర మరింత పెరగవచ్చని తెలుస్తోంది. వారం రోజుల క్రితం టన్ను ఇసుక రూ. 550 నుంచి 600 వరకు లభించింది. అమాంతం ఇసుక ధర పెరగడంతో నిర్మాణ దారులు గుడ్లు తేలేస్తున్నారు. ముందుగా ఆర్డర్ చేస్తే చాలు చెప్పిన చోటుకు ఇసుక సరఫరా చేస్తున్నారు. అక్రమార్కులు మాత్రం ఎన్ని టన్నులు కావాలన్నా పుష్కలంగా ఇసుక సరఫరా చేస్తున్నారు. ఒక్కొక్క లారీకి 30 నుంచి 35 టన్నుల వరకు లోడ్ చేస్తున్నారు. ఇసుక ఇక్కట్ల కారణంగా నిర్మాణాలు నిలిచిపోయి కార్మికుల ఉపాధికి గండి పడుతోంది. ప్రభుత్వం వెంటనే స్పందించి, అధికారిక రీచ్‌లను ప్రారంభించి ఇసుక సరఫరా మెరుగు పరచాలని వినియోగదారులు కోరుతున్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీకి.. ముగిసిన నామినేషన్లు

- 43 మంది అభ్యర్థులు 69 నామినేషన్ల దాఖలు
- చివరి రోజున నామినేషన్ వేసిన 22 మంది
- నేడు గుంటూరు కలెక్టరేట్‌లో పరిశీలన

గుంటూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గం ద్వైపాక్షిక ఎన్నికలకు నామినేషన్ల ఘట్టం ముగిసింది. నామినేషన్ల దాఖలుకు గడవు తేదీ అయిన ఈ నెల 10 (సోమవారం) ఎక్కువ సంఖ్యలో అభ్యర్థులు గుంటూరు కలెక్టరేట్‌కు తరలివచ్చారు. అభ్యర్థులు వారి వెంట వచ్చిన మద్దతుదారులతో కలెక్టరేట్ ప్రాంగణంలో కోలాహలం నెలకొన్నది. చివరి రోజైన సోమవారం మొత్తం 22 మంది అభ్యర్థులు 43 నామినేషన్లను దాఖలు చేశారు. దీంతో ఫారం- 3 లను అప్‌లోడింగ్ చేయడానికి రాత్రి 8 గంటల వరకు పట్టింది. నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో ఈ నెల 11వ తేదీ మంగళవారం ఉదయం 11 గంటలకు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అభ్యర్థుల సమక్షంలో నామినేషన్ల పరిశీలన చేపడతారు.



నామినేషన్ వేసేందుకు ర్యాలీగా వెళుతున్న లక్ష్మణరావు

ఈ నెల 3వ తేదీన ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడగా ఆ రోజు నుంచి నామినేషన్ల స్వీకార ప్రక్రియ ప్రారంభమైంది. మొత్తంగా 40 మంది అభ్యర్థులు 69 నామినేషన్‌లను దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి గుంటూరు కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి తెలిపారు. ప్రధాన అభ్యర్థుల్లో ఒకరైన ఆలపాటి రాజేంద్రప్రసాద్ తరుపున ఆయన సతీమణి మాధవి సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. చివరి రోజున సిట్టింగ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ర్యాలీగా వచ్చి పీడీఎఫ్ ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్సీలతో కలిసి నామినేషన్ వేశారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తున్న ఉపాధ్యాయులు

కృష్ణా - గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం ఎన్నికల్లో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు యథేచ్ఛగా ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘిస్తున్నారు. వేర్వేరు ఉపాధ్యాయ సంఘాల్లో ఉన్న నాయకులు రాజకీయ పార్టీలతో అనుబంధంగా ఉంటున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉందని తెలిసి కూడా అభ్యర్థుల వెంట ర్యాలీలు, ఆత్మీయ సమావేశాలకు హాజరవుతున్నారు. కొంత మంది ఉపాధ్యాయులైతే పాఠశాలలకు సెలవులు పెట్టి మరీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. నామినేషన్ల ప్రక్రియలో తలమునకలై ఉన్న ఎన్నికల యంత్రాంగం కోడ్ అమలును పట్టించుకోవడం లేదు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుకు నోడల్ అధికారుల నేతృత్వంలో బృందాలను నియమించినా అవి సక్రమంగా పని చేయడం లేదు. అభ్యర్థుల నామినేషన్ల దాఖలును రికార్డింగ్ చేస్తున్న వీడియోలను ఒకసారి పరిశీలిస్తే అవలీలగా కోడ్ ఉల్లంఘించిన ఉపాధ్యాయులను గుర్తించొచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఎమ్మెల్సీ ఎన్నికల కారణంగా జనరల్ ఎలక్షన్స్ వలే ఎన్నికల కోడ్ అమలులో ఉన్నది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న ఏ ఉద్యోగి అయినా అభ్యర్థులకు మద్దతుగా ర్యాలీలు, ప్రచారాల్లో పాల్గొనరాదు. అయితే నిఘా లేకపోవడంతో ఉపాధ్యాయ సంఘాల నాయకులు కొందరు నామినేషన్లు, ర్యాలీల్లోనూ పాల్గొంటున్నారు.



ఆలపాటి రాజా తరపున మరో సెట్ నామినేషన్ వేస్తున్న ఆయన సతీమణి మాధవి

రేషన్ కార్డుల కోసం పాట్లు

» ఏళ్ల తరబడి నిరీక్షణ

» కూటమి ప్రభుత్వమైనా మంజూరు చేయాలని ప్రజల వేడుకోలు

చీరాలటౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : రేషన్ కార్డుల కోసం చీరాల నియోజకవర్గ పరిధిలోని సామాన్య ప్రజలు ఏళ్లుగా ఎదురు చూపులు చూస్తున్నారు. వైసీపీ అధికారంలో ఉండగా తూతూ మంత్రంగా కొంతమందికే కార్డులు మంజూరు చేసింది. 2023 జూన్‌లో వివిధ సాంకేతిక సమస్యలు, ఇతర కారణముల చేత పెద్ద సంఖ్యలోనే అర్హులకు కార్డులు మంజూరు కాక నిరాశ్రయులుగా మిగిలిపోయారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు ప్రామాణికంగా ఉండే రేషన్ కార్డు లేకపోవడంతో అప్పటి నుంచి ఎన్నో నిరుపేద కుటుంబాలు రేషన్ కార్డులకోసం పడిగాపులు పడుతున్నారు. ఈక్రమంలో ప్రస్తుతం అధికారం చేపట్టిన ప్రస్తుత ప్రభుత్వం ఈ ఏడాది జనవరిలో జన్మభూమి లేక ఇతర ప్రభుత్వ కార్యక్రమాల ద్వారా రేషన్ కార్డులు అందిస్తారని ఆశావహులు భావించారు. ఫిబ్రవరి సగం రోజులు గడిచాయి. అధికారుల నుంచి రేషన్‌కార్డులపై ఎటువంటి చర్యలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 2023 నుంచి నూతనంగా వివాహాలు జరుపుకున్నవారు, తప్పొప్పులు, మార్పులు, చేర్పు లు నూతనంగా కార్డులు పొందాల్సిన వారు ఇలా ఎంతోమంది రేషన్ కార్డు లేక తంటాలు పడుతున్నారు. అలాగే రేషన్ కార్డు లేక సీఎం రిలీఫ్ ఫండ్ కోసం అవస్థలు పడుతున్న వారు కూడా కోకొల్లలు అధికారులు, నాయకుల కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నారు. ఈక్రమంలో ప్రభుత్వం సమస్యను గుర్తించి రేషన్ కార్డులు మంజూరు చేయాలని వేడుకుంటున్నారు.



రేషన్ కార్డు



సైట్ రాగానే కార్డులు మంజూరు చేస్తాం



చాలా కాలంగా రేషన్ కార్డుల సమస్య ఉన్నది వాస్తవమే. ప్రస్తుతం నివేశన స్థలాలకు సంబంధించిన లాగిన్ అందుబాటులోకి వచ్చింది. అయితే ప్రభుత్వం రేషన్ కార్డులకు సంబంధించిన సైట్‌ను నవీకరణ చేస్తోంది. కార్డులకు సంబంధించిన అర్జీలు స్వీకరిస్తున్నాం. ఈక్రమంలో అప్‌డేట్ జరగగానే అర్హులను గుర్తించి రేషన్ కార్డులు మంజూరు చేస్తాం

- చంద్రశేఖర్‌నాయుడు, ఆర్డీవో, చీరాల రెవెన్యూ డివిజన్

ఏళ్ల తరబడి కార్డు కోసం పడిగాపులు



నాకు సుమారు ఎనిమిదేళ్ల కిందట వివాహం జరిగింది. ప్రస్తుతం ఇద్దరు పిల్లలు. నిరుపేదలం కావడంతో రోజువారీ కూలితో జీవిస్తున్నాం. అయితే రేషన్ కార్డు లేకపోవడంతో ప్రభుత్వ సంక్షేమాలు అందని ద్రాక్షగా మిగిలాయి. అత్యవసర వైద్య సేవలు పొందాలన్నా కూడా ఆరోగ్యశ్రీ లేదు. అధికారులు మా గోడు పట్టించుకుని రేషన్ కార్డు మంజూరు చేయాలి.

- శ్రావణి , తోటవారిపాలెం

కార్డు కోసం కాళ్లరిగేలా



సుమారు ఏడేళ్ల క్రితం వివాహమైంది. నాకు ఇద్దరు ఆడ పిల్లలు సంతానం. చాలా కష్టపడి రోజువారీ కూలీతో నా భర్త కుటుంబాన్ని పోషిస్తున్నారు. రేషన్ కార్డు కోసం అన్నిచోట్లకూ తిరిగాం. కార్డు మంజూరు కాలేదు. సంక్షేమ పథకాలు అందడం లేదు. అధికారులు స్పందించి రేషన్ కార్డు మంజూరు చేయాలి.

- శీలం అనూష, శృంగారపేట

మురుగు కదలదు..కంపు వదలదు



మురుగు కాలువలపై వెలసిన అక్రమ కట్టడాలు

» యథేచ్ఛగా డ్రైనేజీ కాలువల ఆక్రమణ

» వాటిపై దుకాణాల ఏర్పాటు

» దోమలతో అల్లాడుతున్న ప్రజలు

» పారిశుధ్య కార్మికులకు తప్పని అవస్థలు

పర్చూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : చిన్న జాగా కన్పిస్తే చాలు..చివరకు అది మురుగు కాలువైనా సరే ఆక్రమించేద్దాం.. ఇదీ పర్చూరులోని ఆక్రమణదారుల ఆలోచన. మురుగు కాలువను సైతం అక్రమించుకొని ఏకంగా కట్టడాలను ఏర్పరుచుకొని వ్యాపారాలు సాగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఫలితంగా కాలువల్లో మురుగు ముందుకు కదిలే పరిస్థితి లేకుండా పోతోంది. కంపు, ఆపై దోమల బెడదతో ప్రజలు నరకం చూస్తున్నారు. ప్రధాన రహదారులు, గ్రామాలకు వెళ్లే రోడ్ల వెంబడి ఉన్న కాలువలను అక్రమించుకొని వాటిపై నిర్మాణాలు చేసుకున్నారు. దీంతో పర్చూరులో డ్రైనేజీ కాలువల్లో మురుగు ముందుకు కదలడం లేదు. రోజుల తరబడి కాలువల్లో మురుగునీరు నిల్వ ఉండడంతో కంపు, దోమలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దోమలు రాత్రి, పగలు తేడా లేకుండా దాడి చేస్తున్నాయి. రాత్రిళ్లు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


కాలువలో పేరుకున్న చెత్త

పారిశుధ్య కార్మికుల అవస్థలు

నిత్యం మురుగును తొలగించేందుకు పారిశుధ్య కార్మికులు అవస్థలు పడుతున్నారు. కాలువలపై కట్టడాలను ఏర్పాటు చేయడంతో మురుగు తొలగించే వీలు లేకుండా పోతుందని అంటున్నారు. వ్యాపారులు తమ పెద్ద ఎత్తున వ్యర్థాలను కాలువల్లో పోయడంతో సమస్య తీవ్రంగా మారుతోంది.

అధ్వానంగా కాలువలు

డ్రైనేజీ కాలువల పరిస్థితి అధ్వానంగా ఉంది. దీంతోపాటు పెద్ద ఎత్తున ప్లాస్టిక్ వ్యర్థాలను కాలువల్లో పడేస్తున్నారు. దీంతో మురుగు కదిలే పరిస్థితి లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దీనిపై దృష్టిసారించి మురుగు కాలువలపై ఉన్న ఆక్రమణను తొలగించడంతోపాటు కాలువల్లో మురుగు పారేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. అలాగే ప్రజలు కూడా చెత్తాచెదారాలను కాలువల్లో వేయకుండా చూడాలి.

ధర్మసత్రం... ఏదీ లెక్కాపత్రం

(5వ పేజీ తరువాయి)

ఆస్తులన్నట్టు ఇష్టానుసారం భవనాలు కట్టేసి అమ్మేసుకుంటున్న పరిస్థితీ లేకపోలేదు. కొన్ని సత్రాల్లో మాత్రమే దాతల లక్ష్యానికి విలువనిచ్చి అన్నదానం చేస్తూ వారి ఆశయాన్ని కాపాడుతుంటే, 80 శాతం సత్రాలు ట్రస్టీల ఇష్టారాజ్యమైపోయాయి. దీంతో దాతల సొమ్ము, ఆస్తులు స్వార్థపరుల పాలవుతున్నాయి. అందరికోసం ఉపయోగించల్సిన ఆస్తుల్ని కొందరి కోసం.. అదికూడా సొంతానికి వాడేసుకుంటుంటే, దేవాదాయ శాఖ మాత్రం కళ్లప్పగించి చూస్తోంది.

తెనాలి, గుంటూరు, మంగళగిరి, తాడేపల్లి, పొన్నూరు వంటి పట్టణాలే కాకుండా, గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. బాపట్ల, గుంటూరు జిల్లాలకంటే ఎక్కువ సత్రాలు, ఎక్కువ భూములు ఉన్నది పల్నాడు జిల్లాలోనే. నరసరావుపేట, సత్తెనపల్లి, చిలకలూరిపేట, మాచర్ల, పిడుగురాళ్ల వంటి చాలా పట్టణాల్లో అన్నదాన సత్రాల ఆస్తులు పరాధీనమయిపోతున్నాయి. బాపట్ల జిల్లాలోనూ రేపల్లె, చెరుకుపల్లి, కొల్లూరు, భట్టిప్రోలు, చందోలు, బాపట్ల వంటి చోటకూడా ఆస్థులకు రక్షణ లేని పరిస్థితి. అమరావతికి చెందిన సదావర్తి సత్రం భూములకు సంబంధించి గతంలో జరిగిన వివాదమే వీటికి ఉదాహరణ. ఈ సత్రం 1885లో నిర్మితమయితే, దీనికి సంబంధించి చెన్నై దగ్గర ఉన్న 471 ఎకరాల భూమి దీనికింద ఆస్తిగా దాత వాసిరెడ్డి వంశస్తురాలు వెంకటలక్ష్మమ్మ 1907లోనే రాసిచ్చిన విషయం తెలిసిందే. అయితే దేవాదాయ శాఖ దీనిని పట్టించుకోకపోవటంతో మొత్తం భూములు అన్యాక్రాంతమై, చివరకు 83 ఎకరాలు మాత్రమే మిగిలాయి. దీనిని మన ప్రభుత్వం అమ్మటానికి కూడా సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సిన పరిస్థితి తీసుకొచ్చారు. ఇదే తరహాలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో భారీగా ఆస్థులున్న సత్రాల ఆస్తుల పరిరక్షణ గాలిలో దీపంలా వదిలేశారు. దీంతో దాతల ఆశయం పక్కదారి పడుతోంది. కొందరి చేతుల్లోకే మొత్తం ఆస్తులు చేరిపోతున్నాయి.

ఒక్క తెనాలినే ఉదాహరణగా తీసుకుంటే...

తెనాలి పట్టణం, చుట్టుపక్కల గ్రామాల్లో అయితే భర్తిపూడి రామయ్య పంతులు అన్నపూర్ణ ధర్మసత్రం, ఘంటా హనుమయ్య చారిటీస్, చుండూరువారి ధర్మసత్రం, యడ్లపల్లి కోటిలింగం ధర్మసత్రం, ఓంకారాశ్రమం, కుసుమ మరనాద నిత్య అన్నదాన శాంతి ఆశ్రమం, కాకుమాను రామస్వామి శాంతి భవనం. కాకుమాను వెంకటసుబ్బన్న ధర్మసత్రం, శ్రీ రఘోత్తమరామశాస్త్రిగారి ధర్మ సత్రం, పోలేపెద్ది ఆదెమ్మ వేదపాఠశాల, కాకుమాను శంకరుని ధర్మసత్రం వంటి పదుల సంఖ్యలోనే సత్రాలున్నాయి. వీటిలో చాలావరకు తెనాలి పట్టణ నడిబొడ్డున ఉన్నవ అయితే, మరికొన్ని మంచి డిమాండ్ ఉన్న ప్రాంతాల్లోనూ ఉన్నాయి. తెనాలి బోస్ రోడ్, బుర్రిపాలెం రోడ్, రైల్వే స్టేషన్ ఎదుట అత్యంత ఖరీదయిన ప్రాంతాల్లో ఉండటంతో వీటిపై ట్రస్టీల కుటుంబీకులకు ఆశ పెరిగిపోయింది. దీంతో దాతృత్వం చూపాల్సిన స్థానంలో తమకు అనుకూలమైన వ్యాపార స్థావరాలను ఏర్పాటు చేసుకున్నారు. అయితే వీటిని నిర్మించిన ప్రదేశాలు ఇప్పుడు అత్యంత విలువైన ప్రదేశాలయితే, ఇవికాక వీటిపేరిట ఉన్న పొలాలు, ఇతర దుకాణ సముదాయాల వంటి ఆస్తులు కూడా ట్రస్టీల పెత్తనంలో పూర్తిగా మారిపోతున్నాయి. పెద్ద సత్రాలకు దేవాదాయ శాఖ ప్రత్యేక అధికారులను పర్యవేక్షణకు నియమించినా అక్కడ జరిగే కార్యక్రమాలు ఏమీ లేకపోవటంతో వారు వీటిని పట్టించుకోవటం, అసలు సంవత్సరానికొకసారికూడా వాటివైపు కన్నెత్తి చూడకపోవటంతో అన్యాక్రాంతమయిపోతున్న పరిస్థితి. వస్తున్న ఆదాయానికి ఒక లెక్కాలేదు... ఆస్తులకు రక్షణా లేదన్నట్టు తయారయింది.

అన్న'దానం' కాగితాల్లోనే...

ప్రతి సత్రంలోనూ అన్నదానం చేయటం, వసతి అవకాశం ఉన్నా భవనాల్లో గదులు అద్దెలకివ్వటం వంటివిచేసి, దేవాదాయ శాఖకు ఆదాయాన్ని జమచెయ్యాలి. ఇక్కడ అన్నీ కాగితాల్లోనే ఉంటుంటే, ఆదాయం మాత్రం ట్రస్టీల చేతుల్లోకి వెళ్లిపోతోంది. ప్రతి అన్నదాన సత్రంలోనూ ఐదు నుంచి 25 మంది వరకు రోజూ అన్నదానం చేయటం, ఆయా దాతల జయంతి, వర్ధంతి సందర్భాల్లో పేదలకు ప్రత్యేక పంపిణీలు చేయటం పరిపాటి. భర్తిపూడి రామయ్య పంతులు అన్నపూర్ణ ధర్మసత్రం కింద 13.9 ఎకరాల భూమి, 7 సెంట్లలో సత్రం ఉంది. వీటిపై ఆదాయమే భారీగా వస్తుంది. సత్రం ఉన్న స్థలం బుర్రిపాలెం రోడ్డులో ఉంటే, దీనికి మంచి డిమాండే ఉంది. అయితే దీనిలో భవనం శిధిల స్థితికి చేరితే, ఆరుబయట ఉన్న ఖాళీ స్థలాన్ని బీరువాలు తయారుచేసే వారికి అద్దెకిచ్చారు. వీటి లెక్కలు దేవాదాయ శాఖకు చేరవు. ప్రతి ద్వాదశికి 29 మందికి అన్నదానం, చైత్ర బహుళ పాడ్యమి రోజున పేదలకు విశేష సంఖ్యలో అన్నదానం చెయ్యాలనేది దాతలు ఆలచన. ఇక్కడ దశాబ్దకాలంగా అన్నదానమనే మాటే లేకుండాపోయింది. వచ్చిన ఆదాయం ఎటు పోతుందో! ఖాతాలో ఎంత జమవుతుందో ఆ దేవుడికే ఎరుక. సత్రంలో ఎంతమందికి అన్నదానం చెయ్యాలనేది గోడపై ట్రస్టీపేరుతో గతంలోనే రాసిఉంటే, దానిలో సంఖ్య, ఇతర వివరాలు చెరిపేసి ఉంచటం మరో ప్రత్యేకం.

అంబడిపూడిలో లేగ దూడల ప్రదర్శన పోటీలు

బల్లికురవ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంబడిపూడి గ్రా మంలో సోమవారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సోమవారం మేలు జాతి లేగ దూడల ప్రదర్శన పోటీలు జరిగాయి. ఈసందర్భంగా పశు వైద్యశాలకు పలు గ్రామాల నుంచి 38 మంది రైతులు 56 లేగ దూడలను ప్రదర్శనకు తీసుకొచ్చారు. ఈసందర్భంగా ఆంధ్రప్రదేశ్ పశు గణాభివృద్ధి శాఖ సీఈవో డాక్టర్ శ్రీనివాసరావు లేగ దూడల ప్రదర్శను ప్రారంబించారు. అనంతరం ముగ్గురు రైతులను లేగ దూడలు బాగా పెంచుతున్నట్లు గుర్తించి పోషకులకు బహుమతులను అందజేశారు. దూడల కోసం పౌష్టికాహార ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో లేగ దూడల మరణాలు ఏటా ఒక సీజన్‌లో ఉంటున్నాయని దానిని నిరోధించేందుకు గ్రామాలలో రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టి వారికి సలహాలు సూచనలు చేసేందుకు దూడల ప్రదర్శన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. రైతులు పాడి పరిశ్రమ వృద్ధిలోకి వచ్చేలా పశు సంవర్ధక శాఖకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఈవో డీఎల్‌డీఏ చంద్రశేఖర్, డీడీ రమేష్ బాబు, బాపట్ల డీఏహెచ్‌వో వేణుగోపాల్, డీఎల్‌డీఏ ఉష, వైద్యాధికారులు మహేశ్వరరావు, పావనీకుమారి, పశు పోషకులు, సిబ్బంది పాల్గొన్నారు.


లేగ దూడలను పోషిస్తున్న రైతులకు బహుమతులను అందజేస్తున్న పశు సంవర్ధక శాఖ రాష్ట్ర సీఈవో శ్రీనివాసరావు

పేదలకు ఆసరా సీఎం సహాయనిధి

ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ అనారోగ్యంతో బాధపడు తున్న పేద కుటుంబాలకు సీఎం సహాయనిధి ఎంతో ఆసరాగా నిలుస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో సోమవారం రూ.13.81లక్షల చెక్కులను 8 మంది లబ్ధిదారులకు అందజేశారు. ఈసందర్భం గా ఆయన మాట్లాడుతూ చాలామంది పేద కుటుం బాలవారు అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం చేయిం చుకునే స్థోమత లేక ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. నియోజకవర్గంలో ఎంతోమంది పేద కుటుంబాలకు టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం సహాయనిధి కింద ఆర్థిక సహాయం అందించినట్లు చెప్పారు. కనిగిరి మండలానికి చెందిన తమ్మినేని చిరంజీవిరెడ్డికి రూ. 1.09లక్షలు, మన్నెం వెంకటసుబ్బయ్యకు రూ.80వేలు, పామూరు మండలానికి చెందిన నాగేశ్వరరావుకు రూ.8 లక్షలు, చావా కమలమ్మకు రూ.1.5లక్షలు, కేశవులుకు రూ.32 వేలు, హెచ్‌ఎంపాడు మండలానికి చెందిన మొండెద్దు కొండారెడ్డి కి రూ.32 వేలు, కాసు నిర్మలకు రూ.1.13లక్షలు, వెలిగండ్ల మండలానికి చెందిన అనమలగుర్తి ఓబయ్యకు రూ1.9లక్షలు సీఎం సహాయనిధి కింద ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి చెక్కులను పంపిణీ చేశారు.

విద్యార్థులకు మరింత అందుబాటులో విద్య

అద్దంకి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల పునరుద్ధరీకరణతో విద్యార్థులకు విద్య మరింత అందుబాటులో ఉండే విధంగా ప్రతిపాదనలు చేయాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులకు సూచించారు. పాఠశాలల పునరుద్ధరీకరణకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న నేపథ్యంలో అద్దంకి నియోజకవర్గంలోని ఎంఈవోలు, తహసీల్దార్‌లు, ఎంపీడీవోలతో సోమవారం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన 117జీవోతో 3,4,5 తరగతులు హైస్కూల్స్‌లో విలీనం చేసిన నేపథ్యంలో వాటిని రద్దు చేస్తూ పునరుద్ధరీకరణకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. ఈ నేపథ్యంలో కొత్తగా మోడల్ స్కూల్స్ అందుబాటులోకి రానున్నాయి. అదే సమయంలో పలు యూపీ పాఠశాలలు హైస్కూల్స్‌గా అప్ గ్రేడ్ కావడం, మరికొన్ని యూపీ పాఠశాలలను మోడల్ స్కూల్స్‌గా మార్చనున్న నేపథ్యంలో తలెత్తే సమస్యలను ఈ సందర్భంగా అధికారులతో మంత్రి చర్చించారు. ఎట్టి పరిస్థితులలో విద్యకు పిల్లలు దూరం కాకుండా ఉండే విధంగా పాఠశాలల పునరుద్ధరీకరణ చేయాలని సూచించినట్లు సమాచారం. నియోజకవర్గంలో హైస్కూల్స్‌గా అప్ గ్రేడ్ చేసేందుకు అవకాశం ఉన్న యూపీ పాఠశాలలు, మోడల్ స్కూల్స్‌గా డీగ్రేడ్ అయ్యే యూపీ పాఠశాలలు, యథావిధిగా యూపీ పాఠశాలలుగా కొనసాగింపునకు అవకాశం ఉన్న యూపీ పాఠశాలల వివరాలను మంత్రి రవికుమార్‌కు అధికారులు వివరించినట్లు తెలుస్తుంది.

అమ్మ ఆశ్రమ అధ్యక్షునికి సత్కారం

మార్టూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : అమ్మ ఆశ్రమం అధ్యక్షుడు గుంటుపల్లి చందు సేవలను గుర్తించి హైదరాబాద్‌లోని మోర్తు సంస్థ అధ్యక్షుడు శ్రీనివాస్ నంది అవార్డుతో సత్కరించారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం హైదరాబాద్ ఎన్టీఆర్ ఆడిటోరియంలో ఆదివారం రాత్రి జరిగిన మోర్తు ఫౌండేషన్ 28వ వార్షికోత్సవం, ఇంటర్నేషనల్ ఫిలిం అవార్డ్ వేడుకలో చందును నంది అవార్డుతో సత్కరించారు.

ద్విచక్రవాహనం ఢీకొని మహిళకు గాయాలు

వేటపాలెం (చీరాలటౌన్), ద్విచక్ర వాహనం ఢీకొనడంతో మహిళ పరిస్థితి విషమంగా మారింది. వివరాల్లోకి వెళితే.. వేటపాలెం రైల్వే స్టేషన్ సమీపానికి చెందిన వెంకటరత్నం ఇక్కడ బడ్డీ కొట్టు నడుపుతూ జీవిస్తోంది. ఈ క్రమంలో కొట్టుకు అవసరమైన సరుకులు తీసుకెళ్తుండగా వేంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో వెనుక నుంచి వస్తున్న ద్విచక్రవాహనం ఆమె బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంతో ఆమెకు తీవ్ర గాయాలై పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారు.

బొబ్బేపల్లి కొండ ఎవరిది?

» అటవీశాఖదా, రెవెన్యూదా

» తనిఖీ చేసిన అధికారులు

మార్టూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ వెంకటమురళి ఆదేశాలు మేరకు మార్టూరు మండలంలోని బొబ్బేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రావెల్ కొండపై సోమవారం రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేశారు. గ్రావెల్ కొండ భూమి తమకు చెందినదని రెవెన్యూ అధికారులు, ఈ కొండ ఫారెస్ట్ భూమి అని అటవీ శాఖ అధికారులు ఉమ్మడిగా కొండ ప్రాంతానికి చెందిన రికార్డులతో క్షుణ్నంగా పరిశీలించారు. రెవెన్యూ తరపున వచ్చిన జిల్లా అధికారి ఆర్‌డీవో గ్లోరియా, తతతత సర్వే కనకప్రసాద్, సర్వే ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, తహసీల్దార్ టీ ప్రశాంతి కొండ భూమి వద్దకురాగా,ఫారెస్ట్ శాఖ తరపున డీఎఫ్‌వో భీమయ్య, చీరాల ఫారెస్ట్ రేంజి ఆఫీసర్ వీవీ రమణారావు, వేటపాలెం సెక్షన్ ఆఫీసర్ ఎం.వెంకటేశ్వరరావు, కూకట్లపల్లి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రమేష్ బాబు వచ్చారు. వారందరూ కొండ వద్ద భూమిని రికార్డులను బయటపెట్టారు. అదేవిధంగా కొండ చుట్టూ ఉన్న కొండకు చెందిన భూమిని కూడా పరిశీలించడంతోపాటు,


బొబ్బేపల్లి గ్రావెల్ కొండ (ఫైల్)


బొబ్బేపల్లి గ్రావెల్ కొండపై జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేస్తున్న ఆర్డీవో గ్లోరియా, డీఎఫ్‌వో భీమయ్య తదితర అధికారులు

బొబ్బేపల్లి గ్రావెల్ కొండ కథ ఇదీ

మార్టూరు మండలంలో బొబ్బేపల్లి గ్రామ పంచాయతీ 387-సీ 11 సర్వేనంబరులో 358 ఎకరాలు గ్రావెల్ కొండ ఉంది. ఈ కొండ భూమిలో 122 ఎకరాలను గతంలో కొంతమందికి ప్రభుత్వం పట్టాలు ఇవ్వడం జరిగింది. అంతేగాకుండా కొండపైన ఉన్న గ్రావెల్‌ను తవ్వకొని అమ్ముకోవడానికి రెవెన్యూ వారు 10 మందికి ఎన్‌వోసీలు కూడా ఇచ్చారు. ఇంక కొండ భూమి సుమారు 100 ఎకరాలకు పైగానే ఉంది. దానికితోడు గ్రావెల్‌కు విపరీతమైన డిమాండ్ పెరగడంతో గత వైసీపీ ప్రభుత్వంలో కొంతమంది వైసీపీ నేతలు ఈ కొండ గ్రావెల్‌పై కన్నేశారు. అప్పటి వైసీపీ నేతలు అండతో రెవెన్యూ అధికారుల సహకారంతో కొంతమంది వైసీపీ మద్దతుదారులు భారీగా కొండమట్టిని తవ్వకొని అమ్ముకొని లక్షలాది రూపాయలు సంపాదించారు.గత కొన్నేళ్లుగా గ్రావెల్ కొండ అక్రమార్కులకు ఆదాయం సంపాదించే వనరు గా ఏర్పడింది. అయితే 2024లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత 6 నెలలు కిందట గ్రావెల్ కొండ భూమి ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌కు చెందినదని ఫారెస్ట్ అధికారులు రంగ ప్రవేశం చేశారు. దాదాపుగా గత కొన్నేళ్లుగా రెవెన్యూ వారి ఆధీనంలో ఉన్న గ్రావెల్ కొండ అటవీ భూములు పరిధిలోకి వస్తాయని, ఈ కొండలో తవ్వకాలు జరగడానికి అవకాశం లేదని ఫారెస్ట్ అధికారులు అక్రమార్కులకు అడ్డుకట్ట వేశారు. వాస్తవంగా 1894లో మద్రాసు ఫారెస్ట్ యాక్టులో బొబ్బేపల్లి గ్రావెల్ కొండ రిజర్వ్ ఫారెస్ట్ భూమిగా ఉందని, ఈ నేపథ్యంలోనే 2024లో కొండ భూమిని ఫారెస్ట్ అధికారులు అటవీ భూములుగా గుర్తించారు.

1906లో కొండ పోరంబోకుగా ఆర్‌ఎస్‌ఆర్‌లో నమోదు

బొబ్బేపల్లి గ్రావెల్ కొండ భూమి 1906లోనే కొండ పోరంబోకుగా (కొండ) రెవెన్యూ భూమిగా రీసర్వే రిజిస్టర్‌లో నమోదు అయి ఉంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన అధికారులు కొండ భూమిపై జిల్లా రెవెన్యూ అధికారులకు ఎలాంటి దరఖాస్తు చేయలేదు. ఈ జాయింట్ ఇన్‌స్పెక్షన్ నివేదికను కలెక్టర్‌కు పంపిస్తాం

- గ్లోరియా, ఆర్డీవో, బాపట్ల

ఉన్నత అధికారులకు పంపిస్తాం

మద్రాసు ఫారెస్ట్ యాక్టు ప్రకారం 1894లోనే బొబ్బేపల్లి కొండ రిజర్వ్ ఫారెస్ట్‌గా ఉంది. తర్వాత 1906లో రెవెన్యూ వారి ఆర్‌ఎస్‌ఆర్‌లో నమోదు చేశారని రెవెన్యూ అధికారులు అంటున్నారు. ఈ విషయంపై నివేదికను కలెక్టర్ నుంచి తీసుకొని ఉన్నత అధికారులకు పంపిస్తాం.

- భీమయ్య
అటవీ శాఖ అధికారి

హుండీల కానుకల ఆదాయం రూ.28.86లక్షలు

అద్దంకి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలోని హుండీల కానుకలను ఈవో తిమ్మానాయుడు, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో సోమవారం లెక్కించారు. మూడు నెలలకు గాను హుండీల ద్వారా మొత్తం 28,86,078 రూపాయలు రాగా, అందులో జనరల్ హుండీల ద్వారా 27,94,895 రూపాయలు, అన్నదానానికి సంబంధించిన హుండీల ద్వారా రూ.91,183 వచ్చాయి. హుండీల కానుకల లెక్కింపును అధికారులు తిమ్మానాయుడు, వెంకటేశ్వరరావు పర్యవేక్షించగా, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌లో అర్జీల స్వీకరణ

పంగులూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : పంగులూరు రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో తహసీల్దార్ పి.సింగారావు ప్రజా సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ఇంటి స్థల వివాద పరిష్కారం కోరుతూ 1, పట్టాదారు పాస్ పుస్తకాలు కోరుతూ 2, పొలం కొలతలు కోసం 2, డిజిటల్ సంతకం కోరుతూ 2 అర్జీలు స్వీకరించినట్లు తహసీల్దార్ సింగారావు తెలిపారు.

వెంచర్‌లకు గ్రావెల్ ఫుల్ అంతర్గత రోడ్లకు నిల్

» పలు కాలనీ ప్రజలకు తప్పని అవస్థలు

అద్దంకి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలో పలు కాలనీల్లో కనీసం ఏళ్ల తరబడి కనీసం గ్రావెల్ రోడ్లు నిర్మాణం కూడా చేయకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. గ్రావెల్ రోడ్ల నిర్మాణానికి అందుబాటులో గ్రావెల్ లేదని అధికారులు దాటవేసే ధోరణితో వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. అదే సమయంలో అద్దంకి పట్టణం సమీపంలో కొత్తగా వేస్తున్న వెంచర్లకు మాత్రం పెద్ద ఎత్తున గ్రావెల్ తోలి రోడ్లను నిర్మిస్తున్నారు. ఇది చూసిన ప్రజలు అధికారులు గ్రావెల్ అందుబాటులో లేదని చెప్తుంటే, ప్రైవేటు వెంచర్‌లకు ఎలా గ్రావెల్ తోలుతున్నారని విమర్శిస్తున్నారు. పట్టణంలో దశాబ్ద కాలంలో పలు కాలనీలు ఏర్పడ్డాయి. కొన్ని చోట్ల సీసీ రోడ్లు వేయగా, మరికొన్ని చోట్ల కనీసం గ్రావెల్ రోడ్లు కూడా ఏర్పాటు చేయలేదు. ప్రధానంగా మౌలానగర్, గరటయ్య కాలనీ, శివసాయినగర్, నాగులపాడు రోడ్డులోని పలు వీధులలో కనీసం గ్రావెల్ రోడ్లు లేక, సైడ్ డ్రైన్‌లు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సైడ్ డ్రైన్‌లు లేకపోవడంతో ఇళ్లలో నుంచి బయటకు వచ్చే మురుగు రోడ్లపై ప్రవహిస్తూ రాకపోకలకు కూడా ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గత వైసీపీ పాలనలో రోడ్ల నిర్మాణంపై దృష్టి పెట్టకపోవడంతో మరింత ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి 8 నెలలైనా కనీసం గ్రావెల్ రోడ్ల నిర్మాణం, సైడ్ డ్రైన్‌ల నిర్మాణం చేయకపోవడం పట్ల విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి సైడ్ డ్రైన్‌లు, కనీసం గ్రావెల్ రోడ్ల నిర్మాణం అయినా చేపట్టాలని ఆయా కాలనీ ప్రజలు కోరుతున్నారు.


అద్దంకిలో వెంచర్‌లకు తోలుతున్న గ్రావెల్


1వ వార్డు మౌలానగర్‌లో డ్రైన్ లేక రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు


గ్రావెల్ వేయని రోడ్డు


ప్రధాని మోదీ సూచనలను వింటున్న విద్యార్థులు

పది పరీక్షలకు ప్రధాని మోదీ చిట్కాలు

ప్యానల్స్ ద్వారా వీక్షించిన విద్యార్థులు

చీరాలటౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : 10, 12వ తరగతి పరీక్షల్లో ఒత్తిడికి లోనవకుండా మంచి మార్కులు సాధించాలని ప్రధాని మోదీ విద్యార్థులకు సూచించారు. దేశ వ్యాప్తంగా జరిగిన పరీక్షా పే చర్చ కార్యక్రమం సోమవారం స్థానిక ఎన్‌ఆర్‌అండ్‌పీఎం హైస్కూల్లో ప్యానల్స్ ద్వారా ఉపాధ్యాయులు నిర్వహించారు. ఈసందర్భంగా మోదీ మనం రోబోలం కాదని, టెన్షన్ వాతావరణం దరి చేరకుండా పరీక్షలకు హాజరయ్యేలా మనల్ని మనం సంసిద్ధం చేసుకోవాలని తెలిపారు. ఈక్రమంలో మోదీ స్పీచ్‌ను విద్యార్థులు ఆసక్తికరంగా తిలకించారు. కార్యక్రమాన్ని సైన్స్ ఉపాధ్యాయుడు పవని భానుచంద్రమూర్తి పర్యవేక్షించారు.

పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలి


ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చీరాలటౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ పరిధిలోని నిరుపేదలకు నివేశన స్థలాలను ప్రభుత్వం మంజూరు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మూడు నెలల కిందటే అర్జీలు అందజేసిన వాటిపై దృష్టిసారిండంలో నిర్లక్ష్యం జరిగినట్లు ఆరోపించారు. ఇప్పటికే సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బత్తుల శామ్యేల్, చిరుమల ప్రకాష్, ఏఐటీయూసీ నాయకులు అచ్యుతుని బాబురావు, బాసి సైదయ్య, రాజశేఖర్, వీరాంజనేయులు, దేవతోటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పెరిగిన ఎలక్ట్రికల్ వాహనాల ప్రాముఖ్యత


మాట్లాడుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ కిరణ్‌కుమార్

చీరాలటౌన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : నేటి ఆధునిక రంగంలో ఎలక్ట్రికల్, చార్జింగ్ వాహనాల ప్రాముఖ్యత సంతరించుకుందని సెయింట్ ఆన్స్‌కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు పేర్కొన్నారు. సోమవారం కళాశాలలో మల్టీ లెవల్ ఇన్వర్టర్స్‌కు సంబంధించి గెస్ట్ లెక్చరర్ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా అమరావతి ఎస్ఆర్ఎం యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.కిరణ్‌కుమార్ హాజరై ఈఈఈ విభాగానికి గెస్ట్ లెక్చరర్ కార్యక్రమం నిర్వహిచినట్లు ప్రిన్సిపాల్ డా.కె.జగదీష్ తెలిపారు. విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

తల్లి, భార్య వివాదంతో సివిల్ ఇంజనీర్ ఆత్మహత్య



వేటపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : తల్లీ, భార్య మధ్య నెలకొన్న వివాదంలో ఎటూ తేల్చకోలేక సివిల్ ఇంజనీర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈఘటన సోమవారం తెల్లవారు జామున వేటపాలెం మండల పరిధిలోని ముస్లిం నగర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం షేక్ అమీర్ బాషా (32)కు రెండేళ్ల కిందట అదేప్రాంతానికి చెందిన సామియాతో వివాహమైంది. ప్రస్తుతం వీరికి ఏడాది బాబు సంతానం. అయితే భార్యను తల్లిదండ్రుల వద్దే ఉంచి బాషా బెంగళూరులో సివిల్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. ఇదిలావుండగా కొద్ది రోజులుగా తల్లి షాజీరాతో భార్యకు గొడవ జరిగింది. దీంతో వారం కిందట ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. ఈక్రమంలోనే బాషా స్వగ్రామానికి ఆదివారం వచ్చాడు. ప్రస్తుతం వ్యవహారం పెద్దల సమక్షంలో పంచాయితీ జరుగుతోంది. తల్లి, భార్య గొడవల మధ్య నలిగిపోయిన బాషా ఇంట్లోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయాన్ని గ్రహించిన కుటుంబ సభ్యులు హుటాహుటీన చీరాల ఏరియా వైద్యశాలకు, అక్కడి నుంచి గుంటూరు తరలిస్తుండగా మృతి చెందాడు. వేటపాలెం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎల్ఐసీ కార్యాలయం మార్పు

అద్దంకి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం రోడ్డులో గత 3 దశాబ్దాలుగా నిర్వహిస్తున్న ఎల్ఐసీ కార్యాలయాన్ని బంగ్లా రోడ్డులోకి మార్పు చేసినట్లు సీనియర్ బ్రాంచి మేనేజర్ మాధవకృష్ణ తెలిపారు. బంగ్లా రోడ్డులో ఎల్ఐసీ కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ బ్రాంచి మేనేజర్ ఖాదర్‌మస్తాన్, తోటకూర సత్యనారాయణ, డీవీఎం సత్యనారాయణ, అమరనాథ్, వేణుగోపాలరావు, పద్మజ, శ్రీవల్లి, అరుణ్‌కుమార్, రాజశేఖరరెడ్డి, హరీష్, నరశింహరావు, దాసరి వెంకటసుబ్బారావు, మన్నం త్రిమూర్తులు,కోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్‌లో గ్రానైట్ పరిశ్రమల యజమానులకు సభ్యత్వం

మార్టూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : మార్టూరులోని గ్రానైట్ పరిశ్రమల యజమానులు 10 మంది ఇండియన్ రెడ్‌క్రాస్ సభ్యత్వం తీసుకున్నారు. ఈ మేరకు సోమవారం వారు మార్టూరులోని మండల తహసీల్దారు కార్యాలయంలో ఒక్కొక్కరు సభ్యత్వ నమోదు రూ.25 వేల చెల్లించి, ఆర్డీవో గ్లోరియా, తహసీల్దార్ టీ ప్రశాంతి చేతుల మీదగా రశీదులను అందుకున్నారు. కార్యక్రమంలో కామినేని జనార్దన్, తాటి నాగేశ్వరరావు, చెరుకూరి అంజిబాబు, కొర్రపాటి వేణుబాబు, ఆదర్శరైతు పెంట్యాల శరత్ పాల్గొన్నారు.


ఆర్డీవో గ్లోరియా సమక్షంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యత్వాన్ని తీసుకుంటున్న గ్రానైట్ యజమానులు


ప్రత్యేక అలంకరణలో నగరేశ్వరస్వామి వింధ్యావాసిని అమ్మవారు

నగరేశ్వరస్వామి సప్తమ కల్యాణోత్సవాలు

అద్దంకి, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలోని నగరేశ్వరస్వామి(వేయి స్తంభాల గుడి)లో వింధ్యావాసిని సమేత నగరేశ్వరస్వామి సప్తమ కల్యాణ ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. సోమవారం గణపతి పూజ, పుణ్యాహవాచనము, కలశస్థాపన, ధ్వజారోహణం తదితర పూజా కార్యక్రమాలను పూజారి శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. మంగళవారం ఉదయం 9 గంటలకు చండీహోమం, రుద్ర హోమం జరగనున్నాయి. 12వ తేదీ బుధవారం ఉదయం 9గంటలకు శివ పార్వతుల కల్యాణం జరగనుంది. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ ఉంటుందని ఆలయ కమిటీ వారు తెలిపారు.

వైభవంగా అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం

చినగంజాం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) : సోపిరాల గ్రామంలోని లలితా పరమేశ్వరి సమేత రామకోటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలోని హరిహరసుత అయ్యప్పస్వామి ఆలయ ఆరువ వార్షికోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ పూజారి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 7గంటలకు హోమం, 9గంటలకు అభిషేకాల కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయంలోని స్వామివారిని విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు జరిపారు. గురుస్వాములు స్వామికి పడిపూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం నైవేద్యం, హారతి ఇచ్చారు. భక్తులు అయ్యప్పస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం జరిగింది. మహిళ కోలాటం భక్తులను ఆకట్టుకుంది. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వ్యాసరచన, వక్తృత్వంలో విద్యార్థుల సత్తా


ప్రతిభ చాటిన కొండమంజులూరు ఉన్నత పాఠశాల విద్యార్థులో హెచ్‌ఎం అనిత, ఉపాధ్యాయులు

పంగులూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ర్యాడికల్ హ్యూమనిస్ట్ సెంటర్ ఇంకొల్లు వారు మూడు జిల్లాల స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వపు పోటీలలో కొండమంజులూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. పల్నాడు, ప్రకాశం, బాపట్ల జిల్లాల పరిధిలో జరిగిన ఈ పోటీలలో సీనియర్ విభాగంలో వ్యాసరచన పోటీలో పవన్‌గోపీకృష్ణ, వక్తృత్వపు పోటీలో జాకబ్ జపానియా శాస్త్రి ప్రథమ, జాన్‌బాబు ద్వితీయ స్థానంలో నిలిచారు. జూనియర్ విభాగంలో వ్యాసరచన పోటీలో పాఠశాల విద్యార్థి సంజన, వక్తృత్వపు పోటీలో రిత్విక్ ప్రథమ స్థానం సాధించారు. ఈ నెల 9వ తేదీ సాయంత్రం ఇంకొల్లులో జరిగిన ర్యాడికల్ హ్యూమనిస్ట్ సెంటర్ వార్షికోత్సవ సభలో బహుమతులు అందుకున్నారు. విజేతలైన పాఠశాల విద్యార్థులను సోమవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ గోలి సంధ్యారాణి, చింతల సహదేవుడు, బొప్పూడి నాగేశ్వరరావు, నరశింహరావు, హెచ్‌ఎం అనిత, ఉపాధ్యాయులు అభినందించారు.

కోళ్లఫాంను పరిశీలించిన పశు వైద్యాధికారి

మార్టూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోలలపూడి గ్రామంలో తేలప్రోలు నరేష్‌కు చెందిన కోళ్లఫాంను పశు వైద్యాధికారి మాధవీలత పరిశీలించారు. కోళ్ల పెంపకంలో తీసుకోవలసిన జాగ్రత్తలను ఆమె వివరించారు. అదేవిధంగా కోళ్ల ఫాంల వద్ద తీసుకోవలసిన చర్యలను తెలియజేశారు.

వైభవంగా సీతారామాలయ ప్రతిష్ఠోత్సవం

» వేలాది మంది భక్తులతో కిటకిట

» అంబడిపూడిలో సందడి

బల్లికురవ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద అంబడిపూడి గ్రామంలో సోమవారం సీతారామాలయం ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరిగింది. పరిసర గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొనడంతో అంబడిపూడి గ్రామం కిటకిట లాడింది. ఏడు దశాబ్దాల నుంచి ఉన్న సీతారామాలయం జీర్ణావస్థకు చేరడంతో గ్రామస్థులు సమష్టి కృషితో విరాళాలు సేకరించి నూతన దేవాలయాన్ని తిరిగి నిర్మాణం చేపట్టి గత మూడు రోజుల నుంచి ప్రత్యేక పూజల అనంతరం సీతారాములు, లక్షణుడు, అంజనేయస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. గ్రామ పూజారి గుడిమెళ్ల పవన్ శాస్త్రి ఆధ్వర్యంలో వేద పండితులు మంత్రోచ్ఛరణతో ప్రతిష్ఠ నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. గ్రామంలోని ప్రజలు తమ బంధు మిత్రులను ప్రతిష్ఠకు అహ్వానించడంతో పెద్దఎత్తున ప్రజలు కార్యక్రమానికి హాజరయ్యారు. రోడ్లన్నీ భక్తుల రాకతో స్తంభించాయి. ప్రతిష్ఠ అనంతరం దేవతామూర్తుల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. దేవాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠ సందర్భంగా పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


ధ్వజస్తంభ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు


నూతనంగా ప్రతిష్ఠించిన సీతారామలక్ష్మణుడు, ఆంజనేయ స్వామి విగ్రహాలు

అదుపు తప్పిన స్కూల్ బస్సు

కారంచేడు (పర్చూరు), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : రోడ్డుపై ఉన్న ఇనుపగొట్టాన్ని తప్పించబోయే క్రమంలో ప్రైవేటు స్కూల్ బస్సు అదుపు తప్పి పక్కనే ఉన్న రోడ్డు మార్జిన్‌లోకి వరిగిపోయిన ఘటన సోమవారం కారంచేడు మండలం కేశవప్పాడు వద్ద చోటుచేసుకుంది. కేశవరప్పాడులో విద్యార్థులను ఎక్కించుకొని పూసపాడులోని పాఠశాలకు తిరుగు ప్రయాణం చేస్తున్న క్రమంలో ఈప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.


రోడ్డు మార్జిన్‌లో వరిగిన ప్రైవేటు స్కూల్ బస్సు


వెంకటకృష్ణారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రోటరీ ప్రతినిధులు

'అగ్నిగుండాల'కు నివాళి

పర్చూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి) రోటరీక్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ వ్యవస్థాపక సభ్యులు అగ్నిగుండాల వెంకటకృష్ణారావుకు సోమవారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఘన నివాళి అర్పించారు. రోటరీ భవనంలో క్లబ్ ప్రతినిధులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. రోటరీ క్లబ్ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను గుర్తు చేస్తూ కొనియాడారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్, పాబోలు ఉదయ భాస్కర్, తేళ్లరమేష్‌చంద్ర, కేఎస్ఆర్‌కె ప్రసాద్, భవనం రాజగోపాలరెడ్డి, దండా శ్రీనివాసరావు, కాల్వ సత్యన్నారాయణ, నాగభైరు శ్రీనివాసరావు, కోటా శ్రీనివాసరావు, పాబోలు వెంకన్న, కోమట్ల ఆంజనేయులు పాల్గొన్నారు.

రక్తహీనత నుంచి పిల్లలకు రక్షణ కల్పించాలి

పంగులూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : రక్తహీనత బారిన పడకుండా ఉండేందుకు ప్రతి పిల్లవానికీ నులిపురుగు నివారణ మాత్రలు మింగించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివచెన్నయ్య, డాక్టర్ బాలరాజేశ్వరి సూచించారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా పంగులూరు ప్రాథమిక పాఠశాలలో సోమవారం పిల్లలకు నులిపురుగుల నివారణ కోసం ఆల్‌బెండజోల్ మాత్రలను మింగించారు. మండలంలోని 21 గ్రామాలలో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో పాఠశాలల ఉపాధ్యాయులు, ఆరోగ్య కార్యకర్తలు పిల్లలకు అల్‌బెండజోల్ మాత్రలు మింగించే కార్యక్రమం చేపట్టారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో స్వరూపారాణి, ఎంఈవో 2 వీరాంజనేయులు, హెల్త్ ఎడ్యుకేటర్ అనూరాధ, పాఠశాల ఉపాధ్యాయులు రాధారాణి, మస్తాన్‌వలి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.


చినగంజాం : నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా సంతరావూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పాఠశాలల్లోని విద్యార్థులకు సోమవారం అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. సంతరావూరు ప్రాథమికోన్నత పాఠశాల, కడవకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు వైద్యాధికారి కే.కీర్తిసరోజ్ మాత్రలను పంపిణీని చేశారు. పలువురు విద్యార్థులకు వైద్యాధికారి మాత్రలు వేశారు. ఈ సందర్భంగా కడవకుదురు ఇన్‌చార్జి హెచ్‌ఎం కే.రామారావు మాట్లాడుతూ విద్యార్థులు భోజనం ముందు చేతులు శుభ్రం చేసుకోవాలని, గోళ్లలో మట్టి లేకుండా కత్తిరించుకోవాలని సూచించారు. వైద్య సిబ్బంది పోషకాహార విలువలు గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంతరావూరు యూపీ పాఠశాల హెచ్‌ఎం సత్యానందం, పాఠశాలల ఉపాధ్యాయులు, పీహెచ్‌సీ హెచ్ఈవో యూ.వెంకటరమణ, హెల్త్ అసిస్టెంట్ జి.విజయప్రసన్న, ఏఎన్ఎంలు శారద, శిరీష, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వేటపాలెం(చీరాలటౌన్) : విద్యార్థి దశ నుంచే ఆహార నియమాలు పాటించడం వలన ఆరోగ్యంగా జీవిస్తారని వేటపాలెం ఎపీఈడీవో రాజేష్, ఎంఈవో వెంకట సుబ్బయ్య అన్నారు. మండల పరిధిలోని పందిళ్లపల్లి జడ్పీ హైస్కూల్లో నులి పురుగుల నివార దినాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు నులి పురుగుల మాత్రలు మింగించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ అన్నం శ్రీనివాసరావు, పీహెచ్‌సీ వైద్యులు డా. జయ్‌కుమార్, డా. హర్ష, హెచ్‌ఎం శేఖరరావు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంకొల్లు : భోజనం చేసే ముందు చేతులను శుభ్రం చేసుకున్నట్లయితే వ్యాధులు సోకకుండా ఆరోగ్యంగా ఉంటారని ఆరోగ్య కేంద్రం వైద్యులు డా.అంజలి సూచించారు. సోమవారం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆల్‌బెండ్‌జోల్ మాత్రలను వేయించారు. కార్యక్రమంలో డా.భానుప్రసాద్, సీహెచ్‌వో కోటేశ్వరరావు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పర్చూరు : అల్బెండ్‌జోల్ మాత్రలను ఆరోగ్య, ఆశా, అంగన్‌వాడీ సిబ్బంది అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పిల్లలకు పంపిణీ చేశారు. చిన్నారులకు నులిపురుగుల కారణంగా అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని దీన్ని నివారించేందుకు కార్యక్రమం చేపట్టామన్నారు.


పంగులూరు పాఠశాలలో నులిపురుగు మాత్రలు మింగిస్తున్న డాక్టర్ శివచెన్నయ్య, చినగంజాంలో విద్యార్థినికి అల్బెండ్‌జోల్ మాత్రలు వేస్తున్న వైద్యాధికారి కీర్తిసరోజ్, పందిళ్లపల్లిలో మాత్రలు వేస్తున్న అధికారులు



5,43,743 మంది పిల్లలకు నులిపురుగుల మందు

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా జిల్లావ్యాప్తంగా సోమవారం 94.5 శాతం మంది విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు మింగించినట్లు డీఎంహెచ్‌వో సుజాత ఒక ప్రటనలో తెలిపారు. మొత్తం 5.75 లక్షల మంది విద్యార్థులకు ఈ మాత్రలు మింగించాలని నిర్ణయించగా 5,43,743 మందికి అందజేసినట్లు తెలిపారు. మిగిలిన వారికి మంగళవారం కూడా మాత్రలు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

రిజిస్ట్రేషన్ల మందగమనం

- లక్ష్యంలో పూర్తయింది 60.38 శాతం
- మార్చి నెలాఖరుతో ముగియనున్న గడువు
- తలలు పట్టుకుంటున్న ఆశాఖ అధికారులు



నెల్లూరు (హరనాధపురం) ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో స్థిరాస్తి క్రయ, విక్రయాలు మందగించాయి. రిజిస్ట్రేషన్లు చేయించుకునే వారి సంఖ్య బాగా తగ్గడంతో ప్రభుత్వ ఖజానాకు ఆదాయానికి గండి పడింది. గత వైసీపీ సర్కారు నిర్వాకంతో స్థిరాస్తి వ్యాపారం కుదేలవగా, రిజిస్ట్రేషన్ చార్జీలు విపరీతంగా పెరగడంతో కొందరు ఒప్పందాలతోనే సరిపెట్టుకుంటు న్నారు. ఆస్తి బదలాయింపులకు ఒప్పందం చట్టబద్ధత కాకపో యినా రిజిస్ట్రేషన్ చార్జీలు భరించలేక వాయిదా వేసుకుంటున్నారు. ఫలితంగా రిజిస్ట్రేషన్ల సంఖ్య అనుకున్న మేరకు నమోదు కాలేదు. అంతే గాక స్టాంపుల అమ్మకాలను గత ప్రభుత్వం పూర్తిగా ప్రైవేటీకరణ చేయడంతో ప్రభుత్వ ఖజానాకు ఆదాయం తగ్గింది. ఈ పరిస్థితిని గుర్తించిన కూటమి ప్రభుత్వం స్టాంపుల అమ్మకాలను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనే తిరిగి ప్రారంభించడంతో ఇటీవల తనఖా రిజిస్ట్రేషన్ సంఖ్య పెరగడం ప్రారంభమైంది. భూములు, భవనాలు తనఖా పెట్టి కొందరు ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పులు తీసుకుంటున్నారు. ఈ తనఖా రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల కారణంగా కొంత ఆదాయం రిజిస్ట్రేషన్ శాఖకు వస్తోంది.

● సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా..

జిల్లావ్యాప్తంగా 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈసారి లక్ష్యాలు బాగానే నమోదయ్యాయి. 2024 -25 ఆర్థిక సంవత్సరానికి రాబడి లక్ష్యం రూ.712.38 కోట్లు కాగా జనవరి నెలాఖరుకు రూ.383.80 కోట్లు (60.38 శాతం) మాత్రమే వసూలు అయింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా చూసుకుంటే అత్యధికంగా ముత్తుకూరులో 93.18 శాతం, కోవూరులో 87.25 శాతం, అల్లూరులో 81.30 శాతం, ఆత్మకూరులో 75.01 శాతం లక్ష్యసాధన నమోదైంది. రాపూరులో అత్యల్పంగా 47.97 శాతం లక్ష్యం మాత్రమే పూర్తయింది. పట్టణ ప్రాంతాల్లో ప్లాట్ల ధరలు ఆకాశమే హద్దుగా పెరుగుతుండటంతో స్థిరాస్తుల క్రయవిక్రయాలు తగ్గుతున్నాయని కొందరు విశ్లేషిస్తున్నారు. మార్చి నెలాఖరులోపు లక్ష్యం పూర్తి చేయాల్సి ఉండటంతో అధికారులు ఆలోచనలో పడిపోయారు.

లక్ష్య సాధన ఇలా... (జనవరి ఆఖరు వరకు, రూ.కోట్లలో)

సబ్‌రిజిస్ట్రార్	లక్ష్యం	పూర్తి	శాతం
కందుకూరు	30.66	18.17	59.28
అల్లూరు	7.54	6.13	81.30
ఆత్మకూరు	12.65	9.49	75.01
బుచ్చిరెడ్డిపాలెం	25.76	16.80	65.24
ఇందుకూరుపేట	21.67	13.74	63.39
కావలి	72.80	40.21	55.24
కోవూరు	23.00	20.06	87.25
ముత్తుకూరు	32.04	29.85	93.18
పొదలకూరు	15.29	8.29	54.22
రాపూరు	7.87	3.77	47.97
ఉదయగిరి	8.13	5.99	73.71
వింజమూరు	15.87	9.22	58.11
నెల్లూరు (ఆర్ఓ)	227.72	121.67	53.43
స్టోన్‌హౌస్‌పేట	92.22	52.44	56.87
బుజబుజనెల్లూరు	40.72	26.88	66.03
మొత్తం	634.02	382.80	60.38

● పాఠశాలలను మార్చు చేయొద్దని ఆందోళన



కలువాయి : పాఠశాల గేటుకు తాళం వేసి బైఠాయించిన విద్యార్థులు, తల్లిదండ్రులు

విలీనంపై ఆగ్రహం!

కలువాయి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల విలీనంపై విద్యార్థుల తల్లిదండ్రుల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది. తరగతులను బహిష్కరించి, ఉపాధ్యాయులను బయటకు పంపి గేటుకు తాళం వేసి బడి ముందు విద్యార్థులతో కలిసి బైఠాయించారు. సోమవారం కలువాయి, సంగం, అనంతసాగరం తదితర మండలాల్లో ఆందోళనలు జరిగాయి. కలువాయి మండలం పెన్నబద్వేలిలో సచివాలయం, రైతుసేవా కేంద్రాల సిబ్బందిని కూడా బయటకు పంపి మూసేశారు. ఈ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో 122 మంది విద్యార్థులు ఉండగా, 1 నుంచి 5 తరగతుల విద్యార్థులు 70 మంది, 6,7,8 తరగతుల విద్యార్థులు 52 మంది ఉన్నారు. ఈ పాఠశాలను మోడల్ ప్రాథమిక పాఠశాలగా మార్చి ఇక్కడున్న 6, 7, 8 తరగతుల విద్యార్థులను 4 కి.మీ దూరంలో ఉన్న కలువాయి జడ్పీ హైస్కూల్‌లో విలీనం చేశారు. అలాగే 2 కి.మీ దూరంలోని పాత బద్వేలి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలోని 3,4,5 తరగతుల విద్యార్థులను ఇందులో విలీనం చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ ప్రతిపాదనలపై గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ పాఠశాలనే హైస్కూల్‌గా మార్చి కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నారు. ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు ఆందోళన కొనసాగుతుందని హెచ్చరిస్తున్నారు. ఈ సమాచారం అందుకున్న ఎంఈవో-2 శేషగిరిరావు అక్కడకు చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడి, సర్దిచెప్పారు.



స్కాం నిర్వాహకుడు షేక్ సుభాన్ ఇల్లు

'షేర్' కా సుభాన్!

- ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో మనీస్కాం
- అనంతార్థ అసోసియేట్స్ పేరుతో రూ.కోట్లు దండుకుని జంప్
- సుమారు వేయి మందికిపైగా బాధితులు
- కేసు నమోదు చేసి విచారిస్తున్న పోలీసులు

'మా సంస్థలో పెట్టుబడి పెట్టండి చాలు. ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టి లాభాలు సృష్టిస్తాం. మీకు రూ.లక్షల్లో ముట్టచెబుతాం.' అంటూ ఓ వ్యక్తి మహిళలు, నిరక్షరాస్యులను నమ్మించాడు. ఇంకేముంది.. ఆయన మాటలు నమ్మిన వారు భారీగా ముట్టజెప్పారు. ఇప్పుడు ఆ సంస్థ నిర్వాహకుడు అదృశ్యం కావడంతో బాధితులు గగ్గోలు పెడుతున్నారు. న్యాయం చేయాలంటూ ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డిని, పోలీసులను ఆశ్రయించారు. బాధితుల కథనం మేరకు..

వివరాలు 6లో..

గుప్పెడంత గుండెకు కొండంత భరోసా!

- స్టెమీ ప్రాజెక్టుతో సాధ్యం చేస్తున్న కూటమి ప్రభుత్వం
- రూ.40 వేల విలువైన టెనెక్టెప్లెస్ ఇంజక్షన్ ఉచితంగా
- అన్ని ప్రభుత్వ ఆసుపత్రులకు సరఫరా

వివరాలు 6లో..

ఇక స్వచ్ఛ కందుకూరు

- 15న పర్యటించనున్న సీఎం చంద్రబాబు
- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నుంచి సంపూర్ణ సహకారం
- డంపింగ్ యార్డును తరలించి పార్కు ఏర్పాటు
- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్



దూబగుంట వద్ద ఏర్పాటు చేయనున్న వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలిస్తున్న పట్టాభిరాం, ఎమ్మెల్యే ఇంటూరి, మాజీఎమ్మెల్యే దివి శివరాం తదితరులు

కందుకూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : కందుకూరు పట్టణాన్ని సుందర పట్టణంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని, జనావాసాలకు సమీపంలోఉన్న డంపింగ్‌యార్డులోని చెత్తను వందరోజుల్లో ఖాళీచేసి సుందర పార్కుగా అభివృద్ధి చేస్తామని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల 15న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కందుకూరులో పర్యటించనున్న నేపథ్యంలో పట్టాభిరామ్ సోమవారం కందుకూరు విచ్చేశారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే దివి శివరాం, వివిధ శాఖల అధికారులతో కలిసి గుర్రంవారిపాలెం సమీపంలో ఉన్న డంపింగ్‌యార్డును, దూబగుంట సమీపంలో ఏర్పాటు చేసిన వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్‌ను పట్టాభి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15న సీఎం చంద్రబాబు స్వచ్ఛ కందుకూరు కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నారని తెలిపారు. ఆ రోజు రాష్ట్రంలో ఉన్న ప్రజా ప్రతినిధులు, అధికారు లంతా స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. కందుకూరులో 26వేల టన్నుల చెత్త ఉన్న డంపింగ్‌యార్డును జనావాస ప్రాంతంలో ఏర్పాటు చేయటం బాధాకరమన్నారు. కేవలం వంద రోజు ల్లోనే ఈ యార్డులో ఉన్న చెత్తను రీసై క్లింగ్‌చేసి ఖాళీ చేయిస్తామని ఈ ప్రాం తాన్ని పబ్లిక్ పార్కుగా అభివృద్ధి చేస్తా మని ఇందుకోసం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నుంచి సంపూర్ణ సహకారం అందిస్తా మని పేర్కొన్నారు. మార్చి 1 నుంచి కందుకూరులో ప్రతిరోజు వచ్చే 25 టన్నుల చెత్తను తడిచెత్త, పొడిచెత్తగా వేరుచేసి దూబగుం టలో ఏర్పాటుచేసిన వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్‌కు తరలిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వర రావు మాట్లాడుతూ డంపింగ్‌యార్డును ఇక్కడ నుంచి తరలించి సుదూరప్రాంతంలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజ, మున్సిపల్ కమిషనర్ కె. అనూష, టీడీపీ పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వర రావు, ఇతర ముఖ్యనేతలు పాల్గొన్నారు.

గీతకులాలకు మద్యం దుకాణాల కేటాయింపు

6లో..

● తొలిరోజు 7,160 మంది హాజరు

ప్రాక్టికల్స్ ప్రారంభం

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ ద్వితీయ సంవత్సరం సైన్స్ విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు (ప్రాక్టికల్) సోమవారం ప్రారంభమయ్యాయి. తొలివిడతలో జిల్లావ్యాప్తంగా 88 కేంద్రాల్లో జరిగిన ప్రాక్టికల్స్‌కు 7,160 మంది హాజరయ్యారు. ఉదయం జరిగిన ప్రాక్టికల్స్‌కు 4,267 మందికిగాను 4,136 మంది హాజరవగా 131 మంది గైర్హాజరయ్యారు. అలాగే మధ్నాహ్నం 3,121 మందికి 3,024 మంది హాజరవగా, 97 మంది గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్ఐఓ ఎ.శ్రీనివాసులు ఆరు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి ప్రాక్టికల్స్ జరుగుతున్న తీరును పరిశీలించారు. జిల్లావ్యాప్తంగా ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా తొలిరోజు పరీక్షలు పూర్తయ్యాయని, ఇదే రీతిలో అన్ని పరీక్షలను కట్టుదిట్టంగా ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహిస్తామని తెలిపారు. ఆర్ఐఓతోపాటు డీఈసీ సభ్యులు, ఫ్లయింగ్‌స్క్వాడ్ కలిపి మొత్తం 9 పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.



ప్రాక్టికల్స్‌కు హాజరైన విద్యార్థిని ప్రశ్నిస్తున్న ఆర్ఐవో శ్రీనివాసులు

కందుకూరులో ఐవోసీ మంట

- ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో పెట్రోలు బంకు
- వ్యతిరేకత వస్తున్నా అధికారులు ముందుకే!
- రెవెన్యూ మంత్రిని కలిసిన ముఖ్యులు

కందుకూరు మండల కార్యాలయాల సముదాయంలో పెట్రోలుబంకు ఏర్పాటుకు తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) ఆధ్వర్యంలో ఏర్పాటయ్యే పెట్రోలు బంకు కోసం కేవలం నెలకు రూ.15వేల అద్దెకు 99 సంవత్సరాలపాటు స్థలాన్ని లీజుకు ఇచ్చేలా ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీనిపై అన్నివర్గాల నుంచి వ్యతిరేకత వస్తున్నా గత ప్రభుత్వ హయాంలో ఈ నిర్ణయం జరిగినందున తామేమీ చేయలేమని అధికారులు తప్పించుకునే యత్నం వెనుక పరమార్థం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రజల నుంచి వ్యతిరేకత వస్తే పునఃసమీక్ష చేయరా అని ప్రశ్నిస్తున్నారు.



పెట్రోలు బంకు ఏర్పాటుకు ఐవోసీకి ఇచ్చిన స్థలం ఇదే!

వివరాలు 6లో..

రైతులకూ గుర్తింపు సంఖ్య

- అది ఉంటేనే సంక్షేమ పథకాలు, ఇతర సేవలు
- ఫార్మర్ రిజిస్టర్ పేరుతో ఆధార్ తరహా నమోదు
- ఆర్ఎస్‌కేల ద్వారా ప్రక్రియ ప్రారంభం
- లక్ష్యం 1,71,547 మంది అన్నదాతలు

అన్నదాతలకు ఆధార్ తరహా గుర్తింపు కార్డు రాబోతోంది. ప్రతి రైతుకు ఓ విశిష్ట సంఖ్య (యూనిక్ కోడ్) ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. భూమి ఉన్న ప్రతి రైతుకు ఫార్మర్ రిజిస్టర్ పేరుతో నిర్దిష్ట గుర్తింపు సంఖ్య(11 అంకెలు) ఇవ్వడం ద్వారా ప్రభుత్వ పథకాలు, ఇతర సేవల ద్వారా నేరుగా లబ్ధి చేకూరనుంది. జిల్లాలోని రైతు సేవా కేంద్రాల (ఆర్ఎస్‌కేలు) ద్వారా ఈసంఖ్య జారీ చేసేందుకు వ్యవసాయశాఖ అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో 1,71,547 మంది రైతుల నమోదే లక్ష్యంగా వారు ముందుకు సాగుతున్నారు.



నెల్లూరు (వ్యవసాయం)/ఉదయగిరి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రైతుల ఆధార్, దానికి అనుసంధానం చేసిన ఫోన్ నెంబరు, పట్టాదారు పాసుపుస్తకం తీసుకుని ఆర్ఎస్‌కేకి వెళ్లాలి. అక్కడ వీఏఏలు ఆన్‌లైన్‌లో వారి వివరాలు నమోదు చేస్తారు. అనంతరం రైతు ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. దాన్ని వీఏఏలకు చెబితే 11 అంకెల ప్రత్యేక గుర్తింపు సంఖ్య వస్తుంది. ఆయా గ్రామాల్లో లేనివారు కూడా ఫోన్ ద్వారా కూడా నమోదు చేసుకునే అవకాశం ఉంది. ఆధార్, ఆన్‌లైన్ అడంగల్‌లో పేరు 80శాతం సరిగా ఉంటేనే విశిష్ట గుర్తింపు సంఖ్య వస్తుంది. అయితే ఆధార్‌లో రైతు పేరు, ఆన్‌లైన్ అడంగల్‌లో 60 నుంచి 80శాతం వరకు సరిగా ఉంటే దాన్ని పరిశీలించేందుకు వీఆర్వో లాగిన్‌కు వెళుతుంది. 60శాతానికంటే తక్కువగా ఉంటే ఆ వివరాలు తహసీల్దారు లాగిన్‌కు వెళుతుంది. వారు పరిశీలించి సరిగ్గా ఉందని భావిస్తే రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య వస్తుంది.

● విశిష్ట సంఖ్యతో ఉపయోగాలు

ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఇతర వ్యవసాయ సంబంధిత సేవలు పొందేందుకు ఈ విశిష్ట సంఖ్య ఉపయోగపడుతుంది. ప్రధాన్ మంత్రి కిసాన్ యోజన, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ, రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు, రాయితీపై సూక్ష్మ పోషకాలు, సూక్ష్మసేద్యంపై రాయితీ, పంట రుణాలు, పెట్టుబడి సాయం.. పథకాల వల్ల నేరుగా పొందే వీలు ంటుంది. అలాగే సత్వర పంట నష్ట పరిహారం పొందేందుకు వీలవుతుంది. నీటిపారుదల, తెగుళ్ల నియంత్రణ, వాతావరణ సూచనలు వంటి ఇతర సేవలు పొందేందుకు కూడా ఉపయోగపడుతుంది.

రైతులు సహకరించాలి

భూమి ఉన్న ప్రతి రైతుకు ప్రస్తుతం విశిష్ట సంఖ్య ఇస్తున్నాం. ఆ తరువాత కౌలు రైతులకు, భూమిలేని వ్యవసాయ కూలీలకు, వ్యవసాయ ఆధారిత వృత్తుల్లో ఉన్న వారికీ కూడా ఇవ్వనున్నారు. ఈ విషయమై ఇప్పటికే మండల వ్యవసాయాధికారులు, వీఏఏలు, వీహెచ్‌ఏలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. జిల్లాలో 1,71,547 మంది రైతుల నమోదే లక్ష్యంగా పనిచేస్తున్నాం. మండలాల వారీగా లక్ష్యాలను నిర్దేశించాం. నమోదుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. రైతులు కూడా ముందుకొచ్చి విశిష్ట సంఖ్య నమోదుకు అధికారులకు సహకరించాలి.



- పీ.సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారి

మహిళల హాకీ ఛాంపియన్ కడప



నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన 15వ ఏపీ సీనియర్ మహిళా హాకీ ఛాంపియన్‌షిప్ పోటీల్లో కడప జిల్లా జట్టు విజేతగా నిలిచింది. సోమవారం జరిగిన ఫైనల్స్‌లో అనంతపురం, కడప జట్లు తలపడగా 2-0 గోల్స్ తేడాతో కడప టీం గెలుపొందింది. అనంతపురం ద్వితీయ స్థానంలో నిలిచింది. మూడు, నాలుగు స్థానాల కోసం జరిగిన మ్యాచ్‌లో కాకినాడ, అనకాపల్లి జట్లు తలపడగా కాకినాడ 7-1 గోల్స్‌తో విజయం సాధించింది. విజేతలకు హాకీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చాణిక్య రాజు, కార్యదర్శి హర్షవర్ధన్, కోశాధికారి థామస్‌పీటర్ విజేతలకు బహుమతులు అందచేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన కడప జట్టుకు ట్రోఫీతోపాటు రూ.7 వేలు, ద్వితీయస్థానంలో నిలిచిన అనంతపురం జట్టుకు ట్రోఫీ, రూ.5వేలు, తృతీయస్థానంలో నిలిచిన కాకినాడ జట్టుకు ట్రోఫీ రూ.3వేలు నగదు అందచేశారు. అలాగే ఉత్తమ గోల్‌కీపర్‌గా నిలిచిన ప్రకాశం జిల్లా క్రీడాకారిణి నందినికి, ఉత్తమ క్రీడాకారిణిగా నిలిచిన కాకినాడ క్రీడాకారిణి వరాలమ్మకు, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అనంతపురం జిల్లా క్రీడాకారిణి లక్ష్మీలకు నగదు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో డాక్టర్ మల్లికార్జున, డాక్టర్ జోనాతాన్, సీనియర్ క్రీడాకారులు నవీన్, పోటీల నిర్వాహక కార్యదర్శి థామస్‌పీటర్, జిల్లా అసోసియేషన్ కార్యదర్శి జగన్మోహన్, వ్యాయామ ఉపాధ్యాయులు జీడీ.సురేష్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

చేసిన పనులకు బిల్లులివ్వండి!

● సచివాలయంలో ఒకరి హల్‌చల్

తోటపల్లిగూడూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : తాను చేసిన పనులకు బిల్లులు ఇవ్వాలంటూ ఓ వ్యక్తి మాచర్లవారిపాలెం సచివాలయంలో హల్‌చల్ చేసిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. శనివారం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. చేసిన ప్రతి పనికి ముడుపులు ఇవ్వాలంటే ఎలాగని సిబ్బందిని నిలదీశారు. దీంతో కార్యదర్శి పాత పనులకు బిల్లులు చేయనని తెగేసి చెప్పారు. ఇరువురి మధ్య వాగ్వాదం జరగ్గా సిబ్బంది సర్ది చెప్పారు. దీనిపై ఎంపీడీవో వెంకటేశ్వర్లును వివరణ కోరగా విషయం తన దృష్టికి రాలేదని తెలిపారు.

వెల్‌డన్ వెటరన్స్!

జాతీయ అథ్లెటిక్స్‌లో పతకాలు




నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్‌లో ఇటీవల జరిగిన 44వ జాతీయ వెటరన్ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించారు. జిల్లా నుంచి 32 మంది పోటీలకు హాజరై, వివిధ విభాగాల్లో సత్తా చాటి 36 బంగారు, 16 వెండి, 15 కాంస్య పతకాలను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా మాస్టర్స్ వెటరన్ అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈ భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి డీ బసవయ్య, మహిళా అధ్యక్షురాలు వీ కోటేశ్వరమ్మ సోమవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

గుప్పెడంత గుండెకు కొండంత భరోసా!

● స్టెమీ ప్రాజెక్టుతో సాధ్యం చేస్తున్న కూటమి ప్రభుత్వం
● రూ.40 వేల విలువైన టెనెక్టెప్లెస్ ఇంజక్షన్ ఉచితంగా
● అన్ని ప్రభుత్వ ఆసుపత్రులకు సరఫరా

● విడవలూరుకు చెందిన సుబ్బరాజు (45) గుండెనొప్పితో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లారు. అక్కడ ఈసీజీ తీసిన వైద్యులు సుబ్బరాజుకు గుండె సమస్య ఉందని వెంటనే ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి పంపించారు. ఇక్కడ పరీక్షించి న వైద్యులు నారాయణ ఆసుపత్రిలోని గుండె వ్యాధి నిపుణుడికి బాధితుడి వివ రాలు పంపించారు. రోగికి గుండెకు వెళ్లే నరాలలో లోపం ఉందని, టెనెక్టెప్లెస్ ఇంజక్షన్ ఇవ్వాలంటూ సిఫారసు చేశారు. వెంటనే జీజీహెచ్ వైద్యులు అందుబాటు లో ఉన్న ఈ ఇంజక్షన్ వేయటంతో తాత్కాలికంగా రోగి కోలుకున్నారు. ఆ రోగిని నారాయణ ఆసుపత్రికి తరలించటంతో శస్త్రచికిత్స చేశారు.

● దుత్తలూరు మండలం నర్రవాడకు చెందిన వెంగయ్య తీవ్ర గుండె నొప్పితో ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి ఇతనికి వెంటనే అందుబాటులో ఉన్న టెన్‌క్టెప్లెస్ ఇంజక్షన్ వేయటంతో బాధితుడు కోలుకున్నారు. వైద్యుల సూచనల మేరకు బాధితుడిని మెడికవర్ ఆసుపత్రికి తరలించటంతో అక్కడ గుండెకు వెళ్లే నరాలకు స్టంట్ వేయటంతో కోలకున్నాడు. ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా ఈ చికిత్సలు అందించారు.



నెల్లూరు (వైద్యం) ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత సమాజంలో గుండె వ్యాధులు ఆందోళన కలిగిస్తున్నాయి. అన్ని వ్యాధుల కంటే గుండె సంబంధిత వ్యాధులతోనే ఎక్కువగా మరణాలు జరుగుతున్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు. ఒకప్పుడు 50 ఏళ్ల పైబడిన వారిలోనే వచ్చే గుండెజబ్బులు ఇప్పుడు చిన్నారులనూ కలవరపెడుతున్నాయి. ప్రస్తుత ఆహారపు అలవాట్ల వల్ల గుండె వెళ్లే కవాటాలు పూడి పోతున్నాయి. దీంతో గుండెపోటు సంభవిస్తోంది. వెంటనే రెండు గంటల్లోపు బాధితులకు తాత్కాలిక ఉపశమనం కింది ఖరీదైన ఇంజక్షన్ ఇవ్వాల్సి ఉంటుంది. ఇది వేసిన వెంటనే వ్యాధిగ్రస్థుడు కోలుకుంటాడు. దీన్ని గుర్తించిన కూటమి ప్రభుత్వం రూ.40 వేల నుంచి 50వేలు ఖరీదు చేసే టెనెక్టెప్లెస్ అనే సూదిమందును అందుబాటులోకి తెచ్చింది. గత ఏడాది నవంబరు 23వ తేదీన స్టెమీ (ఎస్టీ ఎలివేషన్ మయోకార్డియల్ ఇన్‌ఫార్క్షన్) పేరుతో ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపడుతోంది. రెండున్నర నెలల పరిధిలో 200 మంది బాధితులకు గోల్డన్ అవర్ పేరిట అందుబాటులోకి తెచ్చిన ఈ ఇంజక్షన్ ఇచ్చి ప్రాణా లు కాపాడారు. ఇటీవల పక్షవాత బాధితులకు కూడా ఈ సూది మందు వాడుతున్నారు.



● 14 ఆసుపత్రుల్లో అందుబాటులోకి

నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)తో పాటు ఆత్మకూరులోని జిల్లా ఆసుపత్రి, కందుకూరు, కావలి ఏరియా ఆసుపత్రులు, ఉదయగిరి, అల్లూరు, పొదలకూరు. వెంకటాచలం, బుచ్చి, వింజమూరు, ఇందుకూరుపేట, కోవూరు, రాపూరు సామాజిక ఆరోగ్య కేంద్రాల్లోనూ ఈ టెన్‌క్టెప్లెస్ ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నా యి. వాటిని ప్రజలు ఉపయోగించుకునేలా వైద్యులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటి వరకు 450 ఇంజక్షన్లు ఆయా ఆరోగ్య కేంద్రాలకు పంపించారు. అయితే ప్రభుత్వపరంగా గుండె వైద్య నిపుణులు లేకపోవటంతో ఎన్టీఆర్ వైద్యసేవ పథకం నిర్వహించే నారాయణ, మెడికవర్ ఆసుపత్రుల్లోని వైద్యులకు టెలిమెడిసిన్ ద్వారా సమాచారం ఇచ్చి వారి సూచనలతో బాధితులకు ఇంజక్షన్ ఇచ్చి ప్రాణాలు కాపాడుతున్నారు.

ఛాతీ నొప్పితో వస్తే...

కొందరు ఛాతీ నొప్పితో ఆసుపత్రికి వస్తుంటారు. చెమటలు పట్టడం, వాంతులు అవడం వంటి లక్షణాలు గుండె నొప్పికి కారణాలుగా వైద్యులు చెబుతున్నారు. ఈ లక్షణాలతో ఆసుపత్రులకు వచ్చే రోగికి ఆక్సిజన్ పెట్టి ఈసీజీ తీస్తారు. దీన్ని ప్రత్యేక యాప్‌ద్వారా ఎన్టీఆర్ వైద్యసేవ ఆసుపత్రులకు పంపిస్తారు. అక్కడున్న గుండె వైద్యులు ఆ రిపోర్టులను పరిశీలించి వెంట నే టెన్‌క్టెప్లెస్ ఇంజక్షన్‌కు సిఫారసు చేస్తారు. లేదంటే ఈసీజీ రిపోర్టులకు తగ్గట్టుగా మందులు, ఇతర ఇంజక్షన్లు వేయా లని సూచిస్తారు. ఇలా అనుమానంతో ఇప్పటివరకు 2వేల మందికిపైగా నమోదవగా వీరిలో 200 మందికే ఈ ఖరీదైన టెన్‌క్టెప్లెస్ ఇంజక్షన్ వేశారు.

ఎంతో ఉపయోగం

గుండె వ్యాధిగ్రస్థులకు స్టెమీ ప్రాజెక్టు ద్వారా ప్రభుత్వం ఖరీదైన టెన్‌క్టెప్లెస్ ఇంజక్షన్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఆత్మకూరు జిల్లా ఆసుపత్రితోపాటు రెండు ఏరియా ఆసుపత్రులు, 10 సామాజిక ఆరోగ్య కేంద్రాలలోనూ ఈ ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయి. గాస్ట్రిక్ ట్రబుల్ అనుకొని గుండె నొప్పికి సంబంధించి ఎలాంటి నిర్లక్ష్యం చేయవద్దు. వెంటనే సమీప ఆసుపత్రికి వెళ్లి పరీక్ష చేయించుకోవాలి. తద్వారా అత్యవసరస్థితిలో వైద్య నిపుణుల సూచనల మేరకు ఈ ఇంజక్షన్ బాధితులకు వేస్తారు.



- డాక్టర్ రమేసనాథ్, డీసీహెచ్ఎస్

ప్రాణాలు కాపాడుతున్నాం



గత ఏడాది నవంబరు 23వ తేదీన ఖరీదైన ఇంజక్షన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి వచ్చే రోగులను క్షణ్ణంగా పరీక్షించి వైద్య నిపుణుల సూచనల మేరకు ఈ ఇంజక్షన్ వేస్తున్నాము. పక్షవాతం బాధితులకు కూడా ఇది ఎంతో ఉపయోగ పడుతుంది. దీనిపై పూర్తిస్థాయిలో ప్రచారం నిర్వహిస్తే మరింత మందికి ఉపయోగపడుతుంది.

- డాక్టర్ సిద్దానాయక్, జీజీహెచ్ సూపరింటెండెంట్

తల్లీబిడ్డకు ప్రాణం పోశారు

నెల్లూరు (వైద్యం) ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జీజీహెచ్ వైద్యులు ప్రాణాపాయంలో ఉన్న తల్లీబిడ్డను కాపాడారు. వివరాల్లోకి వెళితే.. కావలి డివిజన్‌లోని మోచర్ల గ్రామానికి చెందిన గర్భిణి పారాబత్తిన రజని (25) డెంగ్యూ, వైరల్ జ్వరంతో ప్లేట్‌లెట్స్ పడిపోయి కావలి ఏరియా ఆసుపత్రికి వెళ్లారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో నెల్లూరులోని జీజీహెచ్‌కు వెళ్లాలని సిఫార్సు చేశారు. వెంటనే జీజీహెచ్‌కురాగా డాక్టర్ గీతాలక్ష్మి పర్యవేక్షణలో ప్లేట్‌లెట్స్ ఎక్కించారు. అయితే ఆమెకు అత్యవసర సిజేరియన్ చేయాల్సి రావటంతో ఆపరేషన్ చేసి తల్లీబిడ్డను కాపాడారు. విషయం తెలుసుకున్న జీజీహెచ్ అభివృద్ధి కమిటీ కో-ఆర్డినేటర్ శ్రీనివాసులు, డైరెక్టర్లు మొగరాల సురేష్, బ్రహ్మారెడ్డి డాక్టర్ గీతాలక్ష్మిని సత్కరించారు. ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ సునీల్‌ను కూడా వారు సత్కరించారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ అడ్మినిస్టేటర్ డాక్టర్ కళారాణి తదితరులు పాల్గొన్నారు.



వైద్యులను సత్కరిస్తున్న ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు,

పీజీ, ఎల్ఎల్‌బీ పరీక్షలకు 271 మంది గైర్హాజరు

వెంకటాచలం, ఫిబ్రవరి 10 (ఆంధ్ర జ్యోతి) : విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలల్లో సోమవారం జరిగిన పీజీ మొదటి, ఎల్ఎల్‌బీ మూడవ సెమిస్టర్ పరీక్షలకు 271 మంది విద్యార్థు లు గైర్హాజరైనట్లు వర్సిటీ పరీక్షల నిర్వాహణాధి కారి డాక్టర్ ఆర్ మధుమతి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం జరిగిన పరీ క్షలకు 1,976 మంది విద్యార్థులకుగాను 1,797 మంది హాజరుకాగా 179 మంది గైర్హాజరయ్యాని, మధ్యాహ్నం పరీక్షలకు 1,477 మందికి 1,385 మంది హాజరుకా గా 92 మంది గైర్హాజరయ్యారని తెలి పారు.

● డిగ్రీ ఒకటవ, నాలుగవ సెమిస్టర్ మెగా సప్లిమెంటరీ పరీక్షలకు ఒకరు గైర్హాజరైనట్లు ఆమె తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 22 మంది విద్యార్థులకు 21 మంది హాజరయ్యారు.

టెన్త్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేయండి

డీఆర్వో విజయభాస్కర్



సమావేశంలో డీఆర్వో, అధికారులు

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వచ్చేనెలలో ప్రారంభం కానున్న టెన్త్ పరీక్షలకు పటిష్ట ఏర్పాటు చేయాలని డీఆర్వో జే.విజయభాస్కర్‌రావు తెలిపారు. డీఆర్వో చాంబర్‌లో సోమవారం టెన్త్ వార్షిక పరీక్షలపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్చి 17 నుంచి 31 వరకు జరిగే టెన్త్ పరీక్షలకు జిల్లాలో మొత్తం 33,434 మంది విద్యార్థులు హాజరవుతున్నారన్నారు. పరీక్షల నిర్వహణ కోసం ఏర్పాటు చేస్తున్న 174 కేంద్రాలతో పాటు 16 సమస్యాత్మక కేంద్రాలపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు, ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షల సమయంలో సమీపంలోని జెరాక్స్ షాపులు మూసివేయడంతోపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడా కూడా విద్యార్థులు ఇబ్బందులు పడకూడదని, పరీక్షలు సజావుగా జరిగేలా అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ సమీక్షలో డీఈవో డాక్టర్ ఆర్ బాలాజీరావు, అధికారులు పాల్గొన్నారు.



లక్కీడిప్ తీస్తున్న జాయింట్ కలెక్టర్ కార్తీక్

గీతకులాలకు మద్యం దుకాణాల కేటాయింపు

● నేడు ప్రొవిజినల్ లైసెన్స్‌ల జారీ ● ప్రశాంతంగా లక్కీ డిప్

● 18 షాపులు కేటాయించిన జేసీ కార్తీక్

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): గీతకులాలకు మద్యం దుకాణాల కేటాయింపు సోమవారం ప్రశాంతంగా ముగిసింది. నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో జేసీ కార్తీక్ ఆధ్వర్యంలో లక్కీడిప్ ద్వారా వ్యాపారులకు దుకాణాలు కేటాయించారు. జిల్లాలోని 18 షాపులకు వ్యాపారులు 213 దరఖాస్తులు వేశారు. జేసీ సమక్షంలో ఎక్సైజ్ అధికారులు ఒక్కో షాపునకు అందిన దరఖాస్తుల ప్రకారం లక్కీడిప్ నిర్వహించారు. నగరంలోని ఒక షాపునకు అధికంగా 30 దరఖాస్తులు అందాయి. వ్యాపారులకు దరఖాస్తు చేసుకున్న సమయంలో ఇచ్చిన టోకెన్ నెంబర్ల ఆధారంగా లక్కీడిప్ నిర్వహించారు. ఇలా 18 షాపులను కేటాయించారు. మంగళవారం వ్యాపారులకు ఎక్సైజ్ అధికారులు ప్రొవిజినల్ లైసెన్సులను అందించను న్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ డీసీ శ్రీనివాసరావు, ఈఎస్ శ్రీనివాసులనాయుడు, పలువురు ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

'షేర్' కా సుభాన్!

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో మనీ స్కాం

కావలి రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు జిల్లాకు చెందిన దివ్యాంగుడు షేక్ మహబూబ్ సుభాన్ కొన్నేళ్ల నుంచి కావలిలోని ముసునూరు మర్రిచెట్టు గిరిజన కాలనీలో కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. షేర్ మార్కెట్‌పై తనకున్న అనుభవంతో ట్రైనింగ్ సెంటర్ పేరుతో సుమారు 50మంది నిరుద్యోగులకు ఎర వేశాడు. షిష్టల ప్రకారం 3 నెలలు క్లాసులు చెప్పి ఒక్కొక్కరి నుంచి రూ.15వేలు వసూలు చేశాడు. శిక్షణ అనంతరం వారితోనే కొంత పెట్టుబడి పెట్టిస్తూ వ్యాపారాన్ని విస్తరింపజేశాడు.

● ఉద్యోగులను సన్నిహితులుగా...

కొందరు పోలీస్, రెవెన్యూ, హౌసింగ్ ఇలా ప్రభుత్వ ఉద్యోగులను సన్నిహితులుగా చేసుకుని 2024, ఆగస్టు 15న అనంతార్ధ అసోసియేట్స్ పేరిట ఓ భవనం నిర్మించి కార్యాలయం ప్రారంభించాడు. 17 మంది సభ్యులనూ ఏర్పరుచుకున్నాడు. వీరిలో ఉద్యోగులు, పోలీసుల భార్యలు సభ్యులుగా ఉన్నారు. స్కాం నిర్వాహకుడికి పోలీసులు సన్నిహితంగా ఉంటూ తరచూ కార్యాయానికి వచ్చి పెట్టుబడులు పెడుతూ పెద్దన్న పాత్ర పోషించారు. రూ.లక్ష పెట్టుబడి పెడితే 15రోజులకు రూ.10వేలు చొప్పున 6 నెలలకు రూ.2.5 లక్షలు వస్తాయని స్థానికులకు ఆశ చూపారు. దీంతోపాటు రూ.లక్ష పెట్టుబడికి నెలకు రూ.6వేల నుంచి 10వేల వడ్డీ ఇస్తుండటంతో ఇళ్లలో పాచిపని చేసే వారి నుంచి దినసరి కూలీలు, నిరుద్యోగులు అప్పులు తెచ్చిమరీ పెట్టుబడి పెట్టారు. సుమారు వెయ్యి మందికిపైగా రూ.70 కోట్ల నుంచి 80కోట్ల వరకు పెట్టుబడులు పెట్టినట్లు సమాచారం.



సుభాని కార్యాలయం

● సుభాన్‌పై కేసు నమోదు

గత 4రోజులుగా సుభాన్ ఇంటికి, కార్యాయానికి తాళాలు వేసి అదృశ్యమయ్యాడు. ఫోను చేసిన గ్రూపు సభ్యులకు పర్సనల్ పని ఉందని 10వ తేదీ కార్యాలయం తీస్తానని నమ్మబలికాడు. ఆ తర్వాత ఫోన్‌కు అందుబాటులోకి రాకపోవటంతో కుటుంబ సభ్యులతో పరారైనట్లు గ్రహించారు. విషయం తెలుసుకున్న బాధితులు లబోదిబోమంటూ స్థానిక ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డిని ఆశ్రయించి న్యాయం చేయాలని కోరారు. అలాగే, బాధితుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో సుభాన్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో విచారణ ప్రారంభించారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల ఆకస్మిక తనిఖీ

● 227మందికి రూ.8.24 లక్షల జరిమానా

కందుకూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపాలిటీ పరిధిలో సోమవారం విద్యుత్‌శాఖ విజిలె న్స్ అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహిం చారు. విజిలెన్స్ ఈఈ హైమావతి, కందుకూరు డివిజన్ ఆపరేషన్స్ ఈఈ మల్లెల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కందుకూరు రూరల్ సెక్షన్ పరిధిలోని అధికారులు, సిబ్బంది 36 బృందాలుగా ఏర్పడి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అద నపులోడ్ వినియోగించుకుంటున్న 227 మంది విద్యుత్ వినియోగదారులకు రూ.8.24లక్షల జరిమానా విధించినట్లు అధికారులు వివరాలను వెల్లడించారు.

కందుకూరులో పెట్రో మంట

● ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో పెట్రోలు బంకు
● నామమాత్రపు అద్దెతో 99 ఏళ్లపాటు ఐవోసీకి లీజుకు..
● ప్రజల నుంచి వ్యతిరేకత వస్తున్నా అధికారులు ముందుకే!
● రెవెన్యూ మంత్రిని కలిసిన పలువురు ముఖ్యులు

కందుకూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కందుకూరులోని మండల కార్యాలయాల సముదాయంలో డివిజన్ విద్యాశాఖాధికారి, మండల విద్యాశాఖ, తహసీల్దారు, ఎమ్పీడీవో కార్యాలయాలతోపాటు సబ్ డివిజన్ వ్యవసాయాధికారి, మండల వ్యవసాయాధికారుల కార్యాలయాలతోపాటు భవిత పాఠశాల, కందుకూరు నియోజకవర్గంతోపాటు కొండపి నియోజకవర్గంలోని పలు మండలాలకు సంబంధించిన సబ్ ట్రెజరీ కార్యాలయాలు ఉన్నాయి. వీటన్నిటికంటే ముఖ్యంగా అంగన్వాడీలకు సంబంధించిన డివిజన్ కార్యాలయం, నియోజకవర్గ స్థాయి వెలుగు కార్యాలయాలు ఉన్నాయి. ఈ కార్యాలయాలన్నీ నిత్యం ప్రజలకు అవసరాలు ఉండే కార్యాలయాలు కావటంతో నిత్యం వేలాదిమంది ఆయా కార్యాలయాలకు వస్తుంటారు. ఈ ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి బహిరంగ కార్యక్రమాలు ఉన్నా ఈ ప్రాంగణంలోనే సభావేదిక ఏర్పాటుచేసి నిర్వహిస్తుంటారు. వీటన్నిటికంటే ముఖ్యంగా ఈ ప్రాంగణంలో బ్రిటిష్‌కాలం నాడు నాటిన భారీ వృక్షాలు 40కిపైగా ఉన్నాయి. ఈ ప్రాంతం వాణిజ్య ప్రాంతంగా అభివృద్ధి చెంది ఉన్నందున కేవలం ఒక్క గది నిర్మించి అద్దెకు ఇస్తే నెలకు రూ.15వేలుకన్నా ఎక్కువ ఆదాయం వచ్చే అవకాశం ఉంది. అలాంటి చోట పెట్రోలుబంకు ఏర్పాటుకు స్థలం ఇవ్వాలన్న నిర్ణయం జరిగిందని అధికారులు చెబుతుండటం మరోపక్క. నామమాత్రపు అద్దెతో ఐఓసీకి 99 సంవత్సరాల లీజు ఇవ్వటం దుర్మార్గమని ప్రజాసంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు ఆందోళన చేస్తున్నాయి.ప్రస్తుతం పెట్రోలుబంకు ఏర్పాటుచేయాలంటే ఈ చెట్లను నరకడమేగాక ఆయా ప్రభుత్వ శాఖలకు సంబంధించిన కార్యక్రమాలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. ఇన్ని ఇబ్బందులు ఉన్నా మొండిగా పెట్రోలుబంకు ఏర్పాటు చేయించేందుకు అధికారులు ప్రయత్నిస్తుండటం ఎవరి ప్రయోజనాలకోసమో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదని పలువురు విమర్శిస్తున్నారు.



ప్రభుత్వ కార్యాలయాల సముదాయం, ఆ ప్రాంగణంలోని భారీ వృక్షాలు

● మంత్రిని కలిసిన మాజీ ఎమ్మెల్యే

కందుకూరు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ అభివృద్ధి మండలి అధ్యక్షుడు దివి శివరాంతోపాటు వివిధ ప్రజాసంఘాలు, పలు రాజకీయ పార్టీల నాయకులు పెట్రోలుబంకు ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. కోట్ల విలువైన స్థలాన్ని నామమాత్రపు లీజుకు ఇవ్వటాన్ని సహించేది లేదని అందునా ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలిగించే ఈ చర్యను అడ్డుకుని తీరుతామని హెచ్చరిస్తూ ఉన్నారు. ఇటీవల తమకు కేటాయించిన స్థలాన్ని సర్వే చేసేందుకు వచ్చిన ఐవోసీ సిబ్బందిని మాజీఎమ్మెల్యే దివి శివరాం, పలు ప్రజాసంఘాల నేతలు అడ్డగించటమే గాక ఆ మరుసటి రోజే రాష్ట్ర రెవెన్యూమంత్రి అనగాని సత్యప్రసాద్‌ను వారు కలిసి తమ అభ్యంతరాలను వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి రాబడి పెంచుకోవటమే లక్ష్యం అయితే ప్రధానరోడ్డుపై షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తే అంతకు 15, 20 రెట్ల రాబడి వస్తుందని అదీ అతితక్కువ స్థలంతోనే సరిపోతుందని దానివల్ల ప్రజలకు అసౌకర్యం కూడా ఉండదని వివరించినట్లు శివరాం తెలిపారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు కూడా ఈ నిర్ణయాన్ని పునస్సమీక్షించి పెట్రోలుబంకునకు స్థల లీజు ఉత్తర్వులు రద్దయ్యేలా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే ఇంటూరి



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక వసతుల కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని జాతీయ రహదారి నుంచి రోళ్లపాడు, కొండ సముద్రం, పోకూరు శివాలయం నుంచి శింగమనేనిపల్లెలో రూ.4.50కోట్ల నిధులతో చేపట్టనున్నలోకి బీటీ రోడ్ల పనులకు సోమవారం ఎమ్మెల్యే నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాలకు వచ్చిన ఎమ్మెల్యేకు ఆయా గ్రామాల నాయకులు పూలవర్షంతో స్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. అంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 8 నెలల కాలంలోనే నియోజకవర్గంలో రూ.15కోట్లతో సిమెంటు రోడ్లు, మరో రూ.11కోట్లతో బీటీ రోడ్లు వేస్తునట్లు తెలిపారు. కందుకూరును ప్రకాశం జిల్లాలోకి కలిపేందుకు ఈ నెల 15న రానున్న సీఎం చంద్రబాబునాయుడుకు వినతిపత్రం అందజేయనున్నట్లు చెప్పారు. కందుకూరు మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.10కోట్లతో డ్రైనేజీలు, సిమెంటు రోడ్లు వేస్తునట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నరేంద్రదేవ్, పీఆర్ ఏఈ చంద్రమౌళి, ఏపీఓ ఉమామహేష్, పార్టీ మండలాధ్యక్షుడు మాదాల లక్ష్మీరసింహం, వలేటి మధుసూధన్‌రావు, నరసింహం, కొంకా రమేష్, కాకుమాను ఆంజనేయులు, వీరమోసు అంజయ్య, కాకుమాను మాల్యాద్రి, గుత్తా మహేశ్వరరావు, మార్తాల వెంకటేశ్వరరెడ్డి, పిల్లి రామచంద్రారెడ్డి, ఘట్టమ నేని సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

తరగతులను తరలించొద్దని విద్యార్థుల ఆందోళన



సంగం: పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

సంగం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్ ఎస్ ప్రాథమిక పాఠశాలలోని 3, 4, 5 తరగతుల విద్యార్థులను నార్త్ పాఠశాలకు తరలించొద్దని విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈమేరకు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు తీర్మానం చేసి ఎంపీడీవోకు, ఎంఈవోకు వినతి పత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్, సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

●అనంతసాగరం : మండలంలోని ముత్తుకూరు, గార్లదిన్నెపాడు విద్యార్థులను పాతదేవరాయపల్లి మోడల్ స్కూల్‌కు విలీనం చేయడాన్ని నిరసిస్తూ సోమవారం ఎంఈవో కార్యాలయం ఎదుట గ్రామస్థులు ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ తమ గ్రామ సమీపంలో వాగు ఉందని, నిత్యం ప్రవాహం కొనసాగుతూ ఉంటుందని దీంతో విద్యార్థులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని, విలీనం ఆపాలని డిమాండ్ చేస్తూ ఎంఈవో ప్రభాకర్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు రాపూరు సురేంద్రరెడ్డి, సుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి విద్యార్థుల తలిదండ్రులు పాల్గొన్నారు.

రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య కార్డుల పంపిణీ

చేజర్ల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): భూములు కలిగిన ప్రతి రైతు ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య కార్డులు పొందాలని మండల వ్యవసాయశాఖ అధికారి వి శశిధర్ తెలిపారు. సోమవారం చేజర్ల మండలం మాముడూరులో ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్యపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గుర్తింపు సంఖ్య ద్వారా ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఇతర వ్యవసాయ శాఖకు సంబంధించిన సేవలు పొందడానికి సులభతరం అవుతుందన్నారు. అదేవిధంగా తెగుళ్ల నియంత్రణ, వాతావరణ సూచనలు తదితర సేవలను పొందవచ్చన్నారు. కావున రైతులు తమ ఆధార్ నెంబర్, మొబైల్ నెం, పట్టాదారు పాసు పుస్తకాలతో గ్రామాలలోని రైతు సేవా కేంద్రాల వద్ద వ్యవసాయశాఖ సిబ్బందిని సంప్రదించి ప్రత్యేక గుర్తింపు సంఖ్యను పొందవచ్చునని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు పాల్గొన్నారు.

●ఉలవపాడు : ఆధార్ కార్డు తరహాలో రైతులకు 11అంకెలతో కూడిన ప్రత్యేక విశిష్ట కార్డును కేంద్ర ప్రభుత్వం జారీ చేయున్నట్లు సోమవారం మండల వ్యవసాయ శాఖ అధికారిణి తిరుమల జ్యోతి తెలిపారు. ఇకపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల రాయితీలు పొందాలంటే రైతులకు ప్రత్యేక గుర్తింపు కార్డు తప్పనిసరి కావడంతో దగ్గరలోని రైతుసేవా కేంద్రాల్లో 11అంకెల విశిష్ట సంఖ్యను నమోదు చేసుకోవాలని సూచించారు.

ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేయాలి



ఆర్డీవోకి వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘాల నేతలు

ఆత్మకూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన వరి ధాన్యాన్ని గిట్టుబాటు ధర కల్పిస్తూ ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, కౌలు రైతు సంఘం నాయకులు గంటా లక్ష్మీపతి, లక్కు కృష్ణప్రసాద్ కోరారు. ఈమేరకు సోమవారం ఆర్డీవో బి పావనికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాటాడుతూ ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే రూ. 500 అదనంగా ఇవ్వాలన్నారు. అదేక్రమంలో ఈక్రాప్ నమోదు గాని రైతుల ధానాన్ని కొనుగోలు చేయాలని, రైతులు మిల్లులకు ధాన్యాన్ని తీసుకుపోయే పద్ధతికి స్వస్థి పలకాలని డిమాండ్ చేశారు. రైతులకు సరిపడ గోతాలు అందుబాటులో ఉంచాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారికి అనువుగా ఏర్పాటు చేయాలని కోరారు. ఈనెల 22న నెల్లూరులో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసేందుకు రైతులు భారీగా తరలిరావాలని కోరారు.

ఉదయగిరిలో దెబ్బతిన్న రోడ్ల పరిశీలన



దెబ్బతిన్న రోడ్లను పరిశీలిస్తున్న డీఈ మణికుమార్

ఉదయగిరి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి పట్టణంలోని కోళ్లవీధి, నాగుల బావివీధి, అగ్రహారం, బ్రాహ్మణవీధి, దిలావర్‌భాయ్‌వీధి తదితర ప్రాంతాల్లో దెబ్బతిన్న సిమెంట్ రోడ్లను సోమవారం పంచాయతీరాజ్ డీఈ సీహెచ్ మణికుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణానికి చెందిన టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు షేక్ రియాజ్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్ల దుస్థితిని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి తీసుకెళ్లారన్నారు. ఆయన ఆదేశాల మేరకు దెబ్బతిన్న రోడ్లను పరిశీలించినట్లు, త్వరలో ఆయా రోడ్లకు ప్రతిపాదనలు పంపి నిధులు మంజూరు కాగానే నిర్మాణం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ టెక్నికల్ అధికారి రాజశేఖర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు వెంకటేశ్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

కంపు కొడుతున్న పట్టణాలు, పల్లెలు

● పడకేసిన పారిశుధ్యం ● అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ ● అవస్థలు పడుతున్న ప్రజలు



ఉదయగిరిలోని సుద్ధబావివీధిలో రహదారిపై ప్రవహిస్తున్న మురుగు నీరు



ఉదయగిరి మండలం వెంకట్రావుపల్లిలో సిమెంట్ రోడ్డుపై చేరిన మురుగు

ఉదయగిరి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో మురుగుతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. సుద్ధబావివీధి, యాదవపాళెం, దేవలాలగడ్డ, తుపాన్‌నగర్, సినిమా హాలు వీధి, బాలాజీ నగర్ తదితర ప్రాంతాల్లో మురుగు కాలువలు సక్రమంగా లేకపోవడంతో ఖాళీ స్థలాలు, రహదారులపై మురుగునీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. రాకపోకలకు ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొన్ని ప్రాంతాల్లో కాలువలు నాసిరకంగా నిర్మించడంతో ధ్వంసమై మురుగు నీరు ముందుకు సాగడంలేదు. డ్రైనేజీ వ్యవస్థను బాగు చేయాలని పాలకులు, అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పంచాయతీల్లో పడకేసిన పారిశుధ్యం

మండలంలోని పంచాయతీల్లో పారిశుధ్యం పడకేసింది. కొండాయపాళెం, తిరుమలాపురం, జీ.చెర్లోపల్లి, జీ.చెరువుపల్లి, శకునాలపల్లి, దాసరిపల్లి, అప్పసముద్రం తదితర పంచాయతీల్లో మురుగు కాలువలు పూర్తిస్థాయిలో లేకపోవడంతో నివాసాల్లో నుంచి వచ్చే మురుగునీరంతా రహదారులు, ఇళ్ల నడుమ నిల్వ చేరడంతో ప్రజలు దుర్గంధంతో అల్లాడుతున్నారు. మరోవైపు దోమలకు నిలయంగా మారి వ్యాధులు ప్రబలుతున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సత్వరమే స్పందించి మురుగునీరు రోడ్లపై ప్రవహించకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నులిపురుగుల నివారణతో చిన్నారుల్లో ఎదుగుదల

● అదనపు డీఎంహెచ్‌వో ఖాదర్‌వల్లి



కావలి: విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్ర వేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో బ్రిజిత

సంగం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల ఎదుగుదలకు నులిపురుగుల నివారణ మాత్రలు దోహదపడతాయని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వల్లి పేర్కొన్నారు. సోమవారం ఆయన స్థానిక డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాల, గాంధీ జన సంఘం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు మింగించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎంపీడీవో షాలెట్, స్థానిక వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, అశోక్, ప్రిన్సిపాల్ సుమతి, హెచ్‌ఎం మల్లికార్జునరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

●ఏఎస్ పేట: స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని అన్ని పాఠశాలల్లోని విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలను మింగించారు. కార్యక్రమంలో డా మంజుల తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా చిరమన పీహెచ్‌సీ పరిధిలోని పాఠశాలలో విద్యార్థులకు వైద్యులు జ్యోతిరాణి, నాగవినూత ఆధ్వర్యంలో మాత్రలను పంపిణీ చేశారు.

●ఉదయగిరి : మండలంలో 97 శాతం మంది విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను మింగించినట్లు మండల వైద్యాధికారులు శివకల్పన, వినీతలు పేర్కొన్నారు. మండలంలోని నేలటూరు, గన్నేపల్లి, ఉదయగిరి పట్టణంలోని బీసీ కాలనీల్లో విద్యార్థులకు మాత్రలను మింగించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో శివకుమారి, ఆరోగ్య బోధకుడు వెంకటసుబ్బయ్య, వైద్యఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

●దుత్తలూరు: మండలంలోని నర్రవాడ పీహెచ్‌సీ పరిధిలో 96, దుత్తలూరు పీహెచ్‌సీ పరిధిలో 93 శాతం మంది చిన్నారులకు నులిపురుగుల మాత్రలు మింగించినట్లు వైద్యాధికారులు మనోజ్ఞ, అయూబ్‌లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు నర్రవాడ, నందిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు మాత్రలు మింగించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు రియాజ్, ఖాజామొహిద్దీన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

●సీతారామపురం : స్థానిక కస్తూర్బా విద్యాలయం వద్ద సోమవారం జిల్లా మలేరియా అధికారి హుస్సేనమ్మ, డాక్టర్ స్వప్న ఆధ్వర్యంలో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థినులకు అల్బెండజోల్ మాత్రలను మింగించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవి స్కూల్ ప్రిన్సిపాల్ షాజియా, ఎంపిహెచ్ఇవో మజీద్, ఎంపిహెచ్ఎస్ రియాజ్, నౌషాద్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

●కావలి: తుమ్మలపెంట గురుకుల పాఠశాల విద్యార్థులకు కావలి డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌వో బ్రిజిత నులిపురుగుల మాత్రలు వేయించారు. కార్యక్రమంలో తుమ్మలపెంట వైద్యాధికారి అనీల్‌కుమార్, సహాయక సిబ్బంది, భాస్కర్, ఏఎన్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● బిట్రగుంట: పీహెచ్‌సీ వైద్యాధికారి జిహారిక కప్పరాళ్లతిప్పలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందు వేశారు. ప్రిన్సిపాల్ పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● కొండాపురం: 18మండల వైద్యాధికారులు నసీరుద్దీన్, వినీతలు జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో పాల్గొన్నారు. అలాగే మండలకేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో ఆదినారాయణ, ఎంఈవో-1 కె.రవికుమార్, ఈవోపీఆర్‌డీ నారాయణ పాల్గొని విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేయించారు. కార్యక్రమాల్లో సీహెచ్.చెంచురామయ్య, సూపర్‌వైజర్లు సరోజినీదేవి, అక్బర్ భాషా, ఏఎన్ఎం లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

●ఉలవపాడు: మండలంలోని ప్రభుత్వ ప్రవేటు పాఠశాలలు, అంగన్‌వాడీకేంద్రాలు, జూనియర్ కాలేజిలోని 5,645మందిలో 5,539మంది విద్యార్థులకు సోమవారం ఆల్బెండజోల్ మాత్రలు వేసినట్లు కరేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు శ్రీనివాసరావు, వైద్యులు రమ్యజ్యోతి తెలిపారు. పాఠశాలకు రాని విద్యార్థులకు ఈనెల 17న మాత్రలు వేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో లక్ష్మీ నారాయణ, పీహెచ్ ఎన్ సీతారాములు, హెచ్‌వీ వసంత, సీహెచ్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

●లింగసముద్రం: మండలంలోని 97శాతం మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు మండల పీహెచ్‌సీ వైదాధికారి రమేష్ తెలిపారు. వైద్యులు అనూరాధ, సీహెచ్ఓ శ్రీనివాసులు, ఎంఈఓ-2 ఎంవీ.శివకుమార్ ఆరోగ్య సిబ్బంది అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని 5,217 మంది పిల్లలకు ఈ మందు వేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు క్షత్రియకుమారి, మహబూబ్ బాషా, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

● కలిగిరి: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు మండల వైద్యాధికారి బిజ్జం గీతారెడ్డి అల్బెండజోల్ మాత్రలు వేయించారు. కార్యక్రమంలో సీ హెచ్ఓ సాయి లక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ పద్మ, హైస్కూల్ ఇన్‌చార్జి సుగుణమ్మ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గుండెపోటు నివారణకు ఉచితంగా ఇంజక్షన్

కందుకూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తీవ్రమైన గుండెపోటు వచ్చిన వారికి గంటలోపు టెనెక్టెప్లస్ అనే ఖరీదైన ఇంజెక్షన్ ఇస్తే వారి ప్రాణాలను నిలబెట్టే అవకాశం ఉందని, అయితే ఆ ఇంజక్షన్ వేయించటం అందరికీ ఆర్థికస్థోమతకు సాధ్యం కాదన్నారు. అలాంటి వారికి ఉచితంగా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని కందుకూరు ఏరియా హాస్పటల్ వైద్యులు తులసీరామ్ తెలిపారు. ప్రస్తుతం ఈ ఇంజక్షన్ కందుకూరు ఏరియా హాస్పటల్‌లో అందుబాటులో ఉందని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇటీవలికాలంలో గుండెపోటు మరణాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈనిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇప్పటికే 10మందికి ఈ ఇంజక్షన్ ఇచ్చి వారి ప్రాణాలను కాపాడినట్లు తెలిపారు.

● వింజమూరు : ప్రభుత్వ వైద్యశాలలో గుండెకు సంబంధించిన ఛాతీనొప్పికి ఇంజక్షన్‌ను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు డీడీఓ కార్తీక్ తెలిపారు. సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఇంజక్షన్ ఛాతీనొప్పి వచ్చిన ఆరు గంటలలోపు వేయించుకోవాలని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో డాక్టర్ శ్వేత, మసూద్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు : సీఐ



ఆత్మకూరు: అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న సీఐ గంగాధర్

ఆత్మకూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మహిళలు, విద్యార్థినులపై ఎవరైనా లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ జి గంగాధర్ హెచ్చరించారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థినులకు లైంగిక దాడులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్లు అనుమానం కలిగినా వారి గురించి తల్లిదండ్రులకు, సన్నిహితులకు, పోలీసులకు గాని తెలిచేయాలని సూచించారు. త్వరలో పాఠశాలల సమీపంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కోటేశ్వరమ్మ, గ్రైడ్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు వాగాల శ్రీహరి, వ్యాయామ ఉపాధ్యాయురాలు వసుంధర పాల్గొన్నారు.

● ఏఎస్ పేట: విద్యార్థినులు పాఠశాలకు వచ్చి వెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సంగం సీఐ వేమారెడ్డి సూచించారు. సోమవారం ఆయన శ్రీకొలను గ్రామంలోని జడ్పీ హైస్కూల్‌లో ఎస్ఐ సైదులుతో కలసి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాలికల చట్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

'కస్తూర్బా' పరిసరాలను పరిశీలించిన డీఎస్పీ

● వార్డెన్ ఫిర్యాదుతో కేసు నమోదు

కావలి రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మసునూరులో ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం పరిసరాలను సోమవారం సాయంత్రం డీఎస్పీ శ్రీధర్ పరిశీలించారు. వ్యక్తి గోడదూకి బాలికల విద్యాలయంలోకి రావడంపై హాస్టల్ వార్డెన్ సంధ్యారాణి ఫిర్యాదుతో రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. విద్యార్థులు ఎలాంటి భయాందోళనలకు గురికావద్దన్నారు. విద్యాలయ ఆవరణలో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయించటంతో పాటు పోలీస్ గస్తీ ఏర్పాటు చేస్తామని డీఎస్పీ హామీ ఇచ్చారు. ఆయన వెంట రూరల్ సిఐ రాజేశ్వరావు, సిబ్బంది ఉన్నారు.

పచ్చని పొలాల జోలికి రావొద్దు

ఉలవపాడు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): బీపీసీఎల్ కంపెనీ స్థాపనలో భాగంగా పచ్చని పొలాలను వదులుకోవడానికి సిద్ధంగా లేమని బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన స్థానిక రైతులతో కలిసి పొలాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. 16గ్రామాలతో కరేడు మేజర్ పంచాయతీ ఏర్పడిందని, సముద్ర తీరంలో వందల ఎకరాల్లో వేరుశన పంట ఏడాడికి రెండు కార్లు పండిస్తారని చెప్పారు. వీటితోపాటు ఆకుకూరలు, కూరగాయల సాగు చేస్తారని తెలిపారు. సాగులో భూములు లాక్కోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నట్లు వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు తీర ప్రాంత పల్లెల్లో అధికారులు సర్వే కొలతలు చేపట్టారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ ఆలోచనలు ఉప సంహ రించుకోవాలని లేని పక్షంలో ప్రజా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.



నిరసన తెలుపుతున్న బీసీ నాయకుడు శ్రీనివాసులు, తదితరులు

ప్రభుత్వ భూములు పేదలకు పంచాలి

● ఆర్డీవో కార్యాలయం ఎదుట దళితుల ధర్నా



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దళితులు

కావలి, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): పట్టణంలో రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించుకున్న ప్రభుత్వ భూము లను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పేదలకు పంపిణీ చేయాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి డిమాండు చేశారు. ఈ మేరకు సోమవారం ఆర్డీవో కార్యా లయం ఎదుట ధర్నా చేసి ఆర్డీవో ఎం.వంశీక్రష్ణకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. రియల్‌ఎస్టేట్ వ్యాపారులు కాలువలు, గుంటలు, వంకలు, సీజేఎఫ్ఎస్ తదితర ప్రభుత్వ భూములు వంద ఎకరాలకు పైన ఆక్రమించుకుని లేఅవుట్లలో కలుపుకున్నారన్నారు. ఆ భూములన్నింటినీ స్వాధీనం చేసుకుని పేదల కు పంపిణీ చేస్తే వారి సమస్య తీరుతోందన్నారు. పట్టణంతో పాటు బోగోలు, అల్లూరు మండలాల్లో కూడా ఆక్రమణకు గురైన భూములను స్వాధీనం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో దళితనేతలు జరుగుమల్లి విజయరత్నం, కత్తి ప్రభాకర్, చలంచర్ల లక్ష్మయ్య, శ్రీనివాసులు, భాస్కర్ పాల్గొన్నారు.

గ్రామాల్లో రోడ్లకు మహర్దశ

● షేక్ ఖాదర్‌మస్తాన్, ఏఈ



ఆత్మకూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రోడ్లకు మహర్దశ పట్టింది. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తొలి విడతలో అన్ని గ్రామాల్లో రోడ్ల పనులు చేపట్టామని పంచాయతీరాజ్‌శాఖ ఏఈ షేక్ ఖాదర్ మస్తాన్ తెలిపారు.

ముఖాముఖి

? గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి ఎన్ని నిధులు మంజూరు అయ్యాయి.

! మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు మెటీరియల్, వేజ్ కాంపోనెంట్ ద్వారా మొదటి విడతలో ఉపాధి నిధుల కింద రూ. 1.76 కోట్లు మంజూరయ్యాయి.

? కేటాయించిన నిధులతో ఎన్ని కిలోమీటర్ల మేర సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టారు.

! మండలానికి కేటాయించిన నిధులతో మొత్తం 38పనులు మంజూరయ్యాయి. ఇప్పటికి 29 పనులు పూర్తిచేశాం. మిగిలినవి వివిధ దశల్లో నిర్మా ణంలో ఉన్నాయి.

? రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నారా.

! గ్రామాల్లో చేపట్టిన రోడ్ల నిర్మాణ పనులను సచివాలయం ఇంజనీరింగ్ సిబ్బంది దగ్గరుండి పర్యవేక్షించారు. నిర్మాణం అనంతరం క్వాలిటీకంట్రోల్ విభాగం నాణ్యతను నిర్ధారించిన తరువాతే సంబంధిత బిల్లులు మంజూరవుతాయి. కావున నిర్దేశించిన ప్రమాణాల గురించి అవగాహన కల్పించి పనులు చేపట్టేలా చూశాం.

న్యూస్ బాక్స్

వేణుగోపాలస్వామి రథం తయారీకి సన్నాహాలు

ఉలవపాడు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీవేణుగోపాల స్వామి నూతన రథం తయారు చేయించేందుకు సోమవారం దేవదాయ శాఖ ఇంజనీరు అధికారులు పాత రథం కొలతలు తీసుకుననట్లు సోమవారం ఆలయ ఈవో శ్రీనివాస్ తెలిపారు. 90 ఏళ్లనాటి రథం పూర్తిగా శిధిలావస్థతకు చేరుకోవడంతో తయారీకి కావాల్సిన ప్రణాళిక అయిన వెంటనే రూ.80లక్షల అంచనాలతో నూతన రథం పనులు మొదలు పెట్టనున్నట్లు ఈవో తెలిపారు.

కూలీల పనిదినాలు పెంచాలి

కావలి, ఫిబ్రవరి10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో మహాత్మాగాంధీ ఉపాధిహామీ నిధులు పెంచి ఉపాధి కూలీలకు పని దినాలు పెంచాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్రకమిటీ సభ్యులు మాల్యాద్రి డిమాండు చేశారు. ఈమేరకు సోమవారం ఆర్డీవో ఎం వంశీక్రిష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి రాధాక్రిష్ణ పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి

వింజమూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలో భూ సమస్యలను రెవెన్యూ అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు యాదవ్ సోమవారం తహసీల్దారును కోరారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశం మేరకు తహసీల్దారును కలిసి వినతి పత్రం అందచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గంగపట్ల వెంగయ్య, నీలం పెరుమాళ్, శ్రీను, చిలకల వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'పరీక్షా పే'పై అవగాహన

ఉదయగిరి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పరీక్షా పే కార్యక్రమం విద్యార్థుల్లో మానసిక వత్తిడిని తగ్గించి ప్రేరణ, ఆత్మస్థైర్యాన్ని నింపుతుందని ఎంఈవో-2 శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పరీక్షా పే కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బాల కేశవులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సర్టిఫికెట్ల పరిశీలన

ఉదయగిరి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం కేంద్ర ప్రభుత్వ సంస్థ సంయుక్త ప్రాంతీయ కేంద్రం ఆధ్వర్యంలో దివ్యాంగులు, వయోవృద్ధుల శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా దివ్యాంగుల సంక్షేమ సంఘం అసిస్టెంట్ డైరెక్టరు మహమ్మద్‌అయూబ్ దివ్యాంగుల సదరం సర్టిఫికెట్లు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్వరలో మూడుచక్రాల వాహనాలు, వినికిడి యంత్రాలు, వీల్‌చైర్ తదితర ఉపకరణాలు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారులు దేవి, సంధ్యారాణి, ఏవో పద్మజ, జూనియర్ అసిస్టెంట్ సమద్, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

యువకుల రక్తదానం

కందుకూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల సమావేశ మందిరంలో సోమవారం స్థానిక రక్తదాతల సమూహం, సక్షమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంను కందుకూరు డీఎస్పీ సీహెచ్‌వీ బాలసుబ్రహ్మణ్యం ప్రారంభించారు. శిబిరంలో 30మంది యువకులు పాల్గొని రక్తదానం చేశారు. ఒంగోలు రెడ్‌క్రాస్ సొసైటీ రక్తనిల్వ కేంద్రం కోసం ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కందుకూరు రెడ్‌క్రాస్ సబ్‌బ్రాంచ్ చైర్మన్ చెన్నా రామాంజనేయులు, పూరిపర్తి శ్రీనివాసరావు, బొజ్జా చంద్రమోహన్, కనపర్తి మల్లికార్జున, ఓరుగంటి రమేష్, చన్నా రంగనాయకులు పాల్గొన్నారు.